thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 280 కరీంనగర్ బుధవారం, 17 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌లో పెరుగుతున్న అంటువ్యాధులు

న్యూఢిల్లీ : భారత్‌లో అంటువ్యాధుల వ్యాప్తి క్రమంగా పెరుగుతోంది. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంటువ్యాధుల వ్యాప్తి 10.7 శాతం గా నమోదవగా.. రెండో త్రైమాసికంలో ఇది 11.5 శాతా నికి పెరిగింది. ఐసీఎంఆర్ అధ్యయనంలో భాగంగా దేశ వ్యాప్తంగా పరీక్షించిన ప్రతి 9 మందిలో ఒకరిలో సంక్రమి త వ్యాధికారకాలు ఉన్నట్టు తేలింది.

ఐసీఎంఆర్ నెట్‌వర్క్ కింద ఉన్న ల్యాబ్‌ల్లో 4.5 లక్షల మందిని పరీక్షించగా 11.1 శాతం మందిలో వ్యాధికారక సూక్ష్మజీవులు ఉన్న ట్టు కనుగొన్నారు. అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ (ఏఆర్ఐ) కేసుల్లో ఇన్‌ఫ్లుయెంజా-ఏ, తీవ్రమైన జ్వరం, రక్తస్రావం కేసుల్లో డెంగీ వైరస్, కామెర్ల కేసుల్లో హెపటైటిస-ఏ, డయేరియా కేసుల్లో నోరోవైరస్, అక్యూట్ ఎన్సిఫాలిటిస్ సిండ్రోమ్ (ఏఈఎస్) కేసుల్లో హెర్పస్ సింప్లెక్స్ వైరస్ (హెచ్ఎసవీ)లను టాప్-5 వ్యాధికారకాలుగా గుర్తించారు.




## బీఆర్ఎస్ఎల్పీ సమావేశం తేదీలో మార్పు..

హైదరాబాద్, డిసెంబర్ 16: మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని వాయిదా వేశారు. ఈనెల 19న జరగాల్సిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశాన్ని ఈనెల 21కి వాయిదా వేసినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటించారు. ఈ నెల 19వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొనడం కోసం సమావేశాన్ని వాయిదా వేసుకున్నట్లు తెలిపారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఈ నెల 21న తెలంగాణ భవన్ వేదికగా సమావేశం జరుగనుందని తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు పాల్గొననున్నట్లు మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడించారు.




## అగ్గిపెట్టలో ఇమిడే చీర నేసి.. యాదాద్రి ఆలయంలో సమర్పించిన నేతన్న

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఓ చేనేత కళాకారుడు అగ్గిపెట్టెలో ఇమిడే చీరను కానుకగా అందించాడు. సిరిసిల్లకు చెందిన నేతన్న నల్ల విజయ్ రెండు గ్రాముల బంగారంతో అగ్గిపెట్టెలో ఇమిడేలా చీరను నేశాడు. మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు, ఏఈఓ సమక్షంలో ఈ చీరను బహూకరించాడు. దీని పొడవు 5:30 మీటర్లు వెడల్పు 48 ఇంచులు అని విజయ్ తెలిపాడు.




ఆసిఫాబాద్: కుమురం భీం ఆసిఫాబాద్‌లో జిల్లాలో 16 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. సిర్పూర్ (యు) మండలం పెద్దదోబలోని ఓ పూరిగుడిసెలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో ఆ ప్రదేశంలో కూంబింగ్ నిర్వహించి వారిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా తేల్చారు. వారి నుంచి ఏకే 47, రెండు ఇన్సాస్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన మావోయిస్టులను హైదరాబాద్‌కు తరలించారు.




దిల్లీ: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌తో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు సీఎం అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ కోరారు. యంగ్ ఇండియా స్కూళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను పంపాలని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి సూచించారు. దాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సీఎం సమావేశమయ్యారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సీఎం సమావేశమయ్యారు. హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐఐఎం కోసం 200 ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణకు 9 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు మంజూరు చేయాలని కోరారు.

# నేడే తుది పోరు!

## చివరి విడత పంచాయతీ ఎన్నికలకు... పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం



హైదరాబాద్ : బుధవారం తెలంగాణ వ్యాప్తంగా చివరి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. నిన్నటితో ఎన్నికల ప్రచారం కూడా ముగిసింది. ఇక చివరి విడతలో మొత్తం 182 మండలాల్లోని 4వేల 157 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. ఇప్పటికే 394 పంచాయతీ స్థానాలు ఏకగ్రీవమైనట్టు ఈసీ వెల్లడించింది. మరో 11 సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో మిగిలిన 3వేల 752 సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ స్థానాల్లో 12వేల 640 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అలాగే మొత్తం 36వేల 434 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే 7వేల 916 స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మరో 112 స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో మిగిలిన 28 వేల 406 వార్డులకు 75వేల 283 మంది బరిలో నిలిచారు. ఇక రేపు జరగబోయే చివరి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 53 లక్షల 6వేల 401 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 26 లక్షల 18 వందల 61 మంది కాగా.. మహిళా ఓటర్లు 27 లక్షల 4 వేల 394 మంది ఉన్నారు. అలాగే 146 మంది ఇతర కేటగిరీ ఓటర్లు ఓటేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 36వేల 483 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేసింది ఎన్నికల సంఘం. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. రేపు సాయంత్రంలోపు ఫలితాలను వెల్లడించనుంది ఈసీ. ఇప్పటికే రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసిన ఈసీ.. చివరి దశ పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ స్టేషన్ల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా.. భారీగా పోలీసులను మోహరించనున్నారు.




## నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీకి షాక్.. సోనియా, రాహుల్‌కు ఊరట

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో మంగళవారం ఢిల్లీ రోజ్ అవెన్యూ కోర్టు నుంచి కాంగ్రెస్ దిగ్గజ నేతలు సోనియా, రాహుల్ గాంధీలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన తాజా చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు కోర్టు నిరాకరించింది. ఈడీ జరిపిన దర్యాప్తు.. కొత్తగా నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా కాకుండా, బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన ప్రైవేట్ ఫిర్యాదు, మేజిస్ట్రేట్ జారీ చేసిన సమన్ల ఉత్తర్వుల ఆధారంగానే జరిగిందని కోర్టు గమనించింది. అందుకే ఎఫ్ఐఆర్ కాపీని పొందే అర్హత ఈ దశలో నిందితులకు లేదని కూడా కోర్టు తీర్పునిచ్చింది. అయితే ఈ కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగించేందుకు ఈడీకి అనుమతి ఇచ్చింది. ఈ కేసులో మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈడీ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ)సోనియా , రాహుల్ తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. తమ అగ్ర నాయకత్వంపై కేంద్రంలోని మోదీ-షా ద్వయం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ వేధింపులు, బెదిరింపులు, ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించింది. నేషనల్ హెరాల్డ్ కేసు పూర్తిగా అవాస్తవమని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందని కాంగ్రెస్ వాదించింది. కాంగ్రెస్ చేసిన ఈ ఆరోపణలను బీజేపీ తిరస్కరించింది. సీనియర్ బీజేపీ నేత, కేంద్ర మాజీ న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ కాంగ్రెస్ వాదనలను నిరాధారమని కొట్టిపారేశారు. ఈ ప్రైవేట్ ఫిర్యాదు దాఖలైనప్పుడు ప్రధాని మోదీ పదవిలో లేరని, ఈ కేసు 2008 నాటిదని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు మానుకొని, వారు చేసిన దోపిడీకి లెక్కలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. చట్టం తన పని తాను చేసుకోనివ్వాలని ఆయన పేర్కొన్నారు.

# ఢిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై ఘోర ప్రమాదం..

## ఒకేసారి ఏడు బస్సులకు మంటలు.. 13 మంది మృతి




యూపీ : ఇటీవల హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు వద్ద ఘోర అగ్ని ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఒకేసారి ఏడు బస్సులు, మూడు కార్లు ఢీకొన్న ఘటన యమునా ఎక్స్ ప్రెస్ వే పై మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ ఘటనలో 13 మంది మృతి చెందగా, 75 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు.

అవును... యూపీలోని మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో భాగంగా.. మధుర జిల్లాలోని బాల్దియో పోలీస్ స్టేషన్ పరిధిలోని మైల్ స్టోన్ 127 సమీపంలోని యమునా ఎక్స్ ప్రెస్ వే లోని ఆగ్రా-నొయిడా స్ట్రెచ్ లో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం తర్వాత నాలుగు బస్సులకు మంటలు అందుకోవడంతో బాధితులు సజీవ దహనం అయ్యారని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి! గాయపడిన వారందరనీ ప్రాథమిక చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనపై స్పందించిన మధుర ఎస్.ఎస్.పీ. శ్లోక్ కుమార్... తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో దృశ్యమానత తక్కువగా ఉండటం అల్ల సుమారు ఏడు బస్సులు, మూడు చిన్న వాహనాలు ఒకదానికొనటి ఢీకొన్నాయని తెలిపారు. ఢీకొన్న తర్వాత వాహనాలు మంటల్లో చిక్కుకున్నాయని వెల్లడించారు. ఈ సమయంలో సహాయక చర్యలు దాదాపు పూర్తయ్యాయని చెప్పిన శ్లోక్ కుమార్.. ఇప్పటివరకూ నలుగురు మరణించినట్లు నిర్ధారించబడిందని వెల్లడించారు. గాయపడిన 25 మందిని ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఎక్స్ ప్రెస్ వే పూర్తిగా బ్లాక్ చేయబడిందని.. ట్రాఫిక్ వెనుక నుంచి మళ్లించబడిందని.. ప్రభుత్వ వాహనాలను ఉపయోగించి మిగిలిన ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపామని అన్నారు.

ఈ సందర్భంగా స్పందించిన మధుర రూరల్ ఎస్పీ సురేష్ చంద్ర రావత్.. మొదటి మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయని.. ఆ తర్వాత ఏడు బస్సులు వాటిపైకి దూసుకుపోయాయని తెలిపారు. ఈ సమయంలో పదకొండు యంత్రాలు సంఘటన స్థలంలో ఉన్నాయని.. మంటలను ఇప్పుడు అదుపులోకి తెచ్చారని.. ఇప్పటివరకూ నాలుగు మృతదేహాలను వెలికితీశారని తెలిపారు.



# సిడ్నీ ఉగ్రదాడి నిందితుడికి హైదరాబాద్‌లో మూలాలు..

–ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఇటీవల చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనకు సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బోండీ బీచ్‌లో కాల్పులు జరిపిన నిందితుల్లో ఒకడైన సాజిద్ అక్రమ్ (50) వద్ద భారత పాస్‌పోర్ట్ ఉన్నట్లు ఆస్ట్రేలియా అధికారులు గుర్తించారు. అతడు హైదరాబాద్ నుంచి పాస్‌పోర్టు పొందినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణ డీజీపీ కార్యాలయం దీనిపై ప్రకటన విడుదల చేసింది. సాజిద్ అక్రమ్ హైదరాబాద్ వ్యక్తి అని వెల్లడించింది. "బీకామ్ చదివిన సాజిద్ 27 ఏళ్ల క్రితం 1998లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియా వెళ్లాడు. యూరోపియన్ యువతి వెనెరా గ్రోసోను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు నవీద్ అక్రమ్, కుమార్తె. వీరిద్దరూ ఆస్ట్రేలియా పౌరులే. సాజిద్ అక్రమ్ ఇప్పటికీ భారత పాస్‌పోర్టునే వినియోగిస్తున్నాడు. అయితే, హైదరాబాద్‌లో అతడికి అతి తక్కువ కాంటాక్ట్స్ ఉన్నాయి. ఆస్ట్రేలియాకు వలస వెళ్లాక సాజిద్ ఆరుసార్లు భారత్‌కు వచ్చాడు. కుటుంబ, ఆస్తులకు సంబంధించిన వ్యవహారాల కోసమే ఇక్కడకు వచ్చాడు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు అతడికి ఎలాంటి నేర చరిత్ర లేదు. ఉగ్రవాదులతో సాజిద్‌కు సంబంధాలపై తమకేమీ తెలియదని హైదరాబాద్‌లోని కుటుంబసభ్యులు తెలిపారు" అని తెలంగాణ డీజీపీ కార్యాలయం తమ ప్రకటనలో వెల్లడించింది.

**ఉగ్రవాదులు తండ్రీ కుమారులే..** సిడ్నీలోని బోండీ బీచ్‌లో ఆదివారం యూదులు 'హనుక్కా ఉత్సవం చేసుకుంటుండగా ఈ ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు 24 ఏళ్ల నవీద్ అక్రమ్.. విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సాజిద్ హతమవ్వగా.. నవీద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరికి ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్)తో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు.

# తెలంగాణలో వక్ఫ్ భూములపై దృష్టి పెట్టాం:మంత్రి అజారుద్దీన్



హైదరాబాద్, డిసెంబరు16 : తెలంగాణలో వక్ఫ్ భూములపై దృష్టి పెట్టామని తెలంగాణ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ వ్యాఖ్యానించారు. ప్రత్యేకంగా ఉమ్మీద్ పోర్టల్ ఏర్పాటు చేస్తున్నామని.. ఇందుకోసం కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. ఉమ్మీద్ పోర్టల్‌లో గత 10 రోజులుగా టెక్నికల్ ఎర్రర్ ఏర్పడిందని చెప్పుకొచ్చారు. వక్ఫ్ భూముల ఎన్‌రోల్‌మెంట్‌కు సమయం పడుతుందని తెలిపారు. తప్పుడు పత్రాలతో భూములను అప్‌లోడ్ చేస్తే రిజెక్ట్ అవుతాయని వివరించారు. ఇవాళ(మంగళవారం) సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. మొత్తం 63,180 ఎకరాల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. వీటిలో 46 వేల ఎకరాల భూములు పోర్టల్‌లో నమోదు కాలేదని చెప్పుకొచ్చారు. 16,700 ఎకరాల భూములు పోర్టల్ ఎక్కించారని పేర్కొన్నారు. పోర్టల్‌లో భూముల వివరాలు నమోదు చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని వివరించారు. ఫుడ్ ఫైజనింగ్ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో ఫుడ్ ఫాయిజన్ ఘటన దురదృష్టకరమని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో తమ ప్రభుత్వం విచారణకు అదేశించిందని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు పెట్టె భోజనం 30 నిమిషాల ముందు అక్కడ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించామని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. వక్ఫ్ భూముల అంశంపై చర్చించామని అన్నారు. భూముల పరిరక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలకు లేఖలు రాశామని తెలిపారు. వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్ కోసం యాప్ సరిగ్గా పనిచేయడం లేదని అన్నారు. రాబోయే బడ్జెట్‌లో మైనార్టీల కోసం బడ్జెట్‌ను పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలపై తప్పుడు కథనాలు సరికాదని చెప్పుకొచ్చారు.గురుకులాల్లో కేవలం 40 పోస్టులు మాత్రమే ఖాళీలు ఉన్నాయని మంత్రి మహ్మద్ అజారుద్దీన్ పేర్కొన్నారు.



# విజయ్ దివస్.. పరేడ్ గ్రౌండ్‌లో అమరవీరులకు గవర్నర్, డిప్యూటీ సీఎం నివాళులు

కంటోన్మెంట్: విజయ్ దివస్ సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘనంగా నివాళులర్పించారు. త్రివిధ దళాల అధికారులు నివాళులర్పించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని కాపాడటంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ కీలకపాత్ర పోషించారని చెప్పారు. సాహసోపేతమైన నిర్ణయాలతో 1971లో జరిగిన ఇండో–పాక్ యుద్ధంలో భారత సైనికుల వీరోచిత పోరాటం మరువలేదని కొనియాడారు. భారత సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా విజయ్ దివస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. యుద్ధ భూమిలో పాల్గొన్న మాజీ సైనిక అధికారులు, సైనిక ఉద్యోగులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

# సోమార్‌పేట ఘటన.. హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలి: కేటీఆర్



హైదరాబాద్: కామారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బాలరాజు కుటుంబంపై కాంగ్రెస్ నేతలు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేటలో జరిగిన ఘటనపై మీడియాతో ఆయన మాట్లాడారు. "సర్పంచ్ ఎన్నికల్లో తీవ్ర పోటీ జరిగింది. అందులో బాలరాజు స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఇంటి వద్ద ఉన్న బాలరాజు, అతడి కుటుంబసభ్యులను ట్రాక్టర్‌తో ఢీకొట్టారు. ఈ విషయంపై కామారెడ్డి ఎస్పీకి ఫోన్ చేసి మాట్లాడాను. బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేయడం లేదు. పోలీసులకు జీతాలు ప్రజల సొమ్ము నుంచి చెల్లిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు ఇవ్వడం లేదనే సంగతి వారు గుర్తుంచుకోవాలి. పోలీసులు తీరు మార్చుకోకపోతే మేం తిరగబడటం ఖాయం. హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించాలి" అని కేటీఆర్ అన్నారు.




# డివిజన్ల పునర్విభజనపై చర్చ

హైదరాబాద్: నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్ఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. డివిజన్ల డీలిమిటేషన్ ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను అధికారులు సభలో ప్రవేశపెట్టారు. డివిజన్ల విభజనపై ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు మాట్లాడారు. డీలిమిటేషన్‌పై తమ అభ్యంతరాలను సభ దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ల విభజన ఏ ప్రాతిపదికన చేశారో తెలియట్లేదని అసహనం వ్యక్తం చేశారు.

**భాజపా కార్పొరేటర్ల ఆందోళన...** డివిజన్ల పునర్విభజనకు వ్యతిరేకంగా జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద భాజపా కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

తమను సంప్రదించకుండా డివిజన్లు పెంచుతున్నారని ఆందోళన చేపట్టారు. ఎంఐఎంకు అనుకూలంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పునర్విభజన చేపట్టాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో భాజపాను ఓడించేందుకు ఆ 3 పార్టీలు ఏకమయ్యాయన్నారు.




# ప్రధాని వద్దని చెప్పినా ఆ అంశాలు లీక్ చేశారు

హైదరాబాద్: ప్రధాని మోదీతో తెలంగాణ భాజపా ఎంపీలతో జరిగిన సమావేశంలోని అంశాలు లీక్ కావడంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటింగ్‌లో జరిగిన విషయాలు బయటకు చెప్పొద్దని ప్రధాని అన్నారని, అయినా ఆ విషయాలు బయటకు వచ్చాయని అసహనం వ్యక్తంచేశారు. ఆ అంశాలు బయటకు చెప్పినవారు ఎవరో చెబితే చర్యలు తీసుకుంటామన్నారు. "సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని చెప్పారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.

దక్షిణ భారత్ నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉప రాష్ట్రపతులు అయ్యారు. భాజపాలో కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంటుంది" అని కిషన్‌రెడ్డి అన్నారు.

**రైల్వే మంత్రితో కిషన్‌రెడ్డి భేటీ.. రాష్ట్రంలోని ప్రాజెక్టులపై చర్చ...** రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్రంలో 42 రైల్వేస్టేషన్ల పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై చర్చించామన్నారు. రూ.400 కోట్లతో హైదరాబాద్ నుంచి యాదగిరి గుట్ట వరకు పొడిగించాల్సిన ఎంఎంటీఎస్ రెండో దశపై మాట్లాడినట్లు తెలిపారు. కొమరవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తిచేసి దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆయన్ను కోరినట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ఓట్ చోరీ ర్యాలీలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి ఖండించారు. రాహుల్ అనైతికంగా మాట్లాడుతున్నారన్నారు. ఏ విషయాలు మాట్లాడాలనే దానిపై ఆయనకు అవగాహన లేదని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ ఉండటం దురదృష్టకరమన్నారు.

# నాగారం భూములపై పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు



దిల్లీ: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూదాన్ భూముల వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కొనుగోలు చేసిన భూములపై బీర్ల మల్లేష్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ భూములను భూదాన్ భూములుగా పేర్కొంటూ తొలుత మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఐఏఎస్, ఐపీఎస్‌లకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మల్లేష్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ప్రాథమిక స్థాయిలోనే కొట్టివేసింది.

# ఉచిత బస్సు.. రాబడి పెరుగుతోంది: తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి



భద్రాచలం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి రాబడి పెరుగుతోందని తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజూ 10వేల బస్సుల్లో 60 లక్షల మందిని తరలిస్తున్నట్లు చెప్పారు. వీరిలో దాదాపు 45 లక్షల మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు.

భద్రాచలం ఆర్టీసీ డిపోను ఎండీ మంగళవారం సందర్శించారు. మొక్కలు నాటిన అనంతరం బస్సులను పరిశీలించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 250 కోట్లకు పైగా మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్లు చెప్పారు. "ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు రూ.8,500 కోట్లు ఆదా అయ్యింది. రెండేళ్లలో 2,500 కొత్త బస్సులు కొనుగోలు చేశాం. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 800కు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఉన్నాయి. మూడేళ్లలో హైదరాబాద్ వ్యాప్తంగా.. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తాం" అని నాగిరెడ్డి తెలిపారు.

# యూరియా కొనుగోళ్ల కోసం సరికొత్త యాప్: మంత్రి తుమ్మల

హైదరాబాద్, డిసెంబర్ 16: యూరియా కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ యాప్ తీసుకొస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. రైతు వేదికల ద్వారా మొబైల్ యాప్‌పై రైతుల అభిప్రాయం సేకరించామన్నారు. మొబైల్ యాప్‌పై రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవని తెలిపారు. పత్తి అమ్మకం కోసం రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటున్నారని.. అది 100 శాతం సక్సెస్ అయిందన్నారు. రైతులకు స్లాట్ బుకింగ్ సహాయం కోసం రైతు వేదికల వద్ద ఏఈవోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాజకీయ పబ్బం కోసం కొంతమంది వ్యక్తులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. యూరియాను బ్లాక్‌లో పరిశ్రమల అవసరాలకు తరలిస్తున్నారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా నేరుగా రైతులకు అందే విధంగా మొబైల్ యాప్ పనిచేస్తుందని తెలిపారు. శాటిలైట్ ద్వారా పంటల సర్వేల కోసం జర్మనీ కంపెనీతో చర్చలు తుది దశలో ఉన్నాయన్నారు. ఆ అగ్రిమెంట్ కుదిరితే పంట వేసిన భూమికే రైతు భరోసా సహాయం ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. కొండలు, గుట్టలకు భరోసా నిలిపేసి ఆ నిధులను ఫసల్ భీమకి ఉపయోగిస్తే బాగుంటుందని.. త్వరలో వీటిపై కేబినెట్‌లో చర్చలు జరిపి నిర్ణయం తీసుకోబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.



# పేక మెడలా కూలీన 79 అడుగుల స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహం.. వీడియో వైరల్..

దక్షిణ బ్రెజిల్‌ను ఒక శక్తివంతమైన తుఫాను అతలాకుతలం చేస్తుంది. ఈ క్రమంలో బలమైన తుపాను గాలుల ప్రభావంతో.. రియో గ్రాండే డో సుల్ రాష్ట్రంలోని గ్వైబాలోని హవాన్ మెగాస్టోర్ వెలుపల ఏర్పాటు చేసిన 24 మీటర్ల పొడవు (79 అడుగుల) స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. గత కొన్నిరోజులుగా బ్రెజిల్ పౌర రక్షణ సంస్థ, డెఫెసా సివిల్, ఈ ప్రాంతంలో గత కొన్నిరోజులుగా బలమైన గాలులు వీస్తున్నాయి. గంటకు 90 కి.మీ. కంటే ఎక్కువగా వీచాయని అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో ప్రపంచంలోని వింతల్లో ఒకటైన స్టాట్యూఆఫ్ లిబర్టీ విగ్రహం ఒక్కాసారిగా కుప్పకూలింది. స్టాట్యూఆఫ్ లిబర్టీని 2020లో హవాన్ చైనా స్టోర్ల ఓపెనింగ్ గుర్తుగా దీన్ని ఏర్పాటు చేశారు. అయితే భారీ విగ్రహం కూలిపోయిన ఘటన ఎవరు కూడ గాయపడలేదని, ఎలాంటి ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్గా మారింది. గత కొన్నిరోజులుగా బ్రెజిత్ తో పాటు పలునగరాల్లో బలమైన తుపాన్ గాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో భారీ విగ్రహం కూలిపోవడంను చాలా మంది అభిమానులు షాక్ అవుతున్నారు. స్టాట్యూఆఫ్ లిబర్టీనీ ప్రత్యేకంగా చూసేందుకు చాలా మంది వెళ్తుంటారు. ఇంత బలమైన గాలులు ఏంటని కూడా నెటిజన్లు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ ఘటనలో ఆస్తి, ప్రాణ నష్టం జరక్కపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

# అసమాన సేవా తత్పరుడు జనరల్ తిమ్మప్ప


## – డిసెంబర్ 17...కె.ఎస్.తిమ్మయ్య వర్ధంతి




జనరల్ కోదండర సుబ్బయ్య తిమ్మయ్య భారత సైన్యంలో ఒక విశిష్ట సైనికుడు. ఆయన 1957 నుండి 1961 వరకు భారత చైనా దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో భారత సైన్యంలో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా కీలకమైన సేవలను అందించారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో పదాతి దళానికి నాయకత్వం వహించిన ఏకైక భారతీయుడు. ఆయన భారత సైన్యం అందించిన విశిష్ట అధికారులుగా గుర్తింపు పొందారు. కొరియా యుద్ధం తరువాత, యుద్ధ ఖైదీలను వారి వారి దేశాలకు తిరిగి పంపే పనిలో ఐక్యరాజ్య సమితి విభాగానికి నాయకత్వం వహించారు. ఆర్మీ నుండి పదవీ విరమణ చేసిన తరువాత 1964 జూలై నుండి డిసెంబరు 1965 వరకు సైప్రస్ దేశంలో ఐక్యరాజ్య సమితి శాంతి సంరక్షక దళానికి కమాండర్‌గా నియమించ బడ్డారు. సైప్రస్ లో 17 డిసెంబరు 1965లో మరణించారు. ఆయన కర్నాటక రాష్ట్రం కొడగు జిల్లా (పూర్వపు పేరు కూర్గ్) మడికెరి గ్రామంలో 1906, మార్చి 30వ తేదీన తిమ్మయ్య సీతమ్మ దంపతులకు జన్మించారు. తల్లి సీతమ్మ విద్యావంతురాలు, సంఘ సేవకురాలు. ఆమెకు బ్రిటిష్ ప్రభుత్వం కైజర్ – ఎ– హింద్ బిరుదును ప్రదానం చేసింది. ఆయ న అన్న పొన్నప్ప, తాను, తమ తమ్ముడు సోమయ్య ముగ్గురూ భారత సైన్యంలో అధికారులుగా పనిచేశారు. మెరుగైన విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో తన 8వ యేట తమిళ నాడు రాష్ట్రం కూనూరులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో చేరారు. ఆ తర్వాత బెంగళూరు లోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూలులో చదివారు. ప్రాథమిక విద్య ముగిసి న తరువాత డెహ్రాడూన్ లోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాయల్ ఇండియన్ మిలటరీ కాలేజీలో చేరారు. అక్కడి నుండి పట్టా పొందిన తరువాత ఆయన ఇంగ్లాండు లోని రాయల్ మిలటరీ కాలేజీకి తర్వాత శిక్షణ కోసం ఎంపిక చేయ బడ్డారు. మిలటరీ శిక్షణ తరువాత 1926 ఫిబ్రవరి 4న ఆయనను బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమించారు. ఆ బ్యాచ్‌లో నియమింప బడిన వారిలో ఆయన తరువాత చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేసిన ప్రాన్ నాథ్ థాపర్ ఉన్నారు. తిమ్మయ్య 19వ హైదరాబాద్ రెజిమెంట్‌కు చెందిన 4వ బెటాలియన్‌లో 1927 మే 28 న నియమించ బడ్డారు. 1928 మే 4 న ఇతడు లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందారు. 1930లో రెజిమెంటల్ సహాయాధికారిగా నియమించిన తరువాత తన నైపుణ్యంతో నార్త్ వెస్ట్ ఫ్రంటియర్ (నేటి పాకిస్తాన్) లోని పఠాన్ ఆదివాసీ తిరుగుబాటు దారులను అణచ గలిగారు. 1935 ఫిబ్రవరి 4న ఇతడు కెప్టెన్‌గా పదోన్నతి పొందారు. 1936 ఏప్రిల్‌లో ఇతడు మద్రాసులోని యూనివర్సిటీ ట్రైనింగ్ కార్ప్స్‌కు సహాయాధికారిగా బదిలీ కాబడ్డారు. తరువాత ఆయనను సింగపూర్ బెటాలియన్‌కు బదిలీ చేశారు. 1941లో ఆయనను ఆగ్రాలోని హైదరాబాద్ రెజిమెంటల్ సెంటర్‌లో సెకండ్ – ఇన్ – కమాండ్‌గా నియమించారు. తరువాత ఇతనిని క్వెట్టాలోని స్టాఫ్ కాలేజీలో శిక్షణ కోసం పంపారు. అక్కడ ఆయన, ఆయన భార్య 1935 క్వెట్టా భూకంప బాధితులకు ఎనలేని సేవలను అందించారు. 1943లో ఆయనను మేజర్ పదవి లభించింది. ఇతడు 25వ పదాతి దళానికి గ్రేడ్2 స్టాఫ్ ఆఫీసర్‌గా నియమితుడైనారు. సైన్యంలో ఆ పదవిని వరించిన తొలి భారతీ యుడు తిమ్మయ్య. పదాతి దళం అదుపులో యుద్ధ శిక్షణను పొంది రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ సేనలను బర్మాలో ఎదుర్కొంది. 1944లో ఆయన లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొంది బర్మాలో 8వ, 19వ హైదరాబాద్ రెజిమెంట్‌లకు కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. 1945లో ఇతడు బ్రిగేడియర్ ర్యాంకుకు ఎదిగారు. యుద్ధంలో ఆయన సేవలకు గుర్తింపుగా డిస్టింగ్విష్డ్ సర్వీస్ ఆర్డర్(%ణ.ూ.ా%)ను ప్రకటించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆయనను స్వదేశానికి వెనుకకు రప్పించారు. 1947లో భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత పాకిస్తాన్ విభజన సందర్భంగా భారత్ పాకిస్తాన్‌ల మధ్య ఆయుధాలు, పనిముట్లు, సైన్యం పంపకాల కమిటీలో ఆయనను సభ్యునిగా నియమించారు. దాని తరువాత సెప్టెంబర్ 1947లో మేజర్ జనరల్‌గా పదోన్నతి కల్పించి 4వ పదాతి దళానికి కమాండ్‌గా నియమించారు. 1948లో కాశ్మీర్‌లో జరిగిన భారత్–పాక్ యుద్ధంలో ఇతడు క్రియాశీలక పాత్రను నిర్వహించారు. 19వ పదాతి దళానికి కమాండర్‌గా వ్యవహరిస్తూ కాశ్మీర్ లోయ నుండి పాకిస్తాన్ సేనను తరిమికొట్టారు. షేక్ అబ్దుల్లా, బక్షి గులాం మొహ మ్మద్, జవహర్‌లాల్ నెహ్రూలతో సత్సంబంధాలను ఏర్పరచు కున్నారు. డెహ్రాడూన్ లోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ మిలటరీ అకాడమీకి కమాండెంట్‌గా వ్యవహరించారు. ఆయనకు గల అపార అనుభ వాన్ని పరిగణనలో తీసుకుని ఐకరాజ్య సమితి... తటస్థ దేశాల రిపాట్రియేషన్ కమీషన్‌కు ముఖ్యునిగా నియమించి కొరియాకు పంపించింది. ఇది చాలా సున్నితమైన, అసాధారణమైన పని కావడంతో చాకచక్యంతో నెరవేర్చ గలిగారు. ఆయన స్వదేశానికి తిరిగి వచ్చి లెఫ్టినెంట్ జనరల్ హోదాలో జనరల్ ఆఫీసర్ కమాండింగ్, సదరన్ కమాండ్‌గా 1953లో నియమితుడైనారు. 1954లో ఇతనికి భారత ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డును ఇచ్చి సత్కరించింది. ఆయన 1957, మే 7న 6వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలను చేపట్టారు. 1959లో అప్పటి కేంద్ర రక్షణ మంత్రి వి. కె. కృష్ణ మేనన్ తో ఏర్పడిన విభేదాల కారణంగా పదవికి రాజీనామా చేశారు. కానీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆయన రాజీనామాను తిరస్కరించడంతో పదవిలో కొనసాగారు. 35 ఏళ్ల మిలటరీ సర్వీసు పూర్తి చేసుకుని 1961 మే 7న పదవీ విరమణ చేశారు. భారత సైన్యం నుండి పదవీ విరమణ తరువాత ఐక్యరాజ్య సమితి ఆయన సేవలను మరోసారి ఉపయోగించ తలపెట్టి, సైప్రస్‌లో ఐక్యరాజ్య సమితి సేన లకు కమాండర్‌గా జూలై 1964లో నియమించింది. ఆ పదవిలో ఉన్న సమయం లోనే 1965, డిసెంబరు 17న మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని అంత్యక్రియల కోసం బెంగళూరుకు తరలించారు. ఆయన స్మృత్యర్థం బెంగళూరు, పూనే, సైప్రస్‌లోని లార్నకా నగరాలలో కొన్ని వీధులకు జనరల్ తిమ్మయ్య రోడ్ అని నామకరణం చేశారు. 1966లో రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ ఇతని స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసి గౌరవించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# 2013 డిసెంబర్ 17... తెలంగాణ రాష్ట్ర ముసాయిదా బిల్లు ప్రవేశ పెట్టిన దినం




తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఉద్దేశించి చారిత్రిక సంఘటనలలో 2013 డిసెంబర్ 17కూడా ఒక మరుపు రాని దినం. రాష్ట్ర విభజన, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆంధ్ర ప్రదేశ్ పునర్ వ్యవస్తీకరణ బిల్లు – 2013 ముసాయిదాను రాష్ట్ర ఉభయ సభలు... శాసనసభ, శాసనమండలి లోనూ 2013 డిసెంబర్ 17న ప్రవేశ పెట్టారు. 65 పుటలు, 13 షెడ్యూళ్ళు ఉన్న సదరు బిల్లును తెలుగు, ఉర్దూ భాషల్లో స్వేచ్ఛానువాదం చేసి, ప్రతులను సభ్యులకు పంచిపెట్టారు. అలాగే శాసనసభ వెబ్ సైట్ లో కూడా బిల్లును అందుబాటులో ఉంచినట్లు నాటి స్పీకర్ నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఒక్కో షెడ్యూల్ ను విభజనకు సంబంధించిన ఒక్కో అంశాన్ని వివరించడానికి కేటాయించారు. నీటి విభజనకు ఒక షెడ్యూల్, ఉద్యోగులు అధికారుల విభజనకు ఒక షెడ్యూల్, శాసన మండలి విభజనకు ఒకటి%ా% ఇలా ఏయే ప్రాంతంలో ఎన్ని పరిశ్రమలు ఉన్నదీ, ఎన్ని విద్యా సంస్థలు, ఆసుపత్రులు ఉన్నదీ, తదితర వివరాలన్నీ వివిధ షెడ్యూళ్లలో పొందుపరిచినట్లు ప్రకటించారు. తెలంగాణా ప్రాంత శాసన సభ్యులంతా ముసాయిదా బిల్లును స్వాగతించగా, సభా వ్యవహారాల సలహా సంఘం సమావేశంలో నిర్ణయించకుండా సభలో చర్చను ప్రారంభించడాన్ని సీమాంధ్ర ప్రాంత సభ్యులు వ్యతి రేకించారు. శాసనసభ కార్యకలాపాలు ప్రారంభం అయ్యాక దాదాపు అన్ని పార్టీల సభ్యులు ప్రత్యేక తెలంగాణ అనుకూల, వ్యతిరేక నినాదాలతో స్పీకర్ పోడియం ను చుట్టుముట్టి పోటాపోటీగా గొడవ చేశారు. 30 నిమిషాల వాయిదా అనంతరం తిరిగి సమావేశం అయిన సభలో స్పీకర్ తనకు రాష్ట్రపతి నుండి బిల్లు ముసాయిదా అందినట్లు ప్రకటించారు. స్పీకర్ ఆదేశాల మేరకు శాసన సభ కార్యదర్శి ఎస్.రాజసదారాం బిల్లు ముసాయిదాకు అనుబంధంగా పంపిన లేఖను చదివి వినిపించారు. 2014 జనవరి 23వ తేదీ లోగా, బిల్లుపై చర్చించి, బిల్లును వెనక్కి పంపాలని రాష్ట్రపతి తమ సందేశంలో పేర్కొన్నట్లు శాసనసభ కార్యదర్శి రాజా సదారాం సభలో తెలిపారు. గొడవ, నినాదాలు, ప్రతి నినాదాలు కొనసాగడంతో స్పీకర్ మరో 30 నిమిషాలు సభను వాయిదా వేశారు. ఆ నాటి ఉదయం శాసనసభ సమావేశం కాగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, సమైక్య రాష్ట్రాల మద్దతుదారులు సభలో గందరగోళం పరిస్థితులు సృష్టించడంతో సభా కార్యకలాపాలు గంటపాటు వాయిదాపడ్డాయి. సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు లేక పోవడంతో స్పీకర్ సభను రెండుసార్లు వాయిదా వేయవలసి వచ్చింది. ఆరోగ్యం బాగా లేదంటూ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సభకు గైర్హాజరయ్యారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ను సంప్రదించిన స్పీకర్ నాదెండ్ల మనోహర్ బిల్లును శాసన సభలో ప్రవేశ పెట్టినట్లు ప్రకటించారు. చర్చను వెంటనే ప్రారంభించాలన్న శ్రీధర్ బాబు కోరిక మేరకు చర్చను ప్రారంభించాల్సిందిగా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడును, స్పీకర్ స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ కోరారు. అయితే టిడిపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సీమాంధ్ర శాసన సభ్యులు బిల్లు కాపీలను చింపి వేసి సమైక్య రాష్ట్రంకు మద్దతుగా నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డు కున్నారు. ప్రతిపక్ష నాయకుడు సభలో లేక పోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ స్థానం లో ఉన్న ఉపసభాపతి మల్లు భట్టి విక్రమార్క సభను మరుసటి రోజుకు వాయిదా వేసారు. శాసనమండలి లోనూ సభా ధ్యక్షుడు చక్రపాణి బిల్లును ప్రవేశ పెట్టగనే తెలుగు దేశం, సీమాంధ్ర కాంగ్రెస్ సభ్యులు పోడియంను చుట్టు ముట్టి రభస సృష్టించడంతో సభ తెల్ల వారటికి వాయిదా పడింది. సచివాలయంలో సీమాంధ్ర తెలంగాణ ఉద్యోగులు పోటా పోటీగా ర్యాలీలు నిర్వహించారు. బిల్లుపై చర్చించడానికి వీలుగా – శాసనసభ శీతాకాల సమావేశాలను పొడిగించాల్సిన అవసరం ఉందని పంచాయితీ రాజ్ శాఖా మంత్రి జానారెడ్డి అభిప్రాయ పడ్డారు. అయితే శాసన సభలో తెలంగాణ బిల్లుపై చర్చ ప్రారంభం కావడంపట్ల తెలంగాణా రాజకీయ ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం సంతోషం వ్యక్తం చేశారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ముందు సభ ప్రొరోగ్ కాకపోగా, బిల్లు రాష్ట్ర శాసనసభకు రానున్న నేపథ్యంలో సభను ప్రొరోగ్ చేయించాలని, తర్వాత సభను ఎప్పుడు సమావేశ పరచాలనే నిర్ణయాధికారాన్ని తన చేతిలోకి తీసుకోవాలని సిఎం కిరణ్ భావించారు. ప్రొరోగ్ చేయాల్సిందిగా స్పీకర్ నాదెండ్ల మనోహర్‌కు లేఖ రాశారు. ఇది తెలంగాణ నేతలకు కోపం తెప్పించింది. ప్రొరోగ్‌కు ఒప్పుకునేది లేదు. ఒకవేళ స్పీకర్ లేఖ పంపించినా శాసనసభ వ్యవ హారాల మంత్రిగా ఆ ఫైలును నా దగ్గరే పెండింగ్‌లో పెడతాను అని శ్రీధర్ బాబు బహిరంగంగా ప్రకటించారు. అంతేకాదు స్పీకర్ నుంచి వచ్చిన ఫైలును పెండింగ్‌లో పెట్టి చూపించారు కూడా. దీంతో సభ ప్రొరోగ్ కాకుండా ఆగిపోయింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకుని, మంత్రి శ్రీధర్ బాబును శాసన సభా వ్యవహారాల శాఖ నుండి తప్పించారు. కాగా, శాసనసభ వ్యవహారాల శాఖను సీమాంధ్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేల కన్వీనర్‌గా, సమైక్య పోరుకు నేతృత్వం వహిస్తున్న శైలజానాథ్‌కు శాసనసభా వ్యవహారాలను అప్పగించడం విశేషం. 3వ తేదీ నుంచి విభజన బిల్లుపై అసెంబ్లీలో చర్చ జరగనున్న అత్యంత కీలకమైన సమయంలో శ్రీధర్ బాబును శాసనసభా వ్యవహారాల శాఖ నుండి తప్పించారు. చివరికి మంత్రివర్గం సమావేశమై శాసనసభ శీతాకాల సమావేశాలకు ముహూర్తం నిర్ణయించింది. డిసెంబర్ 16న స్పీకర్ నాదెండ్ల మనోహర్ ఈ బిల్లును శాసనసభలో ప్రవేశ పెట్టారు. అదే రోజు సభ వాయిదా పడి, తిరిగి సమావేశమైన తర్వాత డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టు విక్రమార్క స్పీకర్ స్థానంలో ఉండగా బిల్లుపై చర్చకు శ్రీకారం చుట్టడం తదితరాలు క్రమానుగతంగా జరిగి పోయాయి. గతంలో ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2013, 2014 జనవరి 30 న ఆంధ్రప్రదేశ్ శాసనసభ తిరస్కరించింది. 2014 బిల్లు 2014 ఫిబ్రవరి 18 న లోక్‌సభలో, 2014 ఫిబ్రవరి 20 న రాజ్యసభలో ఆమోదించబడింది. ఈ బిల్లును భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 2014 మార్చి 1 న ధ్రువీకరించారు. అధికారిక గెజిట్‌లో 2014 మార్చి 2 న ప్రచురించారు, దీని ప్రకారం 2014 జూన్ 2 చట్టం ప్రకారం 'నియమించబడిన రోజు' అనగా కొత్త రాష్ట్రాలు ఆవిర్భవించే రోజుగా ప్రకటించారు. బిల్లు రాష్ట్రపతి అంగీకారాన్ని పొంది 2014 మార్చి 1 న గెజిట్‌లో ప్రచురించింది. తెలంగాణ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన తేదీ ( నియమించబడిన తేదీ)అనగా 2 జూన్ 2014 న భారతదేశం లోని 29 వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# గయ్యాళి అత్తకు ఐకాన్ సూర్యకాంతం

## సూర్యకాంతం పాత్రలు... సజీవ శిల్పాలు – డిసెంబర్ 17... సూర్యకాంతం వర్ధంతి



గయ్యాళి పాత్రలు అనగానే తెలుగు ప్రేక్షకులకు ఠక్కున గుర్తుకువచ్చే పేరు సూర్యకాంతం. ఓర చూపులు చూస్తూ, ఎడంచెయ్యి విసుర్తూ కుడిచెయ్యి నడుం మీద నిలబెట్టి ఆమె చెప్పిన సంభాషణా చాతుర్యం, అంతలోనే వెక్కిరిస్తూ, అంతలోనే కల్లబొల్లి కబుర్లతో, వెక్కి వెక్కి వెక్కి ఏడుస్తూ వెండి తెరపై విభిన్న పాత్రల కు జీవం పొందింది ఎవరూ అంటే అది పాటతరం సహజ నటి సూర్యకాంతం అని వేరే చెప్పనక్కర లేదు. వ్యక్తిగా సూర్యకాంతం గయ్యాళి కానేకాదు – మామూలు మనిషే. నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఒకసారి టెలివిజన్ ఇంటర్వ్యూలో..."నువ్వు తెలుగు భాషకు చేసిన అన్యాయం ఒకటుంది. 'సూర్యకాంతం' అనే చక్కని పేరు ఇంకెవరూ పెట్టుకోకుండా చేశావు" అని ఆమెతో చమత్కారంగా అన్నానని చెప్పాడు. గయ్యాళి పాత్రల్లో తన సహజ నటనతో ఆమె ప్రాచుర్యం పొందింది. గయ్యాళి అత్తకి మారుపేరు సూర్యకాంతం అనిపించుకుంది. పాత్రల పరంగా అంతగా గయ్యాళి తనంలో ఆమె లీనమై పోయింది. అలాగే సూర్యకాంతాన్ని హాస్య నటీమణిగా ముద్ర వెయ్యడానికి లేదు. ఆమె ప్రత్యేకంగా హాస్యం చెయ్యక పోయినా ఆమె సంభాషణ చెప్పే తీరు, నవ్వు తెప్పిస్తుంది, చేసే చేష్టలు కోపం తెప్పిస్తాయి. అలా అని ఆమె దుష్టపాత్రధారిణి అని కూడా అనలేం. సహాయ నటి అనే అనాలి. తెలుగు సినిమాల్లో ఆమె ధరించిన అత్త పాత్రలు సజీవ శిల్పాలు. సినిమా ఏదైనా, హీరో హీరోయిన్ ఎవరైనా, అందులో సూర్యకాంతం వుందా? అని ప్రేక్షకులూ, సినిమా డిస్ట్రిబ్యూటర్లూ ఎదురు చూసేవారంటే ఆమెకు ఉన్న ప్రేక్షకాదరణ చెప్పకనే చెబుతోంది. సహజ నట కళా శిరోమణి, హాస్య నట శిరోమణి, బహుముఖ నటనా ప్రవీణా, రంగస్థల శిరోమణి సూర్యకాంతం తూర్పు గోదావరి జిల్లా కాకినాడ దగ్గరున్న వెంకట కృష్ణరాయ పురంలో 1924 అక్టోబర్ 28న తన తల్లితండ్రులకు 14వ సంతానంగా జన్మించింది. ఆరేళ్ళ చిన్న వయసు లోనే పాడటం, నాట్యమాడటం నేర్చుకొంది. పెరిగే వయసులో హిందీ సినిమా పోస్టర్లు బాగా ఆకర్షించాయి. సినిమాల్లో నటించాలనే కోరిక ఆపుకోలేక చెన్నై చేరుకొంది. మొదట జెమిని స్టూడియో నిర్మించిన చంద్రలేఖ సినిమాలో డాన్సర్ గా అవకాశం వచ్చింది. అప్పట్లో నెలకు 65 రూ. జీతం ఇవ్వబోతే నిర్మాతతో తన అసంతృప్తిని తెలియ బరచిన మీదట 75 రూపాయలు చేశారు. తరువాత ధర్మాంగద (1949)లో ఆమెది మూగవేషం. ధర్మాంగద టైములో చిన్నా చితకా వేషాలు వేసినా తరువాత లీలా కుమారి సాయంతో మొదటిసారిగా నారద నారది సినిమాలో సహాయ నటిగా అవకాశం వచ్చింది. చిన్న చిన్న పాత్రలు నచ్చక జెమినీ స్టూడియో నుంచి బయటకు వచ్చేసింది. మనసులో బొంబాయికి వెళదామని ఉన్నా అందుకు ఆర్థిక స్తోమత సరిపోక ఆ ఆలోచనను విరమించుకొంది. ఆ పరిస్థితిలో సహాయ నటిగా గృహప్రవేశం సినిమాలో మంచి అవకాశం వచ్చింది. తరువాత తన కల అయిన హీరోయిన్ వేషం సౌదామిని చిత్రం ద్వారా వచ్చింది. కానీ ఆ సమయంలో కారు ప్రమాదం జరిగి ముఖానికి గాయం అవడంతో ఆ అవకాశం తప్పి పోయింది. బాగైన తరువాత సంసారం చిత్రంలో మొట్టమొదటి సారిగా గయ్యాళి అత్త పాత్ర వచ్చింది. తరువాత తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా తెలుగు సినీ అభిమానుల గుండెల్లో నిలిపోయేలా జీవితాంతం అవే పాత్రలలో నటించింది. అసలు సంసారం చిత్రం తరువాత బొంబాయికి చెందిన ఒక నిర్మాత ద్వారా హీరోయిన్ గా అవకాశం వచ్చింది. కానీ తనకు అవకాశం రాక ముందే ఇంకొక హీరోయిన్ ను పెట్టుకొని తీశేసారని తెలియడంతో, "ఒకరి బాధను నా సంతోషంగా తీసుకోలేను" అని ఆ సినిమాను నిరాకరించింది. కోడరికం సినిమా ఆమెకు ఎంతో పేరు తీసుకొచ్చింది. బి.నాగిరెడ్డి, చక్రపాణిలు ఆమె లేకుండా సినిమాలు తీసేవారు కారు. హైకోర్టు జడ్జి పెద్దిబొట్ల చలపతిరావు ను 1950లో వివాహ మాడారు. ఆ రోజుల్లోని అనేక సాంఘిక చిత్రాల్లో రేలంగి – సూర్యకాంతం, రమణారెడ్డి – సూర్యకాంతం, ఎస్.వి.రంగారావు – సూర్యకాంతం– జంటలు, వాళ్ల దృశ్యాలు గుర్తుకు తెచ్చుకుని ఇవాళ కూడా హాయిగా నవ్వుకోవడం కద్దు. కొత్త సినిమా వస్తూంటే అందులో సూర్యకాంతం వుందా? అని ప్రేక్షకులూ, తారా గణంలో సూర్యకాంతం వున్నట్టేగదా? అని సినిమా డిస్ట్రిబ్యూటర్లూ – ఎదురు చూసేవారు. చక్రపాణి (1954), దొంగరాముడు (1955), చిరంజీవులు (1956), తోడికోడళ్లు (1957), అత్తా ఒకింటి కోడలే (1958), ఇల్లరికం (1959), భార్యాభర్తలు (1961), గుండమ్మ కథ (1962), కులగోత్రాలు (1962), దాగుడు మూతలు (1964), అత్తగారు–కొత్తకోడలు, మూహూర్తబలం (1969) లాంటి మరపురాని ఎన్నో సినిమాలలో నటించింది. ఏ సమావేశాలకో, సినిమా ఉత్సవాలకో ఆమె వెళ్లినప్పుడు ఆటోగ్రాపుల కోసం వెళ్లే స్త్రీలు సూర్యకాంతం దగ్గరకి వెళ్లడానికి భయపడేవారు. ఐతే ఆమె నికార్సయిన మనిషి, కచ్చితమైన మనిషి, సహృదయం గల మనిషి, సహాయపడే మనిషి. ఆమె కడుపు నిండా తినేది, పదిమందికీ పెట్టేది. షూటింగ్‌కి వచ్చినప్పుడల్లా – తనతో ఏవో తినుబండారాలు తీసుకు రావడం, అందరికీ పెట్టడం అలవాటు. ఇలాంటి అలవాటు సావిత్రి, కృష్ణకుమారి, జానకి వంటి నటీ మణులకీ వుండేది. షూటింగుల్లో జోకులు చెప్పడం, సూర్యకాంతం సరదాల్లో ఒకటి. ఓ సినిమాలో నాగయ్యను నానా మాటలూ అని, నోటి కొచ్చిన తిట్లు తిట్టాలి. షాట్ అయిపోయాక ఆయన కాళ్లమీద పడి 'అపరాధం – క్షమించండి!' అని వేడుకుంది. 'పాత్ర తిట్టిందమ్మా, నువ్వెందుకు బాధపడతావూ? లే!–' అని నాగయ్య లేవనెత్తితే, కన్నీళు తుడుచుకున్న భక్తీ, సెంటిమెంటూ ఆమెవి. దబాయింపూ, కచ్చితత్వమూ ఉన్న మనిషే అయినా, మనసు మాత్రం వెన్న, సున్నితం. అవసరమైన వాళ్లకి ఆర్థిక సహాయం చేసేదిగాని అనవసరం అనిపిస్తే మాత్రం 'పూచికపుల్ల' కూడా విదిలించేది కాదు. మొహమాట పడకుండా తనకి రావాల్సిన పారితోషకాన్ని అడగవలసిన నిర్మాతల్ని గట్టిగా అడిగేది. ఆమె అందర్నీ నమ్మేది కాదు. తన కారు రిపేరుకొస్తే ఎంత పెద్ద రిపేరైనా, మెకానిక్ ఇంటికొచ్చి తన కళ్లముందు చెయ్యవలసిందే – ఎంత 'ఎక్స్‌ట్రా మనీ' అయినా తీసుకోనీ గాక. చివరి దశలో వేషాలు తగ్గిపోయినా, చివరి దాకా నటిస్తూ ఉండాలనే కోరుకునేది. తన ఆరోగ్యం బాగులేకపోయినా, 'నటిస్తాను' అని ధైర్యంగా చెప్పేది. సూర్యకాంతం డిసెంబర్ 17, 1996న హైదరాబాద్ లో ఆమె మరణించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**




# తగ్గిన బంగారం, వెండి ధరలు.. ప్రస్తుత ధరలివే..

నేటి మార్కెట్లో బంగారం ధరలు కాస్తంత తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. హైదరాబాద్‌లో మంగళవారం నాటికి దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1520 మేర తగ్గి.. రూ.1,33,860గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ గోల్డ్‌పై రూ.1,400 పతనమై.. రూ.1,22,700గా ఉంది. ఇక వెండి విషయానికొస్తే.. నిన్న ఆకాశాన్నంటిన వెండి ధరలు.. ఇవ్వాళ కాస్త తగ్గాయి. ప్రస్తుతం.. కిలో వెండి రేటు రూ.2,11,000గా ఉంది. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల మేలిమి పసిడి ధర రూ.1,34,730గా ట్రేడవుతోంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి రేటు రూ.1,34,010గా ఉంది. సోమవారం భారీ స్థాయిలో గరిష్ఠ స్థాయికి ఎగబాకిన వెండి రేట్లు నేడు కాస్త తగ్గాయి. నిన్నటితో పోల్చగా.. కిలో వెండిపై రూ.3,900 మేర తగ్గింది. ప్రస్తుతం.. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ.2,11,000గా ఉంది. చెన్నై సహా పలు ప్రముఖ నగరాల్లోనూ దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. భారత్–అమెరికా డీల్‌పై కొనసాగుతున్న సందిగ్ధత, డాలర్‌తో పోలిస్తే తగ్గుతున్న రూపాయి మారకం విలువ, ఫెడ్ వడ్డీ రేటులో కోత వెరసి పసిడి, వెండి ధరలకు రెక్కలొచ్చేలా చేస్తున్నాయి.

# భక్తులకు అలర్ట్.. ఆ సేవ రద్దుపై టీటీడీ కీలక ప్రకటన




తిరుమల, డిసెంబరు16 : తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో రేపటి (బుధవారం) నుంచి నెల రోజుల పాటు సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని సూచించారు. ఈమేరకు ఇవాళ(మంగళవారం) ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నం 1:23 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. బుధవారం నుంచి తిరుప్పావై పాశురాలతో శ్రీవారికి మేలుకొలుపు జరుపుతున్నట్లు వివరించారు. ధనుర్మాసం సందర్భంగా మూల విరాట్టుకు బిల్వపత్రాలతో సహస్ర నామార్చన జరిపిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. శ్రీవల్లి పుత్తూరు చిలుకలతో రోజూ స్వామి వారికి అలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీవారికి విశేష నైవేద్యాలుగా బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి ప్రత్యేక ప్రసాదాలు నివేదన చేస్తున్నట్లు వివరించారు. భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామి వారికి ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు టీటీడీ పాలకమండలి సభ్యులు పేర్కొన్నారు.

చురకలు

## సంపాదకీయం

# పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్యలో అమెరికా డ్రోన్లు.. ఏమిటీ అసలు గుట్టు!

ఇటీవల అఫ్గనిస్థాన్-పాకిస్థాన్ మధ్య ఇటీవల తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో సైనికులతో పాటు సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. అయితే... టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంతో కొన్ని రోజులు కాల్పుల విరమణ జరిగింది. అయితే తాజాగా టర్కీ వేదికగా జరుగుతున్న శాంతి చర్చలు విఫలమయ్యాయి. అయితే అందుకు కారణం అమెరికా డ్రోన్లు అనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది. అవును... సరిహద్దుల్లో కాల్పుల విరమణ, సీమాంతర ఉగ్రవాదం, మొదలైన అంశాలపై ఈ రెండు దేశాల మధ్య శనివారం టర్కీ వేదికగా చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే ఇవి విఫలమైనట్లు తాజాగా పాకిస్థాన్ ప్రకటించింది. ఈ సందర్భంగా స్పందించిన పాక్ సమాచార, ప్రసార శాఖ మంత్రి అతావుల్లా తరార్.. చర్చల్లో ఎలాంటి పరిష్కారమూ కనుగొనలేకపోయామని, అవి విఫలమయ్యాయని తెలిపారు.

**అసలు విషయం చెప్పిన అఫ్గన్ మీడియా!:** టోలో న్యూస్ నివేదిక ప్రకారం.. అఫ్ఘన్ గగనతలాన్ని ఇస్లామాబాద్ ఉల్లంఘించడం ఆపివేసి, అమెరికా డ్రోన్ విమానాలను నిరోధించినట్లయితే.. పాకిస్తాన్ పై దాడులకు తమ భూభాగాన్ని ఉపయోగించకుండా నిరోధించడానికి అఫ్ఘనిస్తాన్ కట్టుబడి ఉంటుందని చర్చలు జరిపిన వారు తెలిపారు. అయితే... ఈ షరతుకు పాకిస్తాన్ అంగీకరించడానికి నిరాకరించిందని అఫ్ఘన్ మీడియా ఒక మూలాన్ని ఉటంకిస్తూ తెలిపింది. ఇదే సమయంలో... అఫ్ఘనిస్తాన్ లోపల నిఘా, సంభావ్య దాడుల కోసం డ్రోన్లు తన గగనతలంలో పనిచేయడానికి అనుమతించే మరో దేశంతో ఒప్పందంపై సంతకం చేసినట్లు పాకిస్తాన్ అంగీకరించిందని కాబూల్ కు చెందిన జర్నలిస్ట్ తమీమ్ బాహిస్ ఎక్స్ లో పోస్ట్ చేశారు. అయితే.. చర్చల్లో మాత్రం అమెరికాతో చేసుకున్న ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించలేమని పాకిస్థాన్ పేర్కొందని టోలో న్యూస్ వెల్లడించింది. ఇదే క్రమంలో... పాకిస్తాన్ సంధానకర్తలు మొదట్లో కొన్ని నిబంధనలను అంగీకరించారని.. అయితే, పాకిస్తాన్ హైకమాండ్ కు ఫోన్ కాల్ వచ్చిన తర్వాత తమ వైఖరిని మార్చుకున్నారని.. అమెరికా డ్రోన్ లపై తమకు నియంత్రణ లేదని, ఐసిస్ పై చర్య తీసుకునేలా చేయలేమని చెప్పారని ఆ వర్గాలు చెప్పాయని అది పేర్కొంది. ఈ సమాధానానికి ఖతార్, టర్కీ మధ్యవర్తులు కూడా ఆశ్చర్య పోయారని అది నివేదించింది.

**భారత్ పై పాక్ ఆరోపణలు!:** ఇటీవల ఢిల్లీ – కాబూల్ మధ్య బంధం మరింత బలపడుతున్నాయని చెబుతోన్న వేళ పాకిస్తాన్ కడుపు తెగ మండిపోతుందనే చెప్పాలి. ఇప్పటికే ఢిల్లీ చెప్పినట్లుగా కాబూల్ ఆడుతుందని.. వారి తరుపున తాలిబన్లు తమపై ప్రాక్సీ యుద్ధం చేస్తున్నారని పాకిస్థాన్ పదే పదే ఆరోపించింది. ఈ క్రమంలో తాజాగా శాంతి చర్చలు విఫలమవ్వడంతో అందుకు భారత్ కారణమని చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా స్పందించిన పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ స్పందిస్తూ... కాబూల్ లో తీగలను లాగుతూ, తోలుబొమ్మ ప్రదర్శన నిర్వహిస్తున్న వారిని ఢిల్లీ నియంత్రిస్తోందని అన్నారు. అయితే... పాకిస్థాన్ గడ్డను ఉపయోగించి అమెరికా డ్రోన్ దాడుల అంశంపై మాత్రం ఆసిఫ్ స్పందించలేదు! మరోవైపు... తాలిబన్ పాలనను పూర్తిగా తుడిచిపెట్టి, వారిని తిరిగి గుహల్లోకి నెట్టేందుకు పాకిస్తాన్ తన పూర్తి ఆయుధశాలలో కొంత భాగాన్ని కూడా ఉపయోగించాల్సిన అవసరం లేదని.. వారు కోరుకుంటే, తోరా బోరా వద్ద వారి ఓటమి దృశ్యాలు పునరావృతం కావడం ఖచ్చితంగా ఈ ప్రాంత ప్రజలకు చూడటానికి ఒక దృశ్యం అవుతుందని ఖ్వాజా ఆసిఫ్ చెప్పారని కరాచీకి చెందిన డాన్ నివేదిక తెలిపింది.

# గోదాదేవి పాశురాలలో సామాజిక దృక్పథం



తిరుప్పావై' అనేది దివ్య ప్రబంధం. ఇది ద్రావిడ వేదంగా పరిగణింప బడుతున్నది. 'తిరుప్పావై' అనగా...'తిరు' అంటే శ్రీ. 'శ్రీ' అంటే లక్ష్మి, సంపద, మోక్షం – అని అర్థాలున్నవి. 'పావై' అంటే వ్రతం. నియమ నిష్ఠలతో ఆచరించబడే సంకల్ప వ్రతం' అనబడుతుంది. కలియుగంలో మానవ కన్యగా జన్మించి గోదాదేవిగా పెరెన్నక గన్న ఆండాళ్ భగవంతుడినే తన భర్తగా భావించి, ఆయనను చేపట్టడానికి సంకల్పించిన వ్రతమే తిరుప్పావై వ్రతం. తిరుప్పావై విష్ణువును కీర్తిస్తూ, గోదాదేవి మూల ద్రావిడంలో గానం చేసిన ముప్పై పాశురాల గీతమాలిక. పాశురము అంటే ఛందోబద్ధంగా ఉన్న పాటలని అర్థం. ఇది పన్నిద్దరాళ్వార్లు రచించిన నాలాయిర దివ్య ప్రబంధములో ఒక ముఖ్య భాగమై, తమిళ సాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ఆండాళ్ అసలు పేరు కోదై. కోదై అంటే మాలిక. ఆ పేరు పెట్టగా, అది క్రమంగా గోదాగా మారింది... గోదాదేవి సామాజిక దృక్పథంతోనే సకలోపనిషత్ సారంగా తిరుప్పావైని రచించి గానం చేసింది. గోదాదేవి రచించిన 30 పాశురాలు స్థూలంగా మంచిని ప్రబోధిస్తాయి. మంచిగా జీవించమని, తోటివారికి సాయపడమని, భగవదారాధన తప్పనిసరిగా చేయమని ఈ ప్రబోధాలు సూచిస్తాయి. మొదటి అయిదు పాశురాలు ఉపోద్ఘాతం, తిరుప్పావై యొక్క ముఖ్యోద్దేశ్యాన్ని తెలియ జేస్తాయి. తరువాతి పది పాశురాల్లో, గోదాదేవి చెలులతో కలిసి పూలను సేకరిస్తూ, పల్లె వాతావరణాన్ని వర్ణించే అంశాలు ఉంటాయి. అనంతర ఐదు పాశురాలు గోదాదేవి తన చెలులతో కలిసి చేసిన దేవాలయ సందర్శనను వివరిస్తాయి. భగవంతుడిని నిద్ర మేల్కొలపడానికి ఆండాళ్ సుప్రభాతాన్ని ఆలపిస్తుంది.

చివరి తొమ్మిది పాశురాలు భగవద్విభూతిని వర్ణిస్తాయి. గోదాదేవి పూల లాంటి సహజత్వం, పాలకడలి లాంటి నిర్మలత్వం గల ఆమె జీవన తత్త్వానికి పాటలకు పరవశుడయ్యాడు కృష్ణుడు. తులసీవనంలో పుట్టిన స్వభావ సిద్ధమైన జ్ఞానభక్తి సౌరభ సమృద్ధ గోదాదేవి, భగవంతునే మేల్కొప్పిన పరమ విలక్షణ వ్యక్తిత్వం గల భక్తురాలు. సామాజిక దృక్పథంతో వేదోపనిషత్తుల సారాన్ని, పురాణేతిహాసాల్లోని ధర్మాలను, తన పాటలలో నిక్షిప్తపరచి లోకానికి అందించింది. పాటలలో ఉపనిషత్తు రహస్యాలు శ్రీకృష్ణ లీలలు. పరమాత్మను చేరుకునేందుకు అనుసరించాల్సిన భక్తి మార్గాలు, పల్లె అందాలు, ఉదయకాలపు వర్ణనలు మొదలైన విషయాలు పొందు పర్చబడ్డాయి. విశ్వమానవ సౌభ్రాతృత్వంతో తనతోపాటు లోకులందరూ తిరుప్పావై వ్రతం ఆచరించాలని 'వైయత్తువాళ్ వీర్ కాళ్' (తి.పా. 2) అంటూ ఈ భూమియందే తరించాలనుకునే వారందరికీ ఆహ్వానం పలికింది గోదాదేవి. గోదాదేవి పరమపదం చేర్చుటకే ప్రధానంగా ఈ ప్రబంధం చెప్పినప్పటికీ ప్రయోజనాలను ఆశించి, మనలను మంచి గుణాలు కలవారిగా తీర్చిదిద్దాలని ఎన్నో మంచి ఉపదేశాలను చేసింది. పెద్దలు చేయని పనులను ఎట్టి పరిస్థితులలో చేయవద్దని, ఒకరి గురించి వారికి నష్టం కలిగించే రీతిలో వేరొకరి వద్దకు వెళ్ళి చాడీలు చెప్పవద్దని.. పేదవారికి, బ్రాహ్మణులకు దానధర్మాలు చేయాలని దాన ధర్మాలు ఎదుటివాడు సంతృప్తి పడినంత చేయడమే కాక ఏమీ చేయని వానివలె గర్వం, అహంకారం లేకుండా ఉండాలని సందేశం ఇచ్చింది. ప్రాతఃకాలంలో స్నానమాచరించడం, సాత్వికాహార స్వీకరణ, విషయ సుఖాలపై విరక్తి, సత్యమార్గానుసరణ, అహంకార మమకారాలకు, దైన్యానికి లోనుకాకుండా ఉండటం మున్నగు అంశాలను అంతర్గతంగా తన పాశురాలలో సందేశాత్మకంగా వివరించింది. మానవుడు పాప పంకిలంలో పడక సచ్ఛీలుడై జీవన్ముక్తుడు కావాలని ఆమె దృక్పథం. మానవులు ఎవరి ధర్మాన్ని వారు తప్పక పాటిస్తే ప్రజలు సుఖసంతోషాలతో ప్రశాంత జీవనం సాగిస్తారని భావించింది. తిరుప్పావై ధ్వన్యర్థ గ్రంథరాజమని అంగీకరించిన విషయమే. పరుషముగా మాటాడరాదని, అందరిపట్ల పూజ్యభావం కలిగి ఉండాలని, తన తప్పును ఎత్తిచూపినప్పుడు. ఏమాత్రం బాధపడక సంతోషంగా స్వీకరించే ఉత్తమగుణం ఉండాలని అహంకారం పూర్తిగా నశిస్తేనే ఇవి జరుగుతాయని తెలియ జేసింది. ఏది మంచో ఏది చెడో వివేచన చేసుకోమని హెచ్చరించింది. యోగ, ధ్యానాదులు అత్యంత ఆరోగ్య ప్రదాతలనే అంతరార్థాన్ని వక్కాణించింది. చివరి పాశురం ఫలశ్రుతి. ఎవరైతే ఈ పాశురాలు గానం చేస్తారో, వారికి భగవత్ కృప తప్పకుండా కలుగుతుందని అందులో హామీ ఇస్తుంది. గోదాతల్లి సామాజిక దృక్పథంతోనే ప్రజలను భక్తి, నీతి మార్గాలవైపు నడిపించాలని, తానాచరించి చూపిన వ్రతం శ్రీవ్రతం, కాత్యాయని వ్రతం, ధనుర్మాస వ్రతం అనే వ్రతాన్ని ఆచరించి, ఈ ఉత్తమ గుణాలను అలవాటు చేసుకొనగలిగితే ఆ తల్లి సామాజిక స్పృహను అర్థంచేసుకున్న వారమవుతాం. అపురూపమైన, మానవజన్మను సార్థకం చేసుకున్న వారం అవుతాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# పెన్షన్ దయాదాక్షిణ్యం కాదు...అది ఉద్యోగి హక్కు!! - డిసెంబర్ 17 ...43వ జాతీయ పెన్షనర్ల దినోత్సవం

డిసెంబర్ 17ను జాతీయ పెన్షనర్ల దినోత్సవంగా జరుపుకోవడం అనవాయితీ. దేశవ్యాప్తంగా జిల్లా, మండల పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో అందుబాటులో గల సభ్యులంతా ఒక్కచోట చేరి, సీనియర్లకు సన్మానాలు, సత్తమ సేవకులకు అభినందనలు, పాత కొత్త విశ్రాంతుల కలయికలతో వేడుకగా సామూహిక భోజనాది కార్యక్రమాలను ఏటా నిర్వహించు కోవడం సంప్రదాయంగా మారింది. పెన్షన్ పొందడం ఉద్యోగికి ఒకరి ద్వారా దయాదాక్షిణ్యమో, భిక్షా కాదని, సుదీర్ఘ జీవన పోరాటంలో చేసిన త్యాగాలు, అందించిన అమూల్య సేవలకు గుర్తింపుగా, పెన్షన్ పొందే హక్కు ఉద్యోగికి ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్ర చూడ్ నేతృత్వంలోని న్యామూర్తులు డి.ఎస్. నకారా కేసులో 1982 డిసెంబర్ 17నే యాదృచ్ఛికంగా పెన్షనర్లకు అనుకూల తీర్పు వెలువరించారు. సదరు తీర్పు తో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం ద్వారా చట్ట భద్రత కలిగింది. జీవిత మలి సంధ్యలో కోట్లాది రూపాయలు సంపాదించిన వారు కూడా తమ కుటుంబ సభ్యుల చేత నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటారు. అయితే ఉద్యోగ విరమణ చేసిన పింఛను దారుల జీవిత చరమాంకం ఇందుకు భిన్నంగా కనిపిస్తుంది. విశ్రాంత ఉద్యోగి మరొకరికి భారం కాకుండా జీవించి ఉన్నన్ని రోజులు నెల నెలా పెన్షన్ రూపం లో డబ్బు చేతికి అందుతోంది. 80కి వయసు వచ్చినా పెన్షనర్లు ఉల్లాసంగా ఉండడానికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్ సౌకర్యం అనేది ఎవరూ కాదన లేని వాస్తవం. 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వంకు సేవలందించి పదవీ విరమణ చెందిన ఉద్యోగులకు ప్రతి నెల ప్రభుత్వం ఇచ్చే గౌరవ భృతి పెన్షన్. అలాంటి పెన్షన్ పై ఆదాయపు పన్ను రద్దు చేయాలని గత 5 ఏళ్లుగా తెలంగాణ పెన్షనర్స్ ఆధ్వర్యంలో వివిధ రీతుల్లో ఉద్యమిస్తున్నారు. రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 4 ఏళ్లుగా





ఢిల్లీ వెళ్లి జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేస్తున్నారు. ప్రధాన మంత్రికి, దేశ ఆర్థిక మంత్రికి పోస్ట్ కార్డులు పంపుతూ పెన్షనర్స్ కు ఆదాయపు పన్ను రద్దు చేయాలని మనవి చేస్తున్నారు. అయినప్పటికి కేంద్రం నుంచి స్పందన లేక పోవడంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత డిసెంబర్ మొదటి వారంలో ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్ ,మున్సిపల్ చైర్మన్ ల తో ప్రధాన మంత్రికి పోస్ట్ కార్డుల వినతులు పంపించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26 లో బడ్జెట్ లో నైనా పెన్షనర్స్ కు ఆదాయపు పన్ను మినహాయింపు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం, సంక్షేమం లక్ష్యంగా 2013 లో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అస్సోసియేషన్ ను హైదరాబాద్ లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. 1969లో తెలంగాణ తొలి, తర్వాత మలి దశ ఉద్యమాల్లో పనిచేస్తూ, పలుసార్లు అరెస్టులకు గురయిన జగిత్యాల పట్టణ వాసి హరి అశోక్ కుమార్ లాంటి చిత్తశుద్ధి పట్టుదల గల సమర్థ నాయకుల సలహాలతో ఎన్నో ఉద్యమాలు నడుస్తున్నాయి.

కేసిఆర్ నేతృత్వంలోని గత రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం పీఆర్సీ ఇచ్చింది. పదవీ విరమణ వయసు 61 ఏళ్లకు పెంచింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా 70 ఏళ్లకే క్వాంటం పెన్షన్, గ్రాట్యుటీ రూ.16 లక్షలకు మంజూరు చేయడం జరిగింది. పెన్షనర్ లైఫ్ సర్టిఫికేట్ సమర్పణలకు టీ యాప్ సౌకర్యం కల్పించి పలు ఇబ్బందులను ప్రభుత్వం తొలగించింది. అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ లో ఆరోగ్య కార్డుల నగదు రహిత వైద్య సేవలు అందించాలని, పీఆర్సీ బకాయిలు వాయిదాలు లేకుండా ఒకేసారి చెల్లించాలని, ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వంను , పెన్షనర్ల కు ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని కేంద్ర ప్రభుత్వంను పెన్షనర్లు కోరడం సమంజసం. దేశానికి స్వాతంత్రం వచ్చాక మౌలిక సదుపాయాలు లేని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు సేవలందిస్తునే ఉన్నారు. సమాజం విప్లవాత్మక మార్పులు రావాలన్నా%ొ% అభివృద్ధి పనులు అందరికీ ఉపయోగపడాలనే ఆలోచనలకు అనుభవం అతి ముఖ్యమైన అంశం. తమ జీవితం అంతా ప్రజా శ్రేయస్సు కోసం ఉద్యోగ ప్రయాణం చేసి విశ్రాంతి తీసుకుంటూ తమ అనుభవాలను, ఆలోచనలను అందిస్తూ.. విశ్రాంత ఉద్యోగులు సమాజాభివృద్ధికి పాటు పడుతున్నారు. అలాంటి విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వం సీనియర్ సిటీజన్స్, పెన్షనర్స్ ను దృష్టిలో ఉంచుకొని పలు రాయితీలు కల్పించాలని పెన్షనర్లు కోరుతున్నారు. ఆర్టీసి బస్సుల్లో, రైళ్లలో 50 శాతం రాయితీ కల్పించాలని, ఆరోగ్య కార్డులు ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని, ఆదాయపు పన్ను నుంచి పెన్షనర్స్ ను మినహాయించాలని చేస్తున్న విజ్ఞప్తులు న్యాయబద్ధం అని భావించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# నిస్వార్థ ప్రజా సేవకుడు పట్టాభి - డిసెంబర్ 17... భోగరాజు పట్టాభి సీతారామయ్య వర్ధంతి




రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం తలుపుతట్టినా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి పదవి గుమ్మం వరకు వచ్చినా సున్నితంగా తిరస్కరించి ప్రజాసేవలో, రాజకీయాల్లో మునిగిపోయిన మహనీయుడు డాక్టర్ పట్టాభి సీతారామయ్య. అంతే కాదు, నిరంతర ప్రజా క్షేమం గురించి ఆలోచించే పట్టాభి, ప్రత్యేక తెలుగు రాష్ట్ర ఉద్యమానికి చేసిన కృషి మరిచి పోలేనిది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీకి సన్నిహితునిగా పట్టాభి సీతారామయ్య నిర్వహించిన పాత్ర మరవ లేనిది. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి సుభాష్ చంద్రబోస్ కు వ్యతిరేకంగా, మహాత్మా గాంధీ అభిమతానికి దగ్గరైన వాడిగా, పట్టాభి పోటీలో పాల్గొని ఓటమి పాలైన సందర్భంగా పట్టాభి ఓటమి తన ఓటమిగా గాంధీజీ భావించి బాధపడ్డారంటే వారికున్న సాన్నిహిత్యం స్పష్టం అవుతున్నది. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్వాతంత్ర్య సమరయోధునిగా, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకునిగా, తెలుగు భాషాభిమానిగా, ప్రత్యేక రాష్ట్ర సాధకునిగా, ఖద్దరు దారిగా, స్వాతంత్ర్య సమరశీలిగా, మహాత్మా గాంధీకి ఆప్తునిగా, రాజకీయ చతురునిగా, గవర్నర్ గా, నిరంతర ప్రజా సేవకునిగా, ముక్కుసూటి మనిషిగా ఆయన బహుముఖ శక్తిగా, వ్యక్తిగా సుపరిచితులు. పశ్చిమ గోదావరి జిల్లా గుండుకొలను గ్రామంలో 1880, నవంబర్ 24 న ఆరువేల నియోగి బ్రాహ్మణుల ఇంటిలో పట్టాభి జన్మించారు. ప్రాథమిక విద్య స్థానికంగా బందరులోనే చదివి ఉన్నత విద్యకై మద్రాసు (నేటి చెన్నై) వెళ్ళి మద్రాసు క్రైస్తవ కళాశాల నుండి బి.ఏ. డిగ్రీ పొందిన పట్టాభి ఎం.బి.సి.ఎం. డిగ్రీ సాధించి డాక్టరు కావాలనే తన ఆశయాన్ని నెరవేర్చు కున్నారు. 1906లో మచిలీపట్నంలో వైద్యవృత్తిని చేపట్టారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, కాంగ్రెస్ నాయకుడిగా ఉంటూనే చదువు పూర్తి చేసిన తర్వాత మచిలీపట్నంలో డాక్టరుగా ప్రాక్టీసు పెట్టారు, కాని తన వృత్తి, ప్రవృత్తి అది కాదని ఎంచి, లాభదాయకమైన సంపాదనను వదులుకొని గాంధీజీచే ప్రభావితులై, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమములో పాల్గొన్నారు. అయితే గాంధీజీ పిలుపు మేరకు 1916 లో ఆ వృత్తిని వదిలి పెట్టడమే కాకుండా, భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించే వరకు ఎటువంటి వృత్తిని చేపట్ట కూడదనే ధ్యేయంతో ముందుకు సాగారు. సామాన్య ప్రజలకు బ్యాంకులు అందుబాటులో లేని రోజుల్లో, అప్పులకోసం అన్నదాతలు ఎదురు తెన్నులు చూస్తున్న రోజుల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నేడు దేశంలో ప్రముఖ బ్యాంకుగా చలామణి అవుతున్న ఆంధ్రాబ్యాంక్‌ను 1923లో స్థాపించారు. అంతేకాకుండా ఆయన స్థాపించిన ఆంధ్ర ఇన్సూరెన్స్ కంపెని (1925), హిందుస్తాన్ ఐడియల్ ఇన్సూరెన్స్ కంపెని (1935) లు తరువాతి కాలంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో పట్టాభీ గాంధీజీకి అతి సన్నిహితంగా ఉండేవారు. 1939లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి అతివాద కాంగ్రెస్ అభ్యర్థి అయిన సుభాష్ చంద్రబోస్ కు వ్యతిరేకంగా, మహాత్మా గాంధీ అభిమతానికి దగ్గరైన వాడిగా, పట్టాభి పోటీలో పాల్గొని ఓటమి పాలైనారు. అయితే తమిళ ఆధిపత్యమున్న కొన్ని జిల్లాలను భావి తెలుగు రాష్ట్రములో కలపటానికి మద్దతు నిస్తున్నాడన్న భావన ఆయన ఓటమికి ప్రధాన కారణమయ్యింది. పట్టాభి ఓటమి తన ఓటమిగా గాంధీజీ భావించి బాధపడ్డారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభములో కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ వర్గంలో పనిచేస్తూ ఉండగా మొత్తం కార్యాచరణ వర్గ సహితంగా పట్టాభిని అరెస్టు చేసి జైలు పాలు చేయగా, మూడేళ్లపాటు పట్టాభి తన దినచర్యను విస్తారమైన డైరీలో రాసుకున్నారు. దీనిని తదనంతరం ఫెదర్స్ అండ్ స్టోన్స్ (ఈకలు మరియు రాళ్ళు)గా ప్రచురించారు. 1948లో జైపూర్ కాంగ్రెస్ సమావేశం నాటికి కాంగ్రెస్ అధ్యక్షుని స్థాయికి ఎదిగారు. 1948లో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలలో పురుషోత్తమ్‌దాస్ టాండన్ పై గెలిచి స్వతంత్ర భారత తొలి కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. 1952-57 మధ్యకాలంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా వ్యవరించారు. రాష్ట్రం బయట పనిచేసిననూ తెలుగు భాషపై మమకారం కోల్పోలేదు. తను స్థాపించిన ఆర్థిక సంస్థలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని సూచించారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి ఎన్నో చిరస్మరణీయ సేవలను ఆయన చిత్తశుద్ధితో అందించారు. తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలని దాని కొరకు పట్టాభి ఎంతగానో కృషి చేశారు. పట్టాభి చొరవతోనే ఆంధ్ర రాష్ట్రోద్యమానికి అంకురార్పణ 1908లో బందరులో జరిగింది. బందరు సమావేశంలో తెలుగు జిల్లాల ప్రముఖులందరూ సమావేశమై ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం గురించి చర్చించారు. ఆ తరువాతనే 1913లో బాపట్లలో తొలి ఆంధ్ర మహాసభ జరిగింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవశ్యకత గురించి పట్టాభి ఆంగ్లంలో ఒక గ్రంథమే రచించారు. పట్టాభి కృషి వల్లనే 1920లో కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సూచన ప్రాయంగా ఆమోదించింది. పట్టాభి సీతారామయ్య ఎన్నో ఆర్థిక సంస్థలను స్థాపించారు. ఆంధ్రా బ్యాంకు (1923లో స్థాపన), ఆంధ్రా ఇన్స్యూరెన్స్ కంపెనీ, భారత లక్ష్మీ బ్యాంకు, కృష్ణా కో-ఆపరేటివ్ బ్యాంకు మొదలగు వాటి స్థాపనలో విశేష కృషి సల్పారు. ఆంద్రాబ్యాంకు ద్వారా వ్యవసాయ దారులకు రుణాలిచ్చి వ్యవసాయాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. చిన్న మొత్తంలో డిపాజిట్లు సేకరించి పొదుపును అధికంగా ప్రోత్సహించారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసమే కాకుండా తెలుగు జిల్లాలలో తెలుగు వాడకాన్ని పట్టాభి ఎంతగానో ప్రోత్సహించారు. తాను స్థాపించిన సంస్థలన్నింటి లోనూ తప్పనిసరిగా ఉత్తర ప్రత్యుత్తరాలు, లావాదేవీలు తెలుగులోనే జరగాలని నియమ నిబంధనలు పెట్టి ఆచరింప చేశారు. ఆయన వేష, భాషల్లో ఎప్పుడూ తెలుగుతనం ఉట్టిపడుతూ ఉండేది. అఖిల భారత కాంగ్రెస్ అయిననూ, గవర్నర్‌గా మధ్య ప్రదేశ్ వెళ్ళినను వేష, భాషల్లో మార్పు రాలేదు. పట్టాభి రచించిన గ్రంథాలలో కాంగ్రెస్ చరిత్ర అన్నింటికంటే ప్రధానమైనది. సుమారు 1600 పుటల కాంగ్రెస్ చరిత్రను కేవలం 2 మాసాలలో పూర్తిచేశారు. స్వాతంత్ర్యం తరువాత 1948లో తొలి జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టి, తరువాత 1952లో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై పార్లమెంటులో ప్రవేశించారు. 1952 నుండి 1957 వరకు మధ్య ప్రదేశ్ గవర్నరుగా పని చేశారు. తెలుగు ప్రజలకు ఎంతగానో తోడ్పాటు అందించిన పట్టాభి 1957, డిసెంబర్ 17న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# ఖాకీల ఠాణాల్లో.. కాసుల తందానా..!

సూర్యాపేట: శాంతిభద్రతల పరిరక్షణే పరమావధిగా విధులు నిర్వర్తించాల్సిన పోలీసుల్లో కొందరు వ్యవహరిస్తున్న తీరు బాధితులను కుదేలు చేస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కొన్ని ఠాణాల్లో పంచాయితీలకే పెద్దపీట వేస్తూ 'పంచుకుంటున్నట్లు' విమర్శలు వినిపిస్తున్నాయి. వచ్చే ఫిర్యాదుల్లో మాకేం లాభం అని వెదుక్కునే వారు భూవివాదాల్లో జోక్యం చేసుకుంటూ జేబులు నింపుకొంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు హెచ్చరించినా పద్ధతిని మార్చుకోకపోవడంతో ఆ వ్యవస్థపైనే నమ్మకం సన్నగిల్లుతోందని బాధితులు వాపోతున్నారు.

కొన్నిస్టేషన్ల అధికారులు కేసుల్లో ప్రమేయం ఉన్న వారిని తప్పించేందుకు, స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దాదాపు పది నెలల కిందట సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్సై ఓ కేసులో సంబంధం ఉన్న వ్యక్తి పేరును తొలగించేందుకు భారీగా డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీకి పట్టించారు. మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌కు స్థిరాస్తి వ్యాపారులు వెంచర్ కోసం కొనుగోలు చేసిన నాలుగెకరాల వ్యవసాయ భూమికి సంబంధించి యజమానికి డబ్బుల చెల్లింపుల్లో జరిగిన జాప్యంపై ఫిర్యాదు వచ్చింది. ఆ విషయంలో నేరుగా పోలీస్



ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిష్కరించినట్లు తెలిసింది. అందుకు పెద్దమొత్తంలోనే డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. కోదాడ సబ్ డివిజన్ పరిధిలోని ఓ ఠాణాలో పనిచేస్తున్న ఎస్సై సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకుంటూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు గుర్తించిన అధికారులు అక్కడి విధుల నుంచి తప్పించాలనుకున్నారు. కానీ, రాజకీయ పలుకుబడితో ఎలాంటి చర్యలు లేకుండానే అదే కుర్చీలో కూర్చుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

**బాధితులు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు**

నరసింహ, ఎస్పీ, సూర్యాపేట

న్యాయం కోసం వచ్చినప్పుడు స్టేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే బాధితులు వారిపై నేరుగా మాకు ఫిర్యాదు చేయొచ్చు. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ఉమ్మడి జిల్లాలోని పలు ఠాణాల్లో ఎస్‌హెచ్‌వోలు పంచాయితీలకే మొగ్గుచూపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. డబ్బులు ఇచ్చిపుచ్చుకునే విషయంలో తలెత్తే వివాదాలు, ప్రైవేటు చీటీల వ్యవహారం, భూముల సరిహద్దు ఘర్షణలు, స్థిరాస్తి వ్యాపారుల మధ్య గొడవలపై ఎక్కువ దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. ఆ పంచాయితీల పరిష్కారం స్టేషన్ పరిసరాలకు దూరంగా జరిగేలా చేస్తున్నారు. మధ్యవర్తుల్లో తమకు అనుకూలురైన వారుండేలా చూసుకుంటున్నారు. గొడవ సద్దుమణిగాక వారి చేత డబ్బులు వసూలు చేయిస్తున్నట్లు సమాచారం.

# చెత్తంతా చెరువుల్లోకి.. విషమంతా తనువుల్లోకి..!

నల్గొండ: సాగు, తాగు అవసరాలకు ఉపయోగపడే చెరువులు వ్యర్థాలతో చెత్తకుండీలుగా మారాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 3,500 వరకు పెద్ద చెరువులున్నాయి. 60 శాతం మేర సమీప పరిశ్రమల నుంచి వ్యర్థాలతో కలుషితమవుతున్నాయని జల సంరక్షణ నివేదికల సర్వేలు వెల్లడిస్తున్నాయి. చెరువుల్లో కలుషితాల వ్యాప్తికి కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు చేపడితేనే వ్యర్థాలతో కలిగే అనర్థాలు నియంత్రణలోకి వస్తాయని నీటి సంరక్షకులు అభిప్రాయ పడుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

నాంపల్లి మండలం నాగుల చెరువులో సమీప ప్రాంతాల చికెన్, మటన్ సెంటర్ నిర్వాహకులు పెద్దఎత్తున డ్రమ్ముల్లో తీసుకువచ్చి పారవేసి వెళ్తున్నారు. వ్యర్థాల మూలంగా ఈ ప్రాంతంలోకి వెళ్తే భరించలేని దుర్వాసన వస్తోంది. నల్గొండ జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువులో అండర్‌డ్రైనేజీ నీరు కలుస్తుందని పలుమార్లు స్థానికులు పురపాలిక అధికారులకు విన్నవించినా.. ఫలితం లేదు.

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఎల్లారం చెరువులో కోదాడ, సూర్యాపేట, నేరేడుచర్ల ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలను తెచ్చి పారవేసి వెళ్తున్నారు. చేపలు పెరిగేందుకు మాంసం వ్యర్థాలను వేస్తుండటంతో పరిసరాలు కంపుకొడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ః మేళ్లచెరువు, మిర్యాలగూడ, దామరచర్ల, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న బియ్యం మిల్లులు, సిమెంట్ పరిశ్రమలు సైతం కాలువల ద్వారా సమీప చెరువుల్లోకి వ్యర్థాలను వదులుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు, వలిగొండ, అడ్డగూడూరు, బీబీనగర్, చౌటుప్పల్, పోచంపల్లి, భువనగిరి మండలాల్లోని పలు గ్రామాల్లోని చెరువుల్లో కాలుష్య వ్యర్థాలను ఇష్టానుసారంగా వేస్తున్నారు. కొందరు రాత్రి రసాయన వ్యర్థాల ద్రావణాలను ట్యాంకర్ల ద్వారా తెచ్చి అత్యంత ప్రమాదకరమైన వ్యర్థాలను పారవేస్తున్నారు.

తమ పరిశ్రమల పరిధిలోనే వ్యర్థాలను నిర్వీర్యం చేయాల్సి ఉండగా సమీపంలో, శివారులో ఉండే చెరువుల్లో అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా డంపింగ్ చేయడం గమనార్హం. ఈ నీటిని పొలాలకు ఉపయోగించడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**నోటీసులు ఇస్తున్నాం** ఔషధ, సిమెంట్, రైస్‌మిల్లులు, రంగుల పరిశ్రమల నిర్వాహకులకు గతంలో నోటీసులు ఇచ్చి జరిమానాలు విధించాం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధాన చెరువుల్లో మాంసం వ్యర్థాలను పారవేస్తున్న వారిపై నిఘా పెట్టి వారికి జరిమానాలు విధిస్తాం. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులను పంపించి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అజయ్‌కుమార్, సీఈ, నీటిపారుదలశాఖ

# కోత పెట్టు.. కోతులపైకి నెట్టు!



నర్సాపూర్: నర్సాపూర్ డివిజన్ కేంద్రంలో కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనెక్షన్లకు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో వినియోగదారుల అవస్థలు చెప్పనలవి కాదు. సరఫరాలో అంతరాయానికి కారణం అడిగితే, కోతుల మీదకు నెట్టేస్తున్నారు. వానరాలు విద్యుత్ నియంత్రికలపై దూకుతున్నాయని, తీగలపై వేళాడుతుండడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు చెబుతున్నారు. నిర్వహణ లోపం ఉన్నా ఆ విషయాన్ని పట్టించుకోవడంలేదు. ఇక వార్డుల్లో తీగలు కిందకు వెళాడుతుండడం, నియంత్రికలపై అదనపు భారం పడి లోఓల్టేజి సమస్యలు ఎదురవుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడో తీగ సమస్యలు చాలా వార్డుల్లో ఉన్నాయి.

**12 వేల సర్వీసులు...ఇద్దరే ఉద్యోగులు**

పట్టణంలో మొత్తం 15 వార్డులుండగా 12వేల సర్వీసులున్నాయి. ఒక లైన్‌మెన్, సహాయ లైన్‌మెన్ మాత్రమే ఉన్నారు. ఇద్దరు ఆర్టిజన్లు ఉన్నారు. వీరే సరఫరాను పర్యవేక్షించాలి. ప్రస్తుత సర్వీసు కనెక్షన్లకు అనుగుణంగా ఐదుగురు లైన్‌మెన్లు ఉండాలి. విద్యుత్తు రీడింగ్, బిల్లుల వసూలు, బ్రేక్‌డౌన్లు తదితరాలను కూడా వీరే చూస్తున్నారు. మండలానికి ఒక లైన్‌మెన్, ఫోర్‌మెన్, ఏఈ ఉన్నా, వీరు క్షేత్రస్థాయిలో కనిపించరు.

**ఫ్యూజ్‌ఆఫ్‌కాల్ కార్యాలయం ఉన్నా..**

పట్టణంలో ఫ్యూజ్‌ఆఫ్ కాల్ కార్యాలయం ఉంది. దీనిని బిల్లుల వసూలుకు ఉపయోగిస్తున్నారు. తప్పితే అక్కడ సిబ్బంది కనిపించరు. సమస్య తలెత్తితే విద్యుత్తు సిబ్బంది ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలియదు.

**ఫిర్యాదు చీందిూ్పంట‌ు ఇ్పందిఊఖిన్నాం**

రమణారెడ్డి, ఏడీఈ

స్థానికంగా సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. సమస్యపై ఫిర్యాదు అందిన వెంటనే తక్షణం స్పందిస్తున్నాం.

# కాగిత రహితం.. సేవలు పారదర్శకం



సంగారెడ్డి: విద్యాశాఖ జిల్లా కార్యాలయాల్లో అందుతున్న సేవల్లో పారదర్శకత లోపించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల హన్మకొండ డీఈఓ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాల గుర్తింపు పునరుద్ధరణకు లంచం తీసుకుంటూ ఇన్‌ఛార్జి డీఈఓగా సేవలందిస్తున్న అదనపు కలెక్టర్ అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలల రాష్ట్ర సంచాలకుడు తక్షణమే డీఈఓ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ సేవలు ప్రారంభించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను సైతం మంజూరు చేశారు. మెదక్ జిల్లాలో గత కొంతకాలంగా ఈ సేవలు అందుతున్నాయి. ఇదే మాదిరిగా సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని డీఈఓ కార్యాలయాల్లో అమలు చేస్తే పారదర్శక సేవలు అందనున్నాయి.

**ఆన్‌లైన్‌లోనే పరిశీలన**

డీఈఓ కార్యాలయం ఇన్‌వార్డులో వచ్చిన దరఖాస్తును సంబంధిత రికార్డు అసిస్టెంట్ స్కానింగ్ చేసి నంబరు కేటాయించి కార్యాలయ నిర్వహణ అధికారికి ఆన్‌లైన్‌లో పంపించాలి.

కార్యాలయ నిర్వహణ అధికారి దరఖాస్తును పరిశీలించి సెక్షన్ అధికారికి అసైన్ చేయాల్సి ఉంటుంది.

సెక్షన్ అధికారి నోట్‌ఫైల్ తయారు చేసి సవ్యంగా ఉంటే ఉన్నతాధికారికి ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేస్తారు. ఏవైనా అనుమానాలు ఉంటే దరఖాస్తుదారుకు తెలియజేయాలి. పూర్తి సమాచారం సేకరించిన అనంతరం ఫైల్ ముందుకు కదిలేలా చేయనున్నారు.

ఈ-ఆఫీస్ విధానంలో ముఖ్యంగా దస్త్రాలను ఈ-ఫైలింగ్ విధానం ద్వారా ఒక సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు చేరవేస్తారు.

**అందిపుచ్చుకుంటున్న మెదక్**

గత ఏడాదిన్నర నుంచి మెదక్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ-ఆఫీస్ సేవలు అమలు చేస్తున్నారు. అయితే జిల్లా కార్యాలయంలోనే ఈ సేవలందుతున్నాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నిర్దేశించిన ప్రకారం ఎంఈవో కార్యాలయాలతో పాటు స్కూల్ కాంప్లెక్స్‌లలోనూ ఈ- ఆఫీస్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. జిల్లా నుంచి మొదలుకొని పాఠశాల స్థాయి వరకు కాగితపు రహిత సేవలతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు సత్వర సేవలందనున్నాయి.

**ప్రధాన ప్రయోజనాలివి**

ఇన్‌వార్డు నుంచి మొదలుకొని డీఈఓ వరకు ఆ దస్త్రాన్ని ఎక్కడి నుంచైనా పరిశీలించేందుకు ఈ-ఫైలింగ్ విధానం ఉపయోగపడుతుంది. కాగిత రహిత సేవలను వినియోగించుకోవచ్చు.

సెక్షన్ సిబ్బంది లేదా అధికారి పరిశీలించాక కార్యాలయ సూపరింటెండెంట్‌కు పంపిస్తారు. అక్కడి నుంచి డీఈఓ లాగిన్‌కు చేరుతుంది. ఆయన పరిశీలించి, సవ్యంగా ఉంటే ఆమోదం తెలుపుతారు.. సవ్యంగా లేకుంటే వెనక్కి పంపిస్తారు.

సంగారెడ్డి, సిద్దిపేటల్లోనూ త్వరలో అమలు చేయనున్నట్లు ఆ జిల్లాల అధికారులు తెలిపారు.

# గృహ ప్రవేశానికి.. రారండోయ్!



మావల: బల్దియాలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు కొలిక్కి వస్తోంది. గతంలో నిర్వహించిన లక్కీ డ్రాలో ఎంపికైన లబ్ధిదారులతోపాటు ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులను గుర్తించి లబ్ధిదారుల జాబితా తయారు చేస్తున్నారు. అయితే గతంలో నిర్వహించిన లక్కీ డ్రాలో ఎంపికైన వారిలో 176 మంది లబ్ధిదారులు ఇప్పటిదాకా సర్వేకు చిక్కలేదు. లబ్ధిదారుల స్థితిగతులపై సర్వే చేసేందుకు వార్డు అధికారులు ఎంత వెతికినా అందుబాటులోకి రాకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదించారు.

**618 ఇళ్లకు లక్కీ డ్రా**గత ప్రభుత్వ హయాంలో 170 కాలనీలో రూ.11.76 కోట్లతో 222 గృహాలు, కేఆర్కే కాలనీలో రూ.40.28 కోట్లతో 760 ఇళ్లతో జీ ప్లస్-2 తరహాలో ఇళ్ల సముదాయాలను నిర్మించారు. అయిదేళ్లకు పైగా అక్కడ వసతులు కల్పించకపోవడంతో ఇప్పటిదాకా కేటాయింపు జరగలేదు. 2023 మేలో దరఖాస్తు చేసుకున్న వారికి అప్పటి కలెక్టర్ రాహుల్ రాజ్ లక్కీ డ్రా నిర్వహించారు. మొత్తం 982 ఇళ్లలో 618 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారి నేపథ్యాన్ని మరోసారి సర్వే చేసిన తర్వాత ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో లక్కీడ్రాలో ఎంపికైన వారిని మళ్లీ సర్వే చేసి ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది.

**అనాసక్తికి కారణాలు అనేకం**లబ్ధిదారుల సర్వేకు వార్డు అధికారులు ఇటీవల క్షేత్రస్థాయికి వెళ్లారు. రెండున్నరేళ్ల కిందట ఇచ్చిన వివరాలను బట్టి చిరునామా దొరకడం లేదు. ఫోన్ నెంబర్లు పనిచేయడం లేదు. కొందరు చనిపోవడం, మరికొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో 618లో 176 మంది వివరాలు అందుబాటులో లేవు. డబుల్ బెడ్రూం ఇళ్లు అపార్ట్‌మెంట్ తరహాలో నిర్మించడం, అక్కడ కనీస వసతులు లేకపోవడంతో కొందరు సొంత స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు మక్కువ చూపుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ 176 మంది స్థానంలో అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# వణికిస్తున్న చలి.. భయపెడుతున్న పులి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు గనుల సమీపంలో పెద్దపులి సంచారం స్థానికంగా భయాందోళనకు గురి చేస్తోంది. రాత్రి ఆర్కే-8 గని సమీపంలో సింగరేణి అంబులెన్సు డ్రైవర్‌కు బెబ్బులి కనిపించగా ఆ విషయం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో ఏరియాలో పెద్దపులి తిరుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. సమాచారం తెలుసుకొని అటవీశాఖ సిబ్బంది అదే రోజు రాత్రి అది కనిపించిన ప్రదేశానికి వెళ్లి ఆ మార్గంలో ఎవరూ వెళ్లకుండా నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం శ్రీరాంపూర్ ఉపరితల గని ఆవరణలోని బోర్‌వెల్ వైపు పులి పాదముద్రలను కార్మికులు గుర్తించగా అటవీ సిబ్బంది వాటిని నిర్ధారించారు. ప్రస్తుతం అది ఎస్సార్పీ ఓసీపీ-జైపూర్ రైల్వే ట్రాక్ లైన్‌లో వెళ్లి ఉంటుందని భావిస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది రామారావుపేట, ట్రాక్‌లైన్ వెంట గాలింపు చేపట్టారు. రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, ఎస్అండ్‌పీసీ సిబ్బంది, సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విధులకు గుంపులుగా వెళ్లాలని పేర్కొన్నారు. పడిపోతున్న ఉషో?గ్రతలు జిల్లాలో రోజురోజుకు పడిపోతున్న ఉషో?గ్రతలు సింగరేణి ఉద్యోగులపై ప్రభావం చూపుతున్నాయి. వారం రోజులుగా 10 డిగ్రీల సెల్సియస్‌కు కనిష' ఉషో?గ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. రెండో షిఫ్ట్ ముగించుకొని రాత్రి 10 గంటలకు ఇంటికి వెళ్లే ఉద్యోగులు, రాత్రి బదిలీ 11 గంటలకు, ఫ్రీ షిఫ్ట్ ఉదయం 5 గంటలకు విధులకు వచ్చే కార్మికులు చలి పంజా బారిన పడుతున్నారు.

# అయిదు తరగతులకు ఒకే పాఠం!

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేట మండలం రాఘవానితండా ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కరే ఉపాధ్యాయురాలు. అయిదు తరగతులకు బోధన చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితిలో ఆమె సెలవు కూడా పెట్టలేని పరిస్థితి. ఇక ఒకే పాఠం అయిదు తరగతుల వారు వినాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 234 పాఠశాలల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. జిల్లా వ్యాప్తంగా: మెదక్ జిల్లా వ్యాప్తంగా 902 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 623. వీటిలోనే అధికంగా 234 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీటిల్లో విద్యార్థుల సంఖ్య 20 లోపే ఉండడంతో బోధనకు ఒక్కరినే కేటాయించారు. వీటిలో 51 పాఠశాలల్లో పదిలోపే విద్యార్థులు ఉండటం గమనార్హం. మారుమూల ప్రాంతాల్లో ఈబడులు కొనసాగుతుండటం వల్ల విద్యార్థుల సంఖ్య లేకపోవడం వల్ల ఉపాధ్యాయ పోస్టులు లేకుండా పోయాయి. అయితే ఉన్న విద్యార్థులకు



మాత్రం సరిగా బోధన అందడం లేదు. ఉన్న ఒక్క ఉపాధ్యాయులపై పాఠశాల నిర్వహణ బాధ్యత పడటంతో బోధనకు పూర్తి స్థాయి సమయం దొరకడం లేదు.

**తప్పని ఇబ్బందులు**

ఉపాధ్యాయులకు యూడైస్ ఆన్‌లైన్ పని, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, హాజరు, ప్రధానోపాధ్యాయుల సమావేశాలు వంటి పనులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాలలతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. బోధన సరిగా సాగక విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఉన్న ఒక్క ఉపాధ్యాయులు అన్ని తామై నడిపించడం భారంగా మారుతోంది. ఉపాధ్యాయులకు అత్యవసర పరిస్థితిలో సెలవుపై వెళ్లాలంటే ప్రత్నామ్నాయంగా ఒక ఉపాధ్యాయులైనా, సీఆర్పీ అయినా పాఠశాలకు రావాల్సిందే. పాఠశాల మూసేయకుండా ఉండేలా ఆదేశాలు ఉండడంతో సెలవు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యావాలంటీర్లు ఉన్న సమయంలో వెసులుబాటు ఉండేది. ఈ పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాలు, దృశ్యసమీక్షలు వంటి ఇతర సమావేశాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వస్తోంది. ఇలా ఇబ్బందులు నడుమ ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగక తప్పడం లేదు.

**మూతపడకుండా చర్యలు**

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇబ్బందులు నడుమ కొనసాగుతున్నా విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తున్నాం. వాటిని మూసివేయకుండా ప్రత్యామ్నాయంగా అక్కడ ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సంఖ్య పెరిగితే ఉపాధ్యాయుల సర్దుబాటు, పోస్టుల మంజూరు చేసే అవకాశం ఉంటుంది. రాధాకిషన్ జిల్లా విద్యాధికారి

# తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో!

సిద్దిపేట : మారిన పరిస్థితుల్లో చరవాణి తోడుగా.. ఆన్‌లైన్ వేదికగా లావాదేవీలకు ప్రాధాన్యం పెరిగింది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కేవైసీ నమోదు.. నవీకరణ పేరిట.. గాలం వేసి బురిడీ కొట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి సందర్భాల్లో ఈ కేవైసీ(నో యువర్ కస్టమర్) అవసరం.. ప్రక్రియను ఎక్కడ.. ఎలా చేపట్టాలనే సమాచారం మీకోసం..

**పథకాల లబ్ధిదారులకు..**

ప్రభుత్వ రాయితీ, వివిధ పథకాల కింద లబ్ధి పొందాలంటే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) కింద బ్యాంకులు ఆధార్, మొబైల్ నంబరు, ఇతర వివరాలు(కేవైసీ) జత చేయాలని సూచిస్తుంటాయి. ప్రధానంగా ఉపాధి హామీ కూలీలు, రైతులు, చేయూత పింఛనర్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నగదు జమ క్రమంలో ప్రత్యేకంగా అడుగుతుంటాయి. ఖాతాకి ఆధార్, పాన్ కార్డును లింకు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచిస్తుంటారు.

**మూడు విభాగాల్లో పరిశీలన**

బ్యాంకు వినియోగదారులను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. లో రిస్క్ (చిరువ్యాపారులు, ఉద్యోగులు) పదేళ్లకోసారి, మీడియం రిస్క్(స్థిరాస్తి, ఉన్నత స్థాయి వ్యాపారులు, కంపెనీలు నిర్వహించే వారు) ఎనిమిదేళ్లకోసారి, హైరిస్క్(ఎగుమతి-దిగుమతి వ్యాపారులు, అధిక రిస్కు దేశాల్లో ఉండేవారు, నేర చరితులు) రెండేళ్లకోసారి రీ-కేవైసీ చేయాలి.



**వీరు బ్యాంకుకు వెళ్లాల్సిందే..**

సంతకాలు, ముఖ కదలికలు, వివిధ రకాల వివరాల మార్పు సహజంగా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఖాతాదారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా బ్యాంకులు ఆహ్వానిస్తుంటాయి. లావాదేవీలు సక్రమంగా చేపట్టేందుకు, నవీకరణకు పునః ప్రక్రియ దోహదం చేస్తుంది.

ఖాతా ఏడాది నుంచి రెండేళ్ల పాటు వినియోగించకుంటే ఇన్‌యాక్టివ్ దశలోకి వెళ్తుంది. బ్యాంకు ద్వారా వడ్డీ లాంటివి జమ అయినా.. ఖాతాదారుల లావాదేవీలు మాత్రం స్తంభిస్తాయి. రీ-కేవైసీ, ఈ-కేవైసీ పత్రాల సమర్పణను బ్యాంకుల్లో నేరుగా ఖాతాదారు చేపట్టడం ఉత్తమం. **నేరుగా సంప్రదించాలి**హరిబాబు, ఎల్‌డీఎం, సిద్దిపేట

రెండేళ్లుగా ఖాతాను వినియోగించని వారు సంబంధిత బ్యాంకుల్లో అధికారులను నేరుగా సంప్రదించాలి. నిర్దేశిత ధ్రువపత్రాలతో కేవైసీ ఫారాన్ని పూరించి సమర్పించాలి. గుర్తుతెలియని, అనుమానిత నంబర్ల నుంచి వచ్చే లింకులు, ఫోన్లకు స్పందించవద్దు.

చురకలు


# స్థల కొరత.. ఆరబోతకు గోస

జగిత్యాల : జగిత్యాల పట్టణంలోని బీట్‌బజార్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్థల కొరతతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. 5 వేల క్వింటాళ్ల దినుసులు వస్తే యార్డు పూర్తిగా నిండిపోతోంది. ఏ రోజు వచ్చినవి.. ఆ రోజు కొనుగోలు చేసి, తూకం వేసి తరలిస్తే రైతులు తెచ్చే ఉత్పత్తులు కుప్పలు పోయటానికి స్థలం ఉంటుంది. వివిధ కారణాలతో జాప్యం జరిగితే మరుసటి రోజు ధాన్యం ట్రాక్టర్లు, లారీలు వచ్చే వీలులేకుండా నిండిపోతోంది. దీంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా రూ.2.80 కోట్ల ఆదాయం ఉన్నా.. పంట ఉత్పత్తుల విక్రయ అవకాశాలు మెరుగుపరచటం లేదు. పాత యార్డులోని మొత్తం 5.20 ఎకరాల స్థలంలో 2 ఎకరాలు సమీకృత మార్కెట్కు ఇవ్వటంతో దినుసుల కల్లానికి స్థలం ఇరుగ్గా మారింది. మార్కెట్ కార్యాలయాన్ని 4 కిలోమీటర్ల దూరంలోని చల్‌గల్ యార్డుకు తరలించటంతో అధికారులు ఓ చోట, క్రయవిక్రయాలు మరోచోట జరుగుతున్నాయి.

**చల్‌గల్‌లో అరకొర వసతులే**

జిల్లా కేంద్రంలోని దినుసుల బీటును చల్‌గల్ యార్డుకు తరలిద్దామంటే.. అక్కడ పూర్తి స్థాయి సదుపాయాల్లేవు. వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి తొలుత తీసుకున్న 21 ఎకరాల్లో 16 ఎకరాల స్థలంలో 15 వేల టన్నుల సామర్థ్యంతో 4 భారీ గోదాములు, రైపెనింగ్ ఛాంబర్, కార్యాలయ భవనం, 2 ధర్మకాంటాలు, 4 వేయింగ్‌షెడ్లు నిర్మించారు. మిగిలిన 5 ఎకరాల భూమితో పాటు వాలంతరి నుంచి మరో 10 ఎకరాలు ఇటీవల తీసుకున్నారు. రూ.కోటితో గచ్చు, రూ.70 లక్షలతో సిమెంటు రహదారులు, రూ.5 లక్షలతో వాలంతరి ప్రదర్శన క్షేత్రంవైపు ఫెన్సింగ్, రూ.10 లక్షలతో గోదాములకు మరమ్మతులు



చేపట్టినా పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులో లేవు. చల్‌గల్ పట్టణానికి దూరంగా ఉండటంతో దినుసుల రక్షణ సమస్యగా మారింది.

**సౌకర్యాలతో అందుబాటులోకి తేవాలి**

పాత బీటులో స్థలం లేక రైతులు దినుసులు తేవటం లేదు. తెచ్చినవారికి తక్కువ ధరే పలుకుతోంది. చల్‌గల్ బీటులో రైతు విశ్రాంతి భవనం, క్రయవిక్రయాలు, తూకం చేపట్టేలా ఏర్పాటు చేసి తదితరాలు నిర్మించి అందుబాటులోకి తేవాలి.– భూమయ్య, రైతు, తాటిపల్లి

**మిగిలిన పనుల పూర్తికి ప్రతిపాదనలు**

చల్‌గల్ యార్డులో దశల వారీగా పనులు జరుగుతున్నాయి. మిగిలిన పనుల పూర్తికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే పనులు చేపట్టి యార్డును తరలించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, కార్యదర్శి

# లక్ష్యం చేరని ఆయిల్‌పామ్ సాగు

జగిత్యాల : కరీంనగర్ జిల్లాలో పలువురు రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటల్లో గెలలురాగా టన్నుకు రూ.19 వేల ధరకు అమ్మకం ఆరంభమైంది. మరో నాలుగైదు మాసాల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలామంది రైతుల తోటల్లో గెలలు చేతికందనున్నాయి. ఓ వైపు ఆయిల్‌పామ్ నాటిన రైతులకు మంచి ధర దక్కుతున్నా.. ప్రభుత్వం నుంచి రాయితీలున్నా ఆశించినట్లుగా సాగు విస్తీర్ణం పెరగకపోవటం అధికారులను ఆశ్చర్యపరుస్తోంది...

మన ప్రాంత రైతులకు ఆయిల్‌పామ్‌పై అనుభవం లేకపోవడం, కంపెనీలు ఏర్పాటు కాకపోవడంతో సాగు చేయడానికి ఆలోచిస్తున్నారు. ఈ అనుమానాలను అధికారులు నివృత్తి చేయడంతోపాటు తగు అవగాహన కల్పిస్తే సాగు పెరిగే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలో 131 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండగా ప్రతి ప్యాక్స్ పరిధిలో కనీసం 100 ఎకరాల విస్తీర్ణంలో రైతులతో ఆయిల్‌పామ్‌ను సాగు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు.

ఈ అంశాలపై దృష్టి సారిస్తే..

ఇటీవల వాతావరణ పరిస్థితులు మారటం, చీడపీడల తీవ్రతతో మామిడి సాగు నష్టాలకు గురవుతుండగా చాలామంది రైతులు మామిడి చెట్లను తొలగించి ఆయిల్‌పామ్ తదితర పంటలకు మళ్లుతున్నారు. ఆయిల్‌పామ్ ఒకసారి నాటితే కనీసం 30 ఏళ్ల పంటకాబట్టి మామిడిలా మధ్యలో వదిలేయాల్సిన పరిస్థితి రాకూడదని రైతులు భావిస్తున్నారు. గాలిలో తేమ శాతం అధికంగా ఉండే ప్రాంతంలో పండించే ఆయిల్‌పామ్‌ను ఉత్తర తెలంగాణలోనూ సాగు చేయవచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకు అనువైన మొక్కలను కూడా విదేశాల నుంచి



తెప్పిస్తున్నారు. అయినా తొలుత నాటిన పంట దిగుబడిని చూసి ముందుకెళ్లాలని చాలామంది రైతులు వేచి చూస్తున్నారు.

నాలుగు జిల్లాల్లో మూడు కంపెనీల బైబ్యాక్ ఒప్పందం ద్వారా ప్రభుత్వం సాగు చేయిస్తుండగా క్రషింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆ సంస్థలు స్థలాలను కూడా తీసుకున్నాయి. గానుగ పరిశ్రమ ఏర్పాటుకు కనీస దిగుబడి ఉండాలి కాబట్టి యాజమాన్యాలు కొన్నిమాసాల తరువాత కంపెనీలను ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వచ్చిన గెలలను ఇతర ప్రాంతాల్లోని తమ పరిశ్రమలకు తరలిస్తున్నాయి. కాగా స్థానికంగా పరిశ్రమల్లేకపోవడం రైతులను సందేహంలో పడేస్తోంది.

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన 5 ఏళ్ల నుంచి ఎకరాకు రూ. 44,000 వరకు పంట రుణాన్ని ఇవ్వనుండగా ఐదేళ్లనుంచి కాకుండా తొలి సంవత్సరం నుంచే పంట రుణాన్ని మంజూరివ్వాలని, పంటల బీమాను వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

# నగరవాసి.. అపరిశుభ్రతకు సాక్షి




కరీంనగర్: స్వఛ్‌సర్వేక్షణ్, సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించిన కరీంనగర్ ఇప్పుడు పారిశుద్ధ్య పనుల నిర్వహణలో వెనుకబడుతోంది. కార్మికులు, వాహనాల సంఖ్య ఏ మాత్రం తగ్గలేదు. పర్యవేక్షణ చేసేందుకు అధికారులు, డివిజన్‌కు ఒక వార్డు అధికారి, జవాను ఉన్నప్పటికీ వీధులు చెత్తా చెదారంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా ప్రధాన రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. బైపాస్ రహదారులు చిన్నపాటి డంపింగ్‌యార్డులుగా మారుతున్నాయి. నగరం మరింత శుభ్రంగా ఉండాల్సి ఉండగా ఇంకా దిగజారడం విమర్శలకు తావిస్తోంది.

**ఎవరు బాధ్యులు?**

నగరంలోని సిరిసిల్ల, రామగుండం, చింతకుంట బైపాస్ రహదారులకు ఇరువైపులా దుర్గంధంగా మారుతోంది. ఎక్కడ చూసినా చెత్తా చెదారంతో అసహ్యంగా మారుతోంది.

బొమ్మకల్ ఫ్లైఓవర్ కింద నుంచి వచ్చే దారితోపాటు సిరిసిల్ల బైపాస్ రోడ్డులో కొబ్బరిబోండాలు, చెత్తా చెదారం కుప్పలు, భవన వ్యర్థాలతో దుర్వాసనగా మారుతోంది.

గతంలో ఈ వైపు నిరంతరం తనిఖీలు చేపడుతూ చెత్త పోసే వారిని గుర్తించి రూ.వేలల్లో జరిమానా విధించారు. ప్రస్తుతం ఆ విధానం అమలు చేయకపోవడంతో చెత్తను ఇష్టానుసారంగా డంపింగ్ చేస్తున్నారు.

కొన్ని స్వఛ్ ఆటోలు బైపాసుల వెంట వదిలేసి పోతున్నట్లు ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు.

వీధుల్లో పెరుగుతున్న కుప్పలు

నగరవ్యాప్తంగా చెత్త సేకరణ కోసం స్వఛ్ ఆటోలు, ట్రాక్టర్లు తిరుగుతున్నప్పటికీ వీధుల్లో మాత్రం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గణేశ్‌నగర్ బైపాసు రోడ్డు, హౌసింగ్‌బోర్డుకాలనీ తీగల వంతెన, సప్తగిరికాలనీ హైస్కూల్ వెనకాలతోపాటు అంతర్గత కాలనీల్లో చెత్తా చెదారం పేరుకుపోతుంది.

విద్యుత్తుశాఖ అధికారులు చెట్లను కొట్టి అక్కడే పడేయడం మరో కారణం.

వారానికి ఒకసారి శుభ్రం చేసేలా చర్యలు

– ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

బైపాస్ రహదారులను వారానికి ఒకసారి శుభ్రం చేసేలా ప్రణాళికలు రచిస్తాం. అద్దె ఇళ్లలో ఉన్న ప్రజలు, సమీప దాబాలు, హోటళ్ల నుంచి చెత్త డంపింగ్ చేస్తున్నారు. చెత్త వేసే వారి పట్ల నిఘా ఉంచి జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటాం.

# సంక్షేమ మంత్రం.. వైఫల్యాలే అస్త్రం



వికారాబాద్: మలి విడత పంచాయతీ ఎన్నికలకు ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈనెల 14న వికారాబాద్ డివిజన్‌లోని 7 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. 175 పంచాయతీలకుగాను 16 సర్పంచి, వార్డుసభ్యుల స్థానాలు పూర్తిస్థాయిలో ఏకగ్రీవమయ్యాయి. మరో 4 సర్పంచి స్థానాలు మాత్రమే ఏకగ్రీవం కాగా.. వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి విడత ఎన్నికల్లో కాంగ్రెస్– భారాస మధ్య తీవ్ర పోటీ జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థులు మెజార్టీ స్థానాల్లో విజయం సాధించారు. తొలి విడతలో గెలుపోటములను ప్రభావితం చేసిన అంశాలను దృష్టిలో ఉంచుకొని రెండు పార్టీలు మలి విడతలో కొత్త వ్యూహాలు రచిస్తున్నాయి. పలు స్థానాల్లో భాజపా అభ్యర్థులు బరిలో ఉండటంతో ఇతరుల గెలుపోటములు ప్రభావితం కానున్నాయి. సంక్షేమ పథకాలతోపాటు స్థానిక సమస్యలను కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ప్రస్తావిస్తుండగా.. వైఫల్యాలే అస్త్రాలుగా భారాస ముందుకెళుతోంది. భాజపా అభ్యర్థులు కేంద్ర పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

**931 మంది పోలీసులతో భారీ బందోబస్తు..**

మలి విడత ఎన్నికలకు మండలానికో డీఎస్పీ పర్యవేక్షణలో 931 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. 57 రూట్లు, 188 లొకేషన్స్ గుర్తించారు. 44 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. 20 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు జరగనున్న గ్రామాల్లో రౌడీ షీటర్లు, అనుమానితులు, పాత నేరస్థులను బైండోవర్ చేశారు.

**గ్రామాల్లో గప్‌చుప్..**

పల్లెల్లో ప్రచారం ముగిసిపోవడంతో గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. పార్టీల రహితంగా ఎన్నికలు నిర్వహిస్తున్నా.. రాజకీయ రంగు పులుముకుంది. అధికార కాంగ్రెస్, విపక్ష భారాస నేతలు బలపర్చిన అభ్యర్థులు ప్రచారం సాగించారు. ఆ పార్టీల అండదండలు లభించని వారు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

**ఏరులై పారుతున్న మద్యం..** గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. సర్పంచి పదవిని కీలకంగా భావిస్తున్న అభ్యర్థులు మద్యం, డబ్బుల పంపిణీతో ఓటర్లను తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార యంత్రాంగం పెద్దగా దృష్టి సారించకపోవడంతో పల్లెలు మద్యం మత్తులో మునిగి తేలుతున్నాయి.

**వలస ఓట్లపై దృష్టి..**

అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టి సారించారు. చాలా గ్రామాల్లో బతుకుదెరువుకు వివిధ ప్రాంతాలకు వెళ్లారు. ప్రస్తుతం పోటీ తీవ్రంగా ఉండటంతో దూరంగా ఉంటున్న వారిపై దృష్టి సారించారు. ఎలాగైనా రప్పించి అనుకూలంగా ఓట్లు వేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# హంస సుందరం..ఆధ్యాత్మిక వాతావరణం



భద్రాచలం : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ముక్కోటి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో 30న ఉత్తర ద్వార దర్శనం పూజలు ముఖ్యమైనవి. ఇందులో ప్రత్యక్షంగా పాల్గొనేందుకు సెక్టార్ టికెట్లు విక్రయిస్తున్నారు. దీనికి ముందురోజు (ఈనెల 29న) గోదావరిలో తెప్పోత్సవం ఉంటుంది. ఇది భక్తులకు సంతోషాలను చాటే క్రతువు. అటు ఆధ్యాత్మిక వైభవం.. ఇటు హంస వాహన సౌందర్యం ఓలలాడించనుంది. రెండు రోజులుగా గోదావరి ఘాట్‌లో హంసాలంకార పనులు చేస్తున్నారు. కొద్దిరోజుల ముందుగా తెప్పోత్సవం ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై అధికారులు సోమ వారం సమీక్షించనున్నారు.

**రామయ్యకు గోదావరితో అనుబంధం**

వనవాస కాలంలో ఎక్కువ సమయం భద్రాచలం సమీపంలోని పర?శాల గోదావరి తీరంలో రాములవారు నివసించారు. పర?శాలలో ఉన్నప్పుడు నిత్యం గోదావరిలో స్నానమాచరించారు. వారి స్పర్శతో గోదావరి నది పావనమైందని భక్తుల విశ్వాసం. ఇదే గోదావరి తీరంలోని భద్రాచలంలో రాముడు కొలువై దర్శనమిస్తున్నాడు. ఇలాంటి పుణ్యనదిలో నిర్వహించే తెప్పోత్సవం విశేషమైనది. విజ్ఞానానికి ప్రతీక హంస. హంసకు ఉన్న మరో ప్రత్యేకత ఏంటంటే పాలు, నీళ్లను వేరుచేసి పాలను మాత్రమే స్వీకరిస్తుంది. లోకంలో మంచీచెడులు ఉన్నప్పటికీ మంచిని మాత్రమే స్వీకరించాలనే తత్వాన్ని బోధిస్తుంది. దివ్యమైన గోదావరిలో రాముడికి చేసే తెప్పోత్సతం అంటే భక్తులను పరమానందమే.

# కామర్స్‌కే మొగ్గు..

కరీంనగర్ : ఇంటర్ పూర్తయిన తరువాత చాలా మంది విద్యార్థులు డిగ్రీలో ఉపాధి లభించే కోర్సులను ఎంపిక చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. విపణిలో త్వరగా ఉపాధి లభిస్తుందని కామర్స్ కోర్సు తీసుకుంటున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గల డిగ్రీ కళాశాలల్లో గత మూడేళ్లలో బీకాం కోర్సులో చేరిన విద్యార్థుల సంఖ్యే అధికంగా ఉంది. దీన్ని బట్టి ఈ కోర్సు ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

**ఏ గ్రూపు వారైనా చేరవచ్చు**

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్, ఫైనాన్స్, బిజినెస్ అకౌంటెన్సీ, రిటెయిల్ ఆపరేషన్స్ కోర్సులున్నాయి. ఇవి పూర్తి చేసినవారికి విపణిలో.. ముఖ్యంగా వ్యాపార రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. విద్యుత్తు శాఖలో జేఏఓగా ఈ కోర్సు చదివిన విద్యార్థులే 60 శాతం మంది ఉద్యోగాలు సాధిస్తున్నారు. అలాగే కార్పొరేట్ సంస్థల్లో, టాక్స్ కన్సల్టెంట్ వద్ద అకౌంటెంట్‌గా



చేరిపోవచ్చు. ఎంకాం పూర్తి చేసిన విద్యార్థులు బోధన రంగం వైపు వెళ్లవచ్చు. ఎంబీఏ చేస్తే మరింత మెరుగైన ఉద్యోగావకాశాలను పొందడానికి అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపుల్లో ఏది పూర్తి చేసిన వారైనా డిగ్రీలో బీకాంలో చేరడానికి అవకాశం ఉంటుంది. ఈ కారణాలతోనే మెజార్టీ విద్యార్థులు ఈ కోర్సులో చేరుతున్నారు.

**అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తా..**

మాది మల్కాపూర్. అమ్మ వ్యవసాయ పనులు చేస్తుంటుంది. నాన్న గతంలోనే మరణించారు. బీకాం పూర్తి కాగానే ఏదైనా సంస్థలో అకౌంటెంట్‌గా చేరి అమ్మకు సాయపడవచ్చని ఈ కోర్సులో చేరా. చాలా మంది నా తోటి విద్యార్థులు కూడా ఇలాగే కోర్సులో చేరినట్టు చెబుతుంటారు. ప్రస్తుతం కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మరో రెండేళ్లు కష్టపడి ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా నిలబడతా.

చాట్ల సమత, బీకాం, ఎస్సారార్ డిగ్రీ కళాశాల

**దోస్త్ ప్రవేశాల్లో ప్రథమ స్థానం**

బీకాం కోర్సు వైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. దోస్త్ ప్రవేశాలను పరిశీలిస్తే ప్రథమ స్థానం బీకాం కోర్సుకే దక్కుతుంది. ప్రస్తుతం ప్రతి కార్పొరేట్ సంస్థలో తప్పనిసరిగా అకౌంటెంట్ అవసరం ఉంటుంది. దీంతో బీకాం చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోర్సు పూర్తవగానే చాలా మంది ఉద్యోగాల్లో చేరిపోతుంటారు. టి.రాజయ్య, బీకాం, హెచ్‌ఓడీ, ఎస్సారార్ కళాశాల

# 'భౌ'బోయ్.. బతకలేం..!

సూర్యాపేట: క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు తదితర జనసందడి, బహిరంగ ప్రదేశాల్లో వీధి శునకాలు సంచరించకుండా చేయండి. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలి. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి. వీధి కుక్కలను తక్షణమే షెల్టర్లకు తరలించాలి..' – సుప్రీంకోర్టు ఆదేశం సూర్యాపేట 43వ వార్డు నెహ్రూనగర్‌లో ఆదివారం పిచ్చికుక్క ఐదుగురిని తీవ్రంగా గాయపరిచింది. వీటితోపాటు బాతులు, మేకలపై దాడిచేసింది. యువకుడి చేతికి, వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు చికిత్స పొందారు. వీరి పరిస్థితిని చూసైనా అధికారులకు కనువిప్పు కలగాలి.

పిచ్చికుక్కలు కరిస్తేనే తెలుస్తుంది బాధ. వాటి దాడితో మరణించిన కుటుంబాల దయనీయ పరిస్థితి ఎవరికీ తెలియదు. కానీ అధికారులు వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా వీధి కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. నేటికీ పురపాలికల్లో చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. కనీసం ఆదేశాల మేరకు నడచుకోవాలనే ఆలోచన కూడా రావడం లేదు. దీంతో వీధుల్లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బయటకు వెళ్లాలంటేనే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు ఇంటికి చేరుకొనే వరకు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన ఉంటుంది.

**టీకాలు శూన్యం**

వీధి శునకాలకు ఎక్కడా టీకాలు వేయడం లేదు. జూనోసిస్ డే సందర్భంగా ఒక్కరోజు మాత్రమే పదుల సంఖ్యలో వేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం అన్నింటికీ టీకాలు వేసినట్లు చెబుతున్నారు. ఒక్కో వార్డులో వందల సంఖ్యలో



సంచరిస్తున్నాయి. కొన్ని పిచ్చి సోకినవీ ఉన్నాయి. వీటిని గుర్తించి చికిత్స చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

కుక్కల నియంత్రణకు త్వరలో చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**సంరక్షణ కేంద్రాలేవి?** ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉన్నాయి. ఒక్క సూర్యాపేట పురపాలికలో మాత్రమే కుక్కల సంరక్షణ కేంద్ర నిర్మాణం చేపట్టారు. ఇక్కడ వార్డుల్లో సంచరిస్తున్న వాటిని పట్టుకొని కు.ని. శస్త్రచికిత్సలు అడపాదడపా చేస్తున్నారు. మిగతా పురపాలికల్లో రెండేళ్ల క్రితం కోర్టు ఆదేశాల మేరకు నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా నేటికీ ఎలాంటి అతీగతి లేదు. నియంత్రణ కేంద్రాలున్న ప్రాంతాలకు తరలించాలంటే రవాణా భారంతో పాటు ఒక్కో చికిత్సకు రూ.1650 ఖర్చవుతుంది. దీన్ని మోయలేక పురపాలికలు చేతులెత్తేశాయి.

చురకలు



# రోడ్డే యమపాశం.. ఏన్నాళ్లీ శాపం!

ఎల్లారెడ్డిపేట : కామారెడ్డి- కరీంనగర్ రాష్ట్రీయ ప్రధాన రహదారి-11లో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. బోయినపల్లి మండలం నర్సింగాపూర్ స్టేజీ నుంచి గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ వరకు దాదాపుగా 72 కిలోమీటర్ల మేర ఈ ఆర్అండ్‌బీ నాలుగు వరుసల రహదారి విస్తరించి ఉంది. ఎక్కడో ఓ చోట మరణాలు, క్షతగాత్రులుగా మారడం పరిపాటిగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బోయినపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి- కొదురుపాక చౌరస్తా, వారధి ప్రాంతాలు ప్రమాదానికి నెలవుగా మారాయి. బ్రిడ్జిపై అతివేగంతో వాహనాలు వెళ్తుండటం.. వీధి దీపాలు లేక రాత్రిపూట ఇబ్బందిగా మారుతోంది. మరోవైపు అనుపురం-ఆరేపల్లి మధ్యలో 8 కిలోమీటర్ల మేర రోడ్డు రెండు వరుసలకే పరిమితమైంది. విస్తరణకు ప్రతిపాదనలు పంపించినప్పటికీ నిధులు మంజూరు కావడం లేదు.

.ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వద్ద రగుడు బైపాస్‌కు మళ్లే చోట వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. రగుడు బైపాస్ నుంచి వస్తూ కామారెడ్డి- కరీంనగర్ ప్రధాన రహదారికి మళ్లే సమయంలో ఓ కారు అదుపుతప్పింది. ఎదురుగా ఉండే ఇంట్లోకి దూసుకెళ్లగా



గోడ, తలుపులు కూలిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం వల్ల ప్రాణాపాయం తప్పినట్లయింది.

3. ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్ల గొల్లపల్లి బస్టాండు వరకు ఉన్న నాలుగు వరుసల రోడ్డు, యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 4.4 కిలోమీటర్లు, 22 యూటర్న్(మలుపు)లు ఉండే ఈ రోడ్డులో 2020 నుంచి ఇప్పటి వరకు 14 మంది మృత్యుఒడికి చేరగా 28 మంది గాయపడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

4. గంభీరావుపేట మండలం గోరింటాల నుంచి పెద్దమ్మ స్టేజీ వరకు ఘాట్‌రోడ్డును తలపిస్తోంది. అందులోనూ మూడునాలుగు మలుపులున్నాయి. వాహనాల వేగం నియంత్రణ కావడం లేదు. కార్లు, లారీలు, ఆర్టీసీ బస్సులు ఢీకొనడం వల్ల పలువురు ద్విచక్రవాహనదారులు మృతిచెందడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు..

మొత్తం రోడ్డు ప్రమాదాలు : 256

క్షతగాత్రులు : 291

మరణాలు : 67

## ఆశ పుట్టించి.. అక్రమాలు సృష్టించి

హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సంతాన సాఫల్య కేంద్రాల గుట్టురట్టు అవుతోంది. సృష్టి కేంద్రం దందా బయట పడిన తర్వాత వీటిపై వైద్య ఆరోగ్యశాఖ నిఘా పెట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 50 కేంద్రాలకు నోటీసులు ఇవ్వగా...వాటిలో అధిక శాతం గ్రేటర్‌లోనివే కావడం గమనార్హం. సంతానం కోసం వచ్చే దంపతుల బలహీనతను ఆసరా చేసుకొని ధనార్జనే ధ్యేయంగా కేంద్రాలు నడుపుతున్నారు. ఇప్పటి వరకు 12 కేంద్రాలను మూసేయగా...వాటిలో సగానికిపైగా ఇక్కడే ఉన్నాయి.

**ప్రధానంగా గుర్తించిన లోపాలు...**

ఒక డాక్టర్ పేరుతో అనుమతి పొంది.. ఇతరులు కేంద్రాలను నడుపుతున్నారు వైద్య సేవల ధరల పట్టిక...వైద్యుల జాబితాను



ప్రదర్శించడం లేదుకేంద్రాలకు అనుమతి గడువు తీరినా ...పునరుద్ధరించుకోక పోవడం

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం

ఒక కేంద్రానికి అనుమతి తీసుకొని అదే పేరుతో ఇతర ప్రాంతాల్లో నడపడం. అమలుకు నోచని మార్గదర్శకాలు

ఈ కేంద్రాల్లో తరచూ అక్రమాలు బయట పడుతున్నా నామమాత్రంగా చర్యలు మినహా.. నిరంతర నిఘా ఉండటం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అనుమతులు, నిర్వహణకు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నా అమలు కావడం లేదు. నెలవారీ మామూళ్లు తీసుకుని.. కొందరు అధికారులు చూసీచూడనట్లు ఉండటం, మరోవైపు రాజకీయ పైరవీలూ ఇందుకు కారణంగా తెలుస్తోంది.

## రూ.4,700 కోట్లతో మురుగునీటి వ్యవస్థ

హైదరాబాద్: రాజధానిని మురుగు రహిత నగరంగా మార్చడంతో పాటు మూసీలో డ్రైనేజీ కలవకుండా జలమండలి భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతోంది. ఒక చుక్క మురుగు కూడా నదిలో కలవకుండా రూ.4700 కోట్లతో ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించింది. దీంతోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి వ్యవస్థను అనుసంధానం చేయనున్నారు. జలమండలిలో విలీనమైన కొత్త ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ కేవలం 20 శాతం మాత్రమే ఉంది. ఉన్నవాటిలోనూ అత్యధికం ఓపెన్ నాలాలు కాగా మురుగు సమీపంలోని చెరువుల్లోకి చేరేలా ఉంది. ఈ నేపథ్యంలో సీవరేజీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. నార్సింగి, బాపూఘాట్, హైదర్‌షాకోట్, అత్తాపూర్, అంబర్‌పేట, నాగోల్, నల్లచెరువు, పీర్జాదిగూడ, కొర్రెముల, గౌరెల్లి వరకు మూసీకి ఉత్తర, దక్షిణం వైపు సీవరేజీ నెట్‌వర్క్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే నగరంలో మురుగు శుద్ధికి ఎస్టీపీల నిర్మాణం చేపడుతోంది. ఈ ప్రాజెక్ట్ కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రుణం కోసం జలమండలి ప్రయత్నిస్తోంది. పూర్తి వ్యయంలో 70 శాతం అంటే రూ.3,290 కోట్లను రుణం తీసుకోవడానికి ప్రతిపాదించగా మిగిలిన 30 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వ వాటాగా జలమండలి పేర్కొంది.

అభివృద్ధి చేసే మురుగునీటి వ్యవస్థ: 1,837 కి.మీ.

ప్రాజెక్ట్ వ్యయం అంచనా: రూ.4,700 (రూ.కోట్లలో)

ఏడీబీ రుణం (70 శాతం) : రూ.3,290

రాష్ట్ర ప్రభుత్వ వాటా (30శాతం): రూ.1,410

# సర్వీసు రోడ్లే శరణ్యం



గోదావరిఖని : ఉమ్మడి జిల్లాలో గుండ్లపల్లి నుంచి గోదావరిఖని కోల్‌బెల్టు వంతెన వరకు ప్రధాన పట్టణాల మీదుగా రాజీవ్ రహదారి విస్తరించింది. రెండు నగరపాలక, మూడు పురపాలక సంస్థల పరిధిలో ఈ రహదారి ఉంది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్, అల్గునూరు ప్రాంతాల్లో సర్వీసు రహదారులు తప్పనిసరి. అల్గునూరు, రామగుండం పట్టణాల్లో కొంత వరకు మాత్రమే సర్వీసు రోడ్లు నిర్మించారు. 11 ఏళ్లుగా వాహనాలకు టోలు వసూలు చేస్తున్నా సర్వీసు రోడ్లు నిర్మించడం లేదు. రాజీవ్ రహదారి విస్తరించి ఉన్న పట్టణ ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకొంటున్నాయి.

**బైపాస్ పేరుతో పక్కన**

పెద్దపల్లి పట్టణంలో బైపాస్ రహదారి కోసం ప్రణాళికలు చేశారు. పెద్దకల్వల నుంచి బందంపల్లి వరకు పట్టణ శివారు నుంచి బైపాస్ రహదారి నిర్మించాలని మార్కింగ్ కూడా చేశారు. ఇప్పటి వరకు దానిపై ఎలాంటి కదలిక లేదు. ఇటు బైపాస్ లేక.. అటు సర్వీసు రోడ్డు లేక పెద్దపల్లి పట్టణ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో కూడా బైపాస్ రహదారికి ఆలోచన చేసినా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు.

జిల్లా కేంద్రమైన పెద్దపల్లితో పాటు సుల్తానాబాద్ పట్టణాల్లో ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రాజీవ్ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. రామగుండం ప్రాంతంలో కొన్ని చోట్ల నిర్మించి మరి కొన్ని ప్రాంతాల్లో వదిలేశారు. ఇటీవల రూ.10 కోట్లు వెచ్చించి సర్వీసు రోడ్ల పూర్తికి చర్యలు చేపట్టారు. రామగుండంలో 10 కిలోమీటర్ల మేర పనులు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు కేటాయించారు.

పెద్దపల్లి పట్టణంలో సుమారు 4 కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారి విస్తరించి ఉంది. పట్టణంలో ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించలేదు. స్థానికులు ప్రతి పనికీ రాజీవ్ రహదారిపైకి రావాల్సి వస్తోంది. భారీ వాహనాలు, పట్టణంలోని వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సుల్తానాబాద్ పట్టణంలో రెండు కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారి విస్తరించి ఉంది. పట్టణానికి ఆనుకొని ఉండటంతో రహదారిపై వెళ్లే వాహనాలకు తోడు పట్టణంలోని ప్రజలు ఇదే మార్గం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. ఈ ప్రాంతంలో వాహనదారులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి.

# రూపాయి రాకెంత.. పోకెంత?

తాండూరు: జిల్లాలోని గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులు, ఆదాయం, వివిధ పనులకు చేసిన వ్యయాలపై ఉన్నతాధికారులు లెక్కలు తీసే పనిలో నిమగ్నమయ్యారు. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలను పంపించాలని ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖను ఆదేశించింది. అన్ని పంచాయతీల కార్యదర్శులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. 2019 ఏప్రిల్ నుంచి 2025 మార్చి చివరకు సంబంధించిన ఆదాయ, వ్యయాలు, మంజూరైన నిధుల దస్త్రాలు పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులే ఎక్కువ**

ఆర్థిక సంవత్సరాల వారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు 2011 జనాభా ప్రాతిపదికన ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం నుంచి, రెండు నెలలకోసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. ఈలెక్కన ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.లక్షల్లో మంజూరైతే తక్కువ జనాభా ఉన్న వాటికి రూ.వేలల్లోనే విడదలయ్యాయి. పంచాయతీలకు 2024 మార్చి నుంచి పాలక వర్గాలు లేవు. ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. దీంతో నిధుల మంజూరులో స్తబ్దత నెలకొంది. అందుబాటులో ఉన్న సాధారణ నిధులతోనే కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చారు. అయితే చేసిన పనులకు వెచ్చించిన నిధులెన్ని అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

**అంశాల వారీగా..**

గ్రామ పంచాయతీల్లో అమలయ్యే పదిహేను అంశాల వారీగా చేసిన ఖర్చు పద్దులకు సంబంధించి లెక్కలు అడుగుతున్నారు.

సంతలు (త్రైబజార్‌లు), మార్కెట్లు, కార్యాలయం నిర్వహణ, మౌలిక వసతులు, వీధి దీపాలు, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది వేతనాలు, సాంకేతిక నైపుణ్యం, దళిత, గిరిజన సంక్షేమం, చిన్నారులు, మహిళల భద్రత, కుటుంబ ఆరోగ్య సంరక్షణ, తాగునీటి వనరుల నిర్వహణ, పారిశుద్ధ్యం అంశాలున్నాయి.

గ్రామ పంచాయతీల్లో సంతల నిర్వహణకు ఏడాది కోసారి త్రైబజార్ వేలం వేస్తారు. నీటి శుద్ధి ప్లాంట్లు ఉంటే వాటి నిర్వహణకు వేలం వేస్తారు. వచ్చిన ఆదాయాన్ని దేని కోసం వ్యయం చేశారు? ఎంత



చేశారు? వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది.

మంజూరైన నిధులను ఏ పనికి ఎంత వ్యయం చేశారు. మిగిలిన డబ్బులు ఎన్ని? చేసిన పనికి డబ్బులు సరిపోక పోతే వేరొక పద్దు నుంచి ఎంత మేరకు తీసుకుని ఖర్చు చేశారు. అనే వివరాలను వెల్లడించాల్సి ఉంది.

ఇవీ వివరాలు


మండలాలు: 20

గ్రామ పంచాయతీలు: 594

వార్డులు: 5,058**వివరాలు పంపించాలని ఆదేశించాం**

జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యదర్శులను 2019 నుంచి 2025 వరకు నిధుల మంజూరు వ్యయాలకు సంబంధించిన వివరాలను పంపించాలని కార్యదర్శులను ఆదేశించాం. ఉన్నతాధికారులు ఆదేశించిన మేరకు పద్దుల వారీగా లెక్కలు అడుగుతున్నాం.జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

# 'ఆక్ర'ముంచేస్తున్నారు!



సిరిసిల్ల : తాగు, సాగునీటి సరఫరాలో మధ్యమానేరు ప్రధాన జలాశయం. వినియోగంలోకి వచ్చి ఏనిమిదేళ్లే అవుతున్నా.. అప్పుడే చుట్టూ ఆక్రమణల పర్వం మొదలైంది. ఇప్పటికే చాలాచోట్ల బఫర్‌జోన్ దాటి ఎఫ్‌టీఎల్‌లోకి వచ్చారు. ఈ నెల 13న జలాశయం పూర్తి సామర్థ్యం 27.55 టీఎంసీలకు చేరడంతో ఎఫ్‌టీఎల్‌లోని పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. 2017 నుంచి నీటిని నిల్వచేయడం ప్రారంభమైంది. 2022లో ఒకసారి, ఈ ఏడాది మరోసారి రెండుసార్లు మాత్రమే ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నింపారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల హద్దులు ఏర్పాటు చేయక ఆక్రమణలు పెరిగిపోయినా నీటిపారుదల, రెవెన్యూ అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలను జలాశయం ఈఈ జగన్ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లింది. "ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో పంటలు సాగు చేయవద్దు. త్వరలోనే రెవెన్యూ అధికారులతో కలిసి హద్దులు నిర్ణయిస్తాం. గ్రామాల్లో జలాశయం ఎంతవరకు ఉందనే సూచికలు కూడా ఏర్పాటు చేస్తా"మని వెల్లడించారు.

రాజన్నపేట శివారులో గ్రానైట్ క్వారీలోకి నీరు రాకుండా జలాశయం లోనే మట్టితో అడ్డుకట్ట వేశారు. దీనికి రాళ్లతో తెట్టును నిర్మించారు. దీని ప్రభావంతో సమీపంలోని వరదవెల్లి, రత్నంపేట, రెడ్డిపురం గ్రామాలకు చెందిన వ్యవసాయ భూములు ముంపునకు గురవుతాయని అటువైపు వారు అడ్డుకట్టలు కట్టారు.

**ఇదీ సంగతి**

జలాశయం నిర్మాణానికి 12 గ్రామాల పరిధిలో ప్రైవేటు, ప్రభుత్వ, అసైన్డ్ భూములను సేకరించారు. పనులు పూర్తయ్యాక ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల హద్దులు నిర్ణయించాలి. నిబంధనల ప్రకారం జలాశయం ఎఫ్‌టీఎల్‌పై వంద మీటర్ల మేరకు బఫర్‌జోన్ ఉంటుంది. పొలాలు, క్వారీలేవీ ఉన్నా పరిధి దాటి లోపలికి రాకూడదు. చదును చేయడం, వ్యర్థాలతో నింపడం వట్టివి చేస్తే ఆక్రమణల కింద చర్యలు తీసుకునే అవకాశాలుంటాయి.

ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలో జలాశయం కుడివైపు 2021లో అదనపు అదనపు టీఎంసీ పనులు ప్రారంభమయ్యాయి. కాల్వతవ్వకాలకే భూసేకరణ జరిగింది. తవ్విన మట్టిని పక్కన పోసేందుకు పక్కనున్న రైతులు భూములు ఇవ్వలేదు. దీంతో లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని జలాశయంలో నింపి చదును చేశారు. ఇక్కడే క్యాంపు కార్యాలయం నిర్మించారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. ఇదే అదనుగా చుట్టూ తరచూ ఆక్రమణలు జరుగుతున్నాయి. జలాశయం వెనుకజలాల ప్రాంతాలైన తంగళ్లపల్లి, వేములవాడ గ్రామీణం, బోయినపల్లి మండలాల్లో చీర్లవంచ, చింత్‌తాణా, అనుపురం, సంకెపల్లిలో ఎఫ్‌టీఎల్‌లో చదునుచేసి పంటలు సాగు చేస్తున్నారు.

# మెరుగైన వైద్యం.. బీమా పథకం

గోదావరిఖని : ఒప్పంద కార్మికులకు మెరుగైన వైద్య సేవలతో పాటు బీమా సౌకర్యం ఉన్న ఈఎస్ఐ సేవలను అమలు చేసేందుకు చర్యలు తీసుకొంటున్నారు. ఈ విషయమై సింగరేణి అధికారులతో పాటు గుత్తేదారులకు అవగాహన కల్పిస్తున్నారు. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ-1, 2, 3 డివిజన్లలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను సభ్యులుగా చేర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**16 వేల మంది కార్మికులు**

రామగుండం రీజియన్‌లో 16 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మైనింగేతర విభాగాల్లో పనిచేసే ఒప్పంద కార్మికులకు ఇది వర్తించనుంది. సివిల్, అటవీ, భద్రత, అన్వేషణ, పారిశుద్ధ్య విభాగాల్లో పనిచేసే ఒప్పంద కార్మికులకు ఈఎస్ఐ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఏదైనా ప్రమాదానికి గురైన సమయంలో బీమా సౌకర్యంతో పాటు వైద్య సేవలు అందనున్నాయి.



కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు వర్తింపజేస్తారు. రూ.21 వేల లోపు వేతనాలు పొందే ప్రతి కార్మికునికి ఈఎస్ఐని వర్తింపజేసేందుకు చర్యలు తీసుకొంటున్నారు. పదిమంది కంటే ఎక్కువ మంది పనిచేసే గుత్తేదారు నుంచి ఈఎస్ఐ సభ్యులను చేర్చుకొంటారు. అంత కంటే తక్కువ మంది పనిచేస్తే వర్తింపజేయరు.

**నమోదు ప్రక్రియపై దృష్టి**

కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సేవలు వర్తింపజేసేందుకు వివరాలు నమోదు చేసే ప్రక్రియపై దృష్టి సారించారు. ప్రస్తుతం గుత్తేదారుకు సంబంధించిన 3.75 శాతాన్ని యాజమాన్యం భరించేందుకు ముందుకు వచ్చింది. దీంతో ఒప్పంద కార్మికుల వివరాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా నమోదు చేసే అవకాశం ఏర్పడింది. కార్మికునికి ఐడీతో పాటు ఆధార్ నంబరు, సీఎస్సీ చెల్లింపులు, రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు, సెల్‌ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ, వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు నమోదు చేయాల్సి ఉంది. వేతన వివరాలు కూడా అందులో నమోదు చేయాలి. వీటిని పూర్తి చేసేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది.

# 'ఓసి'నీ.. ఇదా కనెక్షన్!

హైదరాబాద్: భవన నిర్మాణదారులు విద్యుత్తు కనెక్షన్లు పొందేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. యాభై, వంద గజాల్లో ఇళ్లు కట్టుకునే సామాన్యులు కాదు.. ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్న బడా సంస్థలే ఈ అక్రమాలకు పాల్పడుతున్నాయి. నకిలీ ఆక్యుపెన్సీ పత్రాలు (ఓసీ) సమర్పించి, ఇంజినీర్లతో కుమ్మక్కై అక్రమంగా కనెక్షన్లు పొందుతున్నాయి. విజిలెన్స్, విద్యుత్తు చౌర్య నిరోధక విభాగం (డీపీఈ) విచారణలో ఈ తరహా అక్రమాలు ఒక్కోటిగా వెలుగు చూస్తున్నాయి.

**10 మీటర్ల ఎత్తు దాటితే.. తప్పనిసరి**

విద్యుత్తు కనెక్షన్ పొందాలంటే జీహెచ్ఎంసీ/ హెచ్ఎండీఏ/ మున్సిపాలిటీల నుంచి అనుమతి తప్పనిసరి. నిర్మాణ సమయంలో కేటగిరి-8 కింద తాత్కాలిక కనెక్షన్ జారీ చేస్తారు. పూర్తయ్యాక గృహ, వాణిజ్య కనెక్షన్లు ఇస్తారు. 10 మీటర్ల ఎత్తు దాటిన భవనాలకు ఆయా సంస్థలు జారీ చేసే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరి. ఇది లేకుండా జారీ చేయవద్దని ఇటీవల హైకోర్టు సైతం డిస్కంను ఆదేశించింది. గతంలో ఓసీ లేకుండా జారీ చేసిన భవనాల కనెక్షన్లపై టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు డీపీఈ, విజిలెన్స్ విచారణ చేపట్టాయి.

**అక్రమంగా అంటగడుతున్నారు..**

నల్లగండ్ల సెక్షన్ శేరిలింగంపల్లిలో ఆర్‌డీబీ హైదరాబాద్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 19 అంతస్తుల ఆకాశహర్మ్యాన్ని నిర్మించింది. 625 ఫ్లాట్లు నిర్మించారు. తొలుత 285 విద్యుత్తు కనెక్షన్లు కావాలని 2022 ఫిబ్రవరిలో దరఖాస్తు చేసింది. ఈ కనెక్షన్లు అన్ని 2024 డిసెంబరులో జారీ చేసినట్లు డిస్కం రికార్డులు చెబుతున్నాయి. ఓసీ సమర్పించకపోయినా 285 సర్వీసులను గృహ విభాగం కింద విడుదల చేశారు. 220 ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే భవనంలోకి దిగిన వినియోగదారులు అందరికీ తాత్కాలిక కనెక్షన్ కేటగిరి-8 కిందకు మార్చేందుకు నోటీసులు జారీ చేశారు. కొందరు రియల్టర్లు విద్యుత్తు అధికారులు, సిబ్బందితో కుమ్మక్కై అక్రమ కనెక్షన్లు పొంది కొనుగోలుదారులకు ఇళ్లను అమ్మేస్తున్నారు. ఆ తర్వాత కొన్న వాళ్లు నానాపాట్లు పడుతున్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లిలో అంజద్‌బేగ్ నాలుగంతస్తులకు అనుమతి తీసుకొని జీ+5 భవనం కట్టారు. 22 కరెంటు కనెక్షన్లు తీసుకున్నారు. విజిలెన్స్ విచారణలో ఫోర్జరీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించినట్లు గుర్తించారు. బోయిన్‌పల్లి ఐసీఎస్సీ ఏడీఈ రోషన్, బోయిన్‌పల్లి ఏఈ అఖిల్‌పై చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది.

ఇబ్రహీంబాగ్ సబ్‌డివిజన్, నార్సింగి సెక్షన్ పరిధిలో 2024 అక్టోబరులో ధాన్వి ఇన్‌ఫ్రా ఎల్‌టీఎం నుంచి దరఖాస్తు వచ్చింది. 65 ఫ్లాట్లు ఉన్నాయి. త్రీఫేజ్ 65 కనెక్షన్ల కోసం, ఒక కామన్ మీటర్‌కు దరఖాస్తు చేశారు. 2025 జులైలో వీటి కనెక్షన్లు మంజూరు చేశారు. విచారణ చేపట్టగా ఓసీ లేకుండా కనెక్షన్లు మంజూరైనట్లు గుర్తించారు. మూణ్నెళ్ల తర్వాత ఓసీని ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. విచారించగా నకిలీదని తేలింది.

# చెత్త గుట్టలు.. నోట్ల కట్టలు

ఖమ్మం : ఖమ్మం నగరపాలక సిబ్బందికి ప్రజాధనం అంటే లెక్కే ఉండటం లేదు. తమ కళ్లముందే రోజుకు రూ.వేలు చెత్త పాలవుతున్నా చేష్టలుడిగి చూస్తున్నారంటే ఆశ్చర్యపోక తప్పదు. దీని వెనక మతలబు ఏంటా అన్న అనుమానం రాకా మానదు. డంపింగ్ యార్డులో ఇష్టారీతిగా చెత్త వేయటం ఓ లోపమైతే, వేస్తున్నా పట్టించుకోకపోవటం మరో సమస్య. ఈ రెండు తప్పిదాల ఫలితంగా నెల రోజుల వ్యవధిలో యాంత్రిక పని పేరుతో రూ.లక్షలు వృథా చేశారంటే నమ్మితీరాల్సిందే.. విషయం ఏంటంటే ఈ లోపాలన్నీ ఒకదాని వెంట మరోటి దడికట్టినట్టు, పద్ధతి ప్రకారం సాగుతున్నా ఉన్నతాధికారులకు అనుమానం రావటం లేదు.తప్పు మీద తప్పు..సిబ్బంది నిర్లక్ష్యంతో పోగైన చెత్తను తొలగించటానికి నెల రోజుల క్రితం మరో మహత్కార్యానికి బల్దియా అధికారులు శ్రీకారం చుట్టారు. గంటకు రూ.2వేలు ఇస్తూ చైన్ యంత్రం సాయంతో చెత్తను రోడ్డుకు ఇరువైపులా పోయిస్తున్నారు. యంత్రం చెత్తను తొలగించి దారి చూయించగానే వెనకనుంచి వచ్చే వాహనాలు మళ్లీ పోసి పోతున్నాయి. రెగ్యులర్, పొరుగు సేవల సిబ్బంది వచ్చే ప్రతి వాహనాన్ని లోపలిదాకా పంపించాల్సి ఉన్నా పట్టించుకోవటం లేదు.అనుమానాలకు తావిస్తూ.. గంటకు రూ.2 వేలు చెల్లించి తీసుకొచ్చిన యంత్రం రోజుకు ఐదు నుంచి ఆరు గంటలు పనిచేసి నిష్క్రమిస్తోంది. నెల రోజులుగా రోజుకు రూ.10-16 వేల వరకు నగరపాలక సంస్థ చెల్లిస్తోంది. ఆ వాహనం వాహనాలు లోపలకు వెళ్లే దారి ఏర్పాటు చేసుకోకుండా ఒకే ప్రాంతంలో చెత్తను సర్దుబాటు చేయడమూ అనుమానాలకు తావిస్తోంది. యార్డు చివరి ప్రాంతంలో ఖాళీ స్థలం ఉన్నా వాహనాలు దారి లేదన్న సాకుతో ప్రారంభంలోనే చెత్త పోయడం, దాన్ని డబ్బులతో తొలగించటం అన్నీ క్రమపద్ధతిలో సాగటంపైనా గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇదీ విషయంఖమ్మం నగరంలో నిత్యం 180 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. ఇందులో 160 టన్నుల మెట్రిక్ టన్నులు దానవాయిగూడెంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. చెత్త ట్రాక్టర్లు, వ్యాన్లు రోడ్డుకు అడ్డంగా చెత్త పోయొద్దు. అవి లోనికి ప్రవేశించగానే ముగ్గురు పర్యవేక్షక సిబ్బంది వాటి నంబర్లు రాసుకుని చెత్తను ఎక్కడ పోయాలో మార్గనిర్దేశం చేయాలి. కానీ అవేం పట్టించుకోకపోవటంతో వాహనాలు ఇష్టారీతిగా రోడ్డుకు అడ్డంగా పోసివెళ్తున్నాయి.

# ఆరోగ్య కేంద్రాలకు మోక్షం

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వం ప్రాధాన్యత భవనాల కింద సచివాలయాలు, ఆర్ఎస్కే, ఆరోగ్య కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించింది. కానీ, నిధుల లేమితో వీటిలో చాలావరకు పనులు మొదలు కాలేదు. మరికొన్ని భవనాల పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ప్రస్తుతం చాలావరకు ఆరోగ్య కేంద్రాలు గ్రామాల్లోని అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. ప్రజల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య కేంద్రాలను పూర్తి చేసేందుకు చొరవ తీసుకుంది. తాజాగా నిధులు మంజూరు చేయడంతో పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదుపరి కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**జిల్లాలో 172 ఆరోగ్య కేంద్రాలు**

నంద్యాల జిల్లాలో 172 ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. వీటిలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద 52 భవనాలు మంజూరు కాగా.. 13 భవనాలు పూర్తయ్యాయి. ఒక్కొక్క భవనానికి సుమారు రూ.10 లక్షలతో పనులు చేపట్టనున్నారు. పీఎం అభిమ్ కింద 51 భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవనాన్ని రూ.42 లక్షలతో నిర్మించనున్నారు. ఎన్హెచ్ఎం(నేషనల్ హెల్త్ మిషన్) 15వ ఆర్థిక సంఘంలో 69 భవనాలు మంజూరయ్యాయి. ఇందులో ఒకటి పూర్తయ్యింది. రూ.36 లక్షలతో ఒక్కో భవనాన్ని నిర్మించనున్నారు.



**అద్దె భవనాల్లో సమస్యలు**

ఆరోగ్య కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగడంతో గదులు, పరిశుభ్రత, మరుగుదొడ్లు, నీరు వంటి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. భవనాలు ఇరుకుగా రేకుల షెడ్లలో ఉండటం, చిన్న గదుల్లో స్థల సమస్యలతో అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. ః సరైన సమయంలో అద్దె చెల్లించకపోతే యజమానుల ఒత్తిడితో సిబ్బంది చేతి నుంచి అద్దె చెల్లిస్తున్నారు. దీంతో రోగులకు సరైన వైద్య సేవలు అందకుండా పోతున్నాయి

**మార్చి చివరి నాటికి పూర్తి** నంద్యాల జిల్లాలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేసేందుకు నేషనల్ హెల్త్ మిషన్(ఎన్హెచ్ఎం) 15వ ఆర్థిక సంఘం, పీఎం అభిమ్(ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్) నుంచి నిధులు కేటాయించారు. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన ఆరోగ్య కేంద్రాలకు మోక్షం లభించడంతో వచ్చే మార్చి చివరికి పూర్తి చేయనున్నట్లు నంద్యాల జిల్లా పంచాయతీ రాజ్ డీఈ నాగరాజు తెలిపారు.

# ఆ అయిదేళ్లూ.. తాగించారు కన్నీళ్లు

భీమవరం :వీరవాసరంలో రూ.40 లక్షలతో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం చేపట్టారు. 2019లో వైకాపా సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయి పిచ్చిమొక్కల మధ్య నిరుపయోగంగా ఉండిపోయింది. మత్స్యపురిలో రెండ ట్యాంకుల నిర్మాణం ఆగిపోయింది. అప్పటి తెదేపా ప్రభుత్వం 2018లో ఉమ్మడి జిల్లాలోని ఆవాస ప్రాంతాల ప్రజలకు పుష్కలంగా తాగునీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతో జలధార పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ.59.40 కోట్ల అంచనా వ్యయంతో అప్పట్లో ఓహెచ్ఎస్ఆర్లు, పైపులైన్ల విస్తరణ చేయాలని నిర?యించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వాటి అంచనా విలువ రూ.12.40 కోట్లు. పనులు వేగంగా సాగుతున్న సమయంలో 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధులు నిలిపివేసింది. 2019 తర్వాత జల్‌జీవన్ మిషన్ పథకంలో కొత్త పనులు ప్రారంభించడంతో జలధార మరుగున పడింది. పనులు చేపట్టిన గుత్తేదారులకు సుమారు రూ.2.38 కోట్ల బకాయిలను నేటికీ చెల్లించలేదు.

**ఇదీ పరిస్థితి..** జిల్లాలోని 15 ఆవాస ప్రాంతాల్లో చేపట్టిన జలధార పనులు ఇటీవల కొన్ని చోట్ల ప్రారంభమయ్యాయి. యలమంచిలి మండలం బాడవ, వీరవాసరం మండలం చింతలకోటిగరువు, రాయకుదురు, పెర్కిపాలెం, నరసాపురం మండలం వారతిప్ప, కటికలవారిమెరకలో ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. వీరవాసరం మండలం మత్స్యపురి, భీమవరం మండలం చినఅమిరంలో తిరిగి పనులు ప్రారంభించారు.

ఉండి పంచాయతీ పరిధిలోని ఉప్పుగుంటలో 20 వేల లీటర్ల సామర్థ్యంతో చేపట్టిన ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం ఐదేళ్లుగా నిలిచిపోయింది. ఇది పూర్తయితే 200 మందికి సమృద్ధిగా తాగునీరు ఇవ్వొచ్చు. తణుకు మండలం కోనాల, ముద్దాపురం, పోడూరు మండలం అంబటివారిచెరువు, ఉండి మండలం ఉప్పుగుంట, వీరవాసరం మండలం మత్స్యపురి, వీరవాసరం, తాడేపల్లిగూడెం మండలం దండగర్రలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. గుత్తేదారులకు బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

# ఓ రోజు పాఠం.. పరాయి పంచన

ఏలూరు : జిల్లాలోని కొన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత గూడు కరవు. పరాయి పంచన అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. ఇది ఫలితాలు.. ప్రవేశాలపై ప్రభావం చూపుతోంది. ఏలూరు, కైకలూరు, నారాయణపురం, చింతలపూడి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. సొంత స్థలం, భవనాలు ఉంటేనే న్యాక్ గుర్తింపు వస్తుంది. కేంద్రం రూసా నిధులు కేటాయిస్తుంది. ఏలూరు, బుట్టాయగూడెం, కామవరపుకోటకు న్యాక్ గుర్తింపు లేదు. ప్రస్తుతం కైకలూరు న్యాక్ ఏం, చింతలపూడి న్యాక్ బీం హోదాను కలిగి కేంద్రం, రాష్ట్రం నుంచి ప్రత్యేక నిధులు పొందుతున్నాయి. ఈ గుర్తింపు కారణంగా వీటిల్లో ప్రవేశాలు బాగా ఉన్నాయి.

పోరాటమే తప్ప.. ఏలూరులో 2008లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైంది. 17 ఏళ్లయినా శాశ్వత భవనాల్లేవు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. సొంత భవనాలు నిర్మించాలని విద్యార్థులు ఏళ్ల తరబడి పోరాటాలు సాగించగా జూనియర్ కళాశాల ఆవరణలోని 3.2 ఎకరాలు కేటాయించారు. అందులోని 1.09 ఎకరాల్లో శాశ్వత భవనాలను రూ.12.60 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదించినా వాటికి అతీగతీ లేదు. దీంతో 170 మంది అవస్థల మధ్య చదువుకుంటున్నారు.

మన్యంలో ఒక్కటే.. మన్యం, ముంపు మండలాల్లో ఏకైక బుట్టాయగూడెం కళాశాలకు ఏడేళ్ల క్రితమే శాశ్వత భవనాల కోసం చర్యలు ప్రారంభించారు. ఇప్పటికీ అసంపూర్తిగానే ఉంది. గిరిజన విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగం. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం భవనాలకు రూ.కోటి మంజూరు చేసింది.

# భూకొలతకు చిక్కుముళ్లు

కర్నూలు : భూముల సర్వే చేయడంలో సర్వేయర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. పైసలిస్తే ఒకలా.. లేకుంటే మరోలా వ్యవహరిస్తున్నారు. కొలతలు వేసి హద్దులు చూపినట్లు చెబుతున్న వాటిలో సగానికిపైగా కొలతలు వేయకనే ఎండార్సుమెంట్లు ఇచ్చేస్తున్నారు. భూముల సర్వేకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఇబ్బందిపెడుతున్నట్లు ఐవీఆర్ఎస్ సర్వేలో తేలింది. నలుగురు వీఆర్వోలు, ఐదుగురు సర్వేయర్లు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలడంతో ఉన్నతాధికారులు వారికి తాఖీదులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో 18 మంది విలేజ్ సర్వేయర్లపై కర్నూలు జిల్లాలో ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**తిరస్కరణకే ప్రాధాన్యం**

తమ భూములకు కొలతలు వేసి హద్దులు చూపాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలో గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 16,739 దరఖాస్తులు వచ్చాయి. సర్వే చేసి హద్దులు చూపించి.. ఎంజాయిమెంట్ సర్టిఫికెట్ ఇచ్చేందుకుగాను భూయజమాని ప్రభుత్వానికి రూ.550 చలానా కట్టాలి. ఆ దరఖాస్తు విలేజ్ సర్వేయర్ లాగిన్‌కు వెళ్తుంది. సర్వేయర్ అర్జీదారుడితో మాట్లాడి ఆ పొలం ఇరుగుపొరుగు రైతులకు నోటీసులు జారీ చేయాలి. ఏడు రోజుల్లోగా భూమి కొలతలు వేయాలి. అందరి ఆమోదంతో స్టేట్‌మెంట్ నమోదు చేయాలి. అనంతరం విలేజ్ సర్వేయర్ లాగిన్ నుంచి ఉప తహసీల్దారు లాగిన్‌కు పంపాలి. సర్వే ఆధారాలను డీటీకి చూపి ఆమోదం తెలపాలి. ఆ తర్వాత అర్జీదారుడికి ఎంజాయిమెంట్ సర్టిఫికెట్ ఇవ్వాలి. ఈ ప్రక్రియ 21 రోజుల్లో పూర్తవ్వాలి. అధికారులు కాలయాపన చేస్తే ఆ దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది.

**సబ్ డివిజన్‌లు చేయడంలోనూ..**

సర్వే సబ్ డివిజన్ చేసుకునేందుకు భూయజమాని దరఖాస్తు చేసుకుంటే.. విలేజ్ సర్వేయర్ నుంచి మండల సర్వేయర్ లాగిన్‌కు వెళ్తుంది. విలేజ్ సర్వేయర్ సర్వే చేసి తహసీల్దారుకు నివేదిక పంపాలి. మండల సర్వేయర్ పరిశీలించి సబ్ డివిజన్ చేసి తహసీల్దారు ఆమోదంతో అర్జీదారుడికి సర్వే సబ్ డివిజన్ నివేదిక అందజేయాల్సి ఉంది. సర్వే సబ్ డివిజన్ విషయంలోనూ వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. కర్నూలు జిల్లాలో సర్వే సబ్ డివిజన్ కోసం 18,706 దరఖాస్తులు రాగా అందులో 15,486 వరకు పరిష్కరించినట్లు చెబుతున్నారు. వివిధ కారణాలు చూపుతూ 2,944 దరఖాస్తులను తిరస్కరించారు. నంద్యాల జిల్లాలో 13,772 దరఖాస్తులు రాగా.. 11,355 వరకు పరిష్కరించగా.. 2,229 దరఖాస్తులను సర్వేయర్లు తిరస్కరించారు..

**దోచుకుంటున్నారు..**

భూములకు కొలతలు, సబ్ డివిజన్ల కోసం వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాల్సి ఉండగా.. రెండు, మూడు వారాలైనా వాటిని చూడటం లేదు. క్షేత్రస్థాయికి వెళ్లి కొలతలు వేయడం లేదు. భూముల విలువను బట్టి సర్వే చేసేందుకు కొందరు సర్వేయర్లు ధర నిర్ణయించారు. రూ.10 వేల నుంచి రూ.50 వేలు, రూ.లక్ష వరకు తీసుకుంటున్నారు. తామిచ్చిన నివేదిక ఆధారంగానే ఆన్‌లైన్ అడంగల్‌లో వివరాలు నమోదవుతాయంటూ బహిరంగంగానే వసూళ్లకు పాల్పడుతున్నారు. **నాలుగేళ్లుగా ప్రదక్షిణలు**ఓర్వకల్లు మండలం నన్నూరులో సర్వే నంబర్లు 1149, 1150లో మూడెకరాలు ఉంది.. సర్వే చేసి హద్దులు చూపాలని.. వెబ్‌ల్యాండ్‌లో తమ పేరున నమోదు చేయాలని కోరుతూ కె.రామమద్దమ్మ గత నాలుగేళ్లుగా రెవెన్యూ, సర్వే అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. భూములకు సర్వే చేయాలని కోరుతూ ఎఫ్.లైన్ దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు కొలతలు వేసి హద్దులు చూపలేదు.

# రొయ్య.. అనుమతులెక్కడయ్యా!



నరసాపురం : ఆక్వా సాగుకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఇలాంటి చెరువులకు మాత్రమే ప్రభుత్వం విద్యుత్తు రాయితీ, రొయ్యలకు బీమా సౌకర్యం వర్తిస్తుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణ భూముల్లో చెరువులకు ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా)లో, సముద్రతీర, ఉప్పుటేరు, గోదావరి సమీప ప్రాంత భూముల్లో సాగుకు కోస్టల్ ఆక్వాకల్చర్ రెగ్యులేటరీ అథారిటీ ద్వారా అనుమతి పొందాల్సి ఉంటుంది. జిల్లాలో 50 శాతం వరకు చెరువులకు ఎలాంటి అనుమతి లేదని అధికారులు చెబుతున్నారు. ఇదీ లెక్క.మత్స్యశాఖ అధికారుల వద్ద అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం.. జిల్లాలో 1,32,504 ఎకరాల్లో ఆక్వా (చేపలు, రొయ్యలు) సాగు జరుగుతోంది. ఇప్పటి వరకు 62,772 ఎకరాల్లో చెరువులకు సంబంధించిన రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మరో 55,880 చెరువుల వివరాలు నమోదు కావాల్సి ఉంది.

**విక్రయాలకు యాప్‌లో నమోదు**

ఆక్వా ఉత్పత్తుల విక్రయాలకు కూడా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను వినియోగంలోకి తీసుకువచ్చింది. దీనిలో నమోదైన చెరువులకు విశిష్ట సంఖ్య, క్యూఆర్ కోడ్ కేటాయిస్తారు. రొయ్యలను ఇతర దేశాలకు ఎగుమతి చేయాలంటే సాగు చేసిన చెరువుల వివరాలు కచ్చితంగా ఈ ఆక్వా యాప్‌లో నమోదై ఉండాలి. జిల్లాలో 42 వేలకు గాను 13,226 చెరువుల వివరాలు మాత్రమే దీనిలో నమోదయ్యాయి.

మార్గదర్శకాలు పాటించాల్సిందే..

అధికారికంగా నమోదైన చెరువుల్లో సాగు చేసిన రొయ్యలు మాత్రమే కొనుగోలు చేస్తామని గతంలో కేంద్రం ప్రకటించడంతో అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం మీ సేవ కేంద్రాల ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి తాత్కాలిక ప్రాతిపదికన అనుమతులు ఇచ్చింది. ఈ తరహా అనుమతులు పొందిన వారు కూడా అప్సడా యాక్టులో ఎండార్స్‌మెంటు చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు.ఆక్వా సాగు చెరువుల రిజిస్ట్రేషన్, యాప్‌లో నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అలా చేయకుంటే విద్యుత్తు రాయితీ వర్తించదు. ఆక్వా సాగులో ప్రతికూల పరిస్థితుల నుంచి గట్టెక్కాలంటే సాగుదారులంతా విధిగా ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి. – ఎల్ఎల్ఎన్ రాజు, మత్స్యశాఖ సహాయ సంచాలకుడు

# ఇసుక దందా.. ఆపేదుందా!



యర్రగొండపాలెం : వై.పాలెంలో ఇసుక మాఫియా దందాకు అడ్డులేకుండా పోయింది. ఎక్కడికక్కడ అనధికార స్టాక్ పాయింట్లు నిర్వహిస్తూ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. అన్ని అనుమతులతో బయట నుంచి ఇసుక తెచ్చుకున్నా వీరికి కప్పం కట్టాల్సిందే. లేదంటే ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇతర వ్యక్తుల పెత్తనం...**వై.పాలెం నియోజకవర్గ స్థాయిలో ఇసుక విక్రయాలకు ఓ నాయకుడు అనుమతులు తెచ్చుకున్నారు. పేరు ఆయనదే అయినా... పెత్తనం మాత్రం కంభం ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సాగిస్తున్నారు. వై.పాలెం, కుంట వద్ద స్టాక్ పాయింట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వగా... అయిదు మండలాల్లోనూ అనధికారికంగా నిల్వ చేసి వ్యాపారం సాగిస్తున్నారు. దోర్నాల మార్కెట్ యార్డు, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు తదితర ప్రాంతాల్లో అడ్డగోలుగా అమ్మకాలు చేపడుతున్నారు. వీరిని కాదని ఎవరైనా బయట నుంచి ఇసుక తెస్తే చుక్కలు చూపిస్తున్నారు. ఈ వేధింపులు భరించలేక ఓ లారీ యజమాని కుటుంబం పెట్రోల్ పోసుకుని ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిందంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**కప్పం కడితేనే అనుమతి**

ఇక్కడి ఇసుక మాఫియాను కాదని బయట నుంచి తెస్తే టన్నుకు రూ.300 మేర కప్పం చెల్లించాలి. లేదంటే అనుమతి పత్రాలను చించేసి... లోడును స్వాధీనం చేసుకుంటున్నారు. ఇంకా మాట్లాడితే కేసులతో వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. లారీలు లోడుకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు ఇసుక బేరం ఎక్కువగా దొరుకుతుంది. అలా తెస్తేనే ఎంతో కొంత మిగులుతుందని.. లేదంటే రవాణా నష్టం తప్పదని యజమానులు చెబుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలోనూ మాఫియా దందా కారణంగా ఇలా నష్టపోయి చాలా మంది తమ వాహనాలు అమ్ముకున్నారు. వై.పాలెంలో 150 వరకు ఉన్న లారీల సంఖ్య 15కు పడిపోవడమే ఇందుకు నిదర్శనం. మిగతా మండలాల్లోనూ దాదాపుగా ఇదే పరిస్థితి. సొంతంగా వాహనాలు నడిపేవారే కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తెచ్చినా దందాకు అడ్డుకట్ట పడడం లేదని వారు వాపోతున్నారు. ఈ విషయమై మైనింగ్ ఏడీ పోలిరెడ్డిని సంప్రదించగా...విక్రయాలను అరికడతామ న్నారు. ఇప్పటికే కొన్ని వాహనాలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.

# తిట్టుకుంటున్నారు నన్ను.. తీర్చండి జనం అవస్థలు

చీపురుపల్లి : 'మాయదారి వంతెన.. మూడేళ్లవుతోంది ఇప్పటికీ పూర్తికాదు..' అని జనం తిడుతుంటే విని తట్టుకోలేకపోతున్నా. అలాగని చోదకుల కష్టాలూ చూడలేకపోతున్నా. చిన్నచిన్న పనులేగా.. పూర్తిచేసి, అందుబాటులోకి తేలేరా? విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో చీపురుపల్లి పట్టణం వద్ద 34 నెలల క్రితం నా నిర్మాణం ప్రారంభించారు. అంతకుముందు రాజాం, పాలకొండ, ఒడిశా వైపు నుంచి చీపురుపల్లి మీదుగా విజయనగరం, విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఇక్కడున్న పాతవంతెన మీదుగా పరుగులు పెట్టేవి. కొత్తగా నన్ను అందుబాటులోకి తెస్తామని కేంద్ర రైల్వే బోర్డు 2022లో రూ.12.97 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2023 మార్చిలో పనులు ప్రారంభించింది. అంచనా వ్యయాన్ని పెంచినా నేటికీ అందుబాటులోకి తీసుకురాలేదు. చీపురుపల్లి వైపు కాంక్రీటు గోడ నిర్మిస్తే కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీకి వెళ్లేందుకు రోడ్డు సదుపాయం ఉండదంటూ స్థానికులు పనులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, ర.భ శాఖ ఇంజినీరింగ్ అధికారుల చొరవతో ఈ సమస్య కొలిక్కి వచ్చినా మిగతా పనుల్లో వేగం లేదు. గుత్తేదారుకు సమస్య మరోమారు చెప్పండి. నేను అందుబాటులోకి రాక ఆర్టీసీకి ఇప్పటికే రోజుకు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లుతోంది. నన్ను ఇలా మధ్యలో వదిలేయడం తగదు.

# అసంపూర్తి కాల్వలో కన్నీటి ప్రవాహం

చాగలమర్రి :" రెండెకరాల్లో శనగ పంట సాగు చేశా. పంట కాల్వలో ప్రవాహం పెరిగి నీట మునగడంతో పైరు కుళ్లిపోయే దశకు చేరుకుంది. దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లిందని" గొట్లూరు చెందిన పెద్దయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కేసీ పంట కాల్వలు అసంపూ ర్తిగా వదిలేయడం రైతులకు శాపంగా మారింది. చివరి ఆయకట్టు ప్రాంతమైన చాగలమర్రి మండలం గొట్లూరు గ్రామ సమీపంలో గతంలో కొంతమేర నిర్మించి వదిలేశారు. మధ్యలోనే నిర్మాణాలు ఆపేయడంతో నీరు పంట పొలాలను ముంచెత్తుతోంది. నేలంపాడు, మల్లెవేముల గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సాధారణంగా పంట కాల్వలు నిర్మించేటప్పుడు వాగులో లేక నదిలో కలిసేలా చర్యలు తీసుకుంటారు.

**నిండా ముంచింది**



చాగలమర్రి మండల పరిధిలోని గొట్లూరు, వైఎస్సార్ కడప జిల్లా జంగాలపల్లె సమీపంలో కేసీ ప్రధాన కాల్వ 18వ బ్లాకు వద్ద స్లూయిజ్ నుంచి దిగువనకు నీటిని విడుదల చేస్తారు. ఉద్ధృతి కారణంగా పంట కాలువలు పొంగి పొలాలు నీట మునుగుతున్నాయి. గొట్లూరు సమీపంలో 57, 58 టీసీ ఉప కాల్వల వద్ద నీరు అధికంగా ప్రవహించడంతో శనగ రైతులు తీవ్రంగా నష్టపోయారు.

గొట్లూరు సమీపంలో పంట కాల్వలకు నీరు అధికంగా రావడమేకాక రెండుచోట్ల గండి పడటంతో 150 ఎకరాల్లో శనగ పంట మునిగిపోయింది. దాదాపు రూ.30 లక్షల విలువైన పంట గంగపాలైంది.

" కేసీ పంట కాలువల్లో నీరు ఉద్ధృతంగా ప్రవహించి పొంగి పొర్లుతుండటంతో పంటలన్నీ నీట మునిగాయి. నాలుగెకరాల మొక్కజొన్న దెబ్బతింది. నెల రోజుల పంటకు సంబంధించి ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇప్పటివరకు పెట్టుబడి పెట్టా. రూ.60 వేల మేర నష్టం వాటిల్లిందని" మరో రైతు మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

# పొగాకు బ్యారన్‌లో నిబంధనలు కాల్చేస్తాం

జంగారెడ్డిగూడెం : ఏజెన్సీ, మెట్ట మండలాల్లో అనధికారిక పొగాకు బ్యారన్ల నిర్మాణం పెద్ద సంఖ్యలో మొదలైంది. సొంత జాగాల్లో కొందరు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి మరికొందరు నిర్మిస్తున్నారు. ఇది తెలిసీ కూడా సంబంధిత అధికారులు నిలువరించలేకపోతున్నారు. ఇటీవల ముగిసిన సీజన్‌లో కిలో పొగాకుకు రూ.456 రికార్డు ధర వచ్చింది. మార్కెట్ బాగుండటంతో ఈ సాగుపై ఆసక్తితో బ్యారన్లు కడుతున్నారు. ఇప్పటికే ఎన్ఎల్ఎస్‌లోని జంగారెడ్డిగూడెం ఒకటి, రెండు, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల పరిధిలో రెండు వేల అనధికారిక బ్యారన్లు ఉన్నాయి. ప్రస్తుతం జోరుగా కట్టేస్తుండటంతో ఆ సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

అద్దె బారెడు.. బ్యారన్‌లో పొగాకు ఉడికించడానికి, అద్దెకు లైసెన్సు



తీసుకుంటే రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షలు అవుతోంది. అద్దెలు భారీగా ఉండటంతో.. చాలామంది అక్రమంగా నిర్మించేస్తున్నారు. ఒక సీజన్ అద్దె ఖర్చు కంటే తక్కువకే బ్యారన్ కట్టేయగలుగుతుండటంతో ఇవి పెరుగుతున్నాయి. మైసన్నగూడెంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి కొందరు బ్యారన్లు కడుతున్నారు. తాడువాయిలో ఇళ్ల మధ్యే బ్యారన్ కడుతున్నారని అదే గ్రామానికి చెందిన అనసూయ అనే గృహిణి ఇటీవల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ఉనికికే ప్రమాదం.. ఈ ఏడాది సుమారు 19 మిలియన్ కిలోలు అధికంగా పండించారు. దీంతో చివర్లో నాసిరకం పొగాకుకు ధర రూ.49కు పడిపోయింది. ఈ పరిణామాలతో బోర్డు గత సంవత్సరం కోటా తగ్గించింది. ఈ సమయంలో ఇబ్బడి ముబ్బడిగా కడుతున్న బ్యారన్‌లతో సాగు మరింత పెరిగి అసలుకే ముప్పు రావచ్చన్న భయం ఉంది. 'అనధికారిక బ్యారన్ నిర్మాణాలు జరగకుండా చూడాలని పంచాయతీ, రెవెన్యూ శాఖలకు సమాచారం ఇచ్చాం.' అని పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు.

# అందని నిధులు.. సాగని నిర్మాణాలు

బేస్తవారపేట: : పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వాలు సకాలంలో చర్యలు తీసుకోవాలి. లేదంటే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పవు. ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి..గత వైకాపా 'నాడు–నేడు' రెండో దశ పాఠశాలల పనులు. అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..నాడు–నేడు రెండో దశలో భాగంగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో 401 అదనపు తరగతి గదులు, కనీస మౌలిక వసతుల నిర్మాణాలకు రూ.48 కోట్ల నిధులను మంజూరు చేశారు. పలు దఫాల్లో సుమారు రూ.30 కోట్ల వరకు నిధులను విడుదల చేసింది. పూర్తి స్థాయిలో నిధులు సమకూరక పోవడంతో చాలాచోట్ల చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి

ఒక్క బేస్తవారపేట మండలంలో కేజీబీవీతో కలిపి మొత్తం 25 పాఠశాలల్లో రూ.11.20 కోట్ల నిధులు మంజూరు కాగా పనులు చేపట్టారు. అయితే వాటిల్లో కేవలం రూ.5.32 కోట్లు మాత్రమే అందాయి. దీంతో పూర్తి స్థాయిలో నిధులు అందక చాలా పాఠశాలల్లో పనులు పడకేశాయి.పిటికాయగుల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 3 అదనపు తరగతి గదులు మంజూరైనా నిధుల లేమితో పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి.ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు..

జిల్లాతో పాటు మండలంలోని పలు పాఠశాలల ఖాతాల్లో నాడు–నేడు రెండో దశ నిధులు కొద్దిమేర అలానే మిగిలి ఉన్నాయి.

# పఠన.. గణన నైపుణ్యంపై దృష్టి

పుంగనూరు : పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక, ఇంటర్ విద్యార్థులకు సంకల్ప్ లాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పఠన, గణన నైపుణ్యాల సాధన హామీ(గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్)75 రోజుల ప్రణాళిక అమలవుతోంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1-5 తరగతులు చదివే విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఇంగ్లిషు, తెలుగు రాయడం, చదవడం, గణితంలో ప్రాథమిక లెక్కలు చేయడం వంటివి తప్పనిసరిగా వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ నిర్దేశించింది.

జిల్లాలోని 1,946 ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఉదయం రెగ్యులర్ సిలబస్.. భోజన విరామం తర్వాత చదవడం, రాయడం, అర్థం చేసుకుని చెప్పడం, లెక్కలు చేసేలా చూడటం ఉపాధ్యాయుల బాధ్యత. పిల్లల స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించి దానికి అనుగుణంగా బోధన ఉంటుంది. అక్షరాలతో మొదలయ్యే సాధన ఈ నెల 8న ప్రారంభించగా చివరి రోజైన మార్చి 24 నాటికి సొంతంగా మాట్లాడటం, చదవడం,



రాయడం నైపుణ్యాలను పిల్లలు సాధించనున్నారు.

**కార్యాచరణ ఎలాగంటే..**

మధ్యాహ్నం 1 నుంచి 1.10 వరకు విద్యార్థులు ప్రశాంతతను అలవర్చుకోవాలి. 1-10 నుంచి 1.40 వరకు తెలుగు అక్షరాలు రాయడం, చదవడం 1-40 నుంచి 2.10 వరకు ఆంగ్లంలో పదాలు పలకడం, రాయడం

2.15 నుంచి 2.55 వరకు గణితంలో అంకెలు, సంఖ్యలను గుర్తించడం 2.55 నుంచి 3.20 మధ్య పరీక్ష

3.20 నుంచి 3.35 వరకు ఫలితాలపై సమీక్ష, పునశ్చరణ ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు.

# అడుగుకో గుంత.. అడగలేక తంటా

శ్రీకాళహస్తి : పాపానాయుడుపేట ప్రధాన మార్గంలో 30 కిలోమీటర్ల మేర అక్కడక్కడా భారీ గుంతలు పడటంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు.

ఇవేకాక పలు అంతర్గత రహదారులు సైతం అధ్వానంగా ఉండటంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. భారీ గుంతల కారణంగా కంకర తేలి ప్రమాదకరంగా మారడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, రోగుల బంధువులతో పాటు అంబులెన్సుల కు నరకం కనిపిస్తోంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు రహదారులు వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తున్నాయి. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం వీటి అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. అనంతరం వచ్చిన కూటమి సర్కారు దృష్టి సారించి అరకొరగా బాగు చేసినా, విరామంలేని



తుపానుల ధాటికి ఛిద్రమయ్యాయి. దీంతో రహదారులన్నీ అడుగుకో గుంత.. గజానికో గొయ్యిలా దాపురించింది. పాలకులు, సంబంధిత అధికారులు తమకేమి పట్టదనట్లుగా వ్యవహరిస్తుండటంతో భారీ గుంతల నడుమ రహదారిని వెతుక్కోవాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

**నిత్యం పాట్లు..ఈ రోడ్లపైనే..!**

శ్రీకాళహస్తి-పంగూరు రహదారిలో నిత్యం స్థానిక ప్రైవేటు కర్మాగారానికి వచ్చి పోయే భారీ వాహనాల కారణంగా రహదారి ధ్వంసమైంది. ఈ మార్గంలో ఏర్పడ్డ గుంతలతో నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు సైతం గుంతల ధాటికి పాడైపోయి మరమ్మతులకు అదనపు ఖర్చులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శ్రీకాళహస్తి-వెంకటగిరి ప్రధాన రహదారిలో మూడు కిలో మీటర్ల మేర వాహనదారులు రోడ్డును వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. అధ్వానంగా తయారైన ఈ రోడ్డుపై కాస్తంత ఏమరపాటును ప్రదర్శించినా ప్రాణాలను కోల్పోతున్నారు.

తొట్టంబేడు మండలంలోని పెన్నలపాడుకు వెళ్లే రోడ్డు ఇసుకాసురుల ఆగడాలకు నామరూపాలు కోల్పోతుంది. వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఇంట్లో కొత్త వెలుగులు

కర్నూలు : విద్యుత్తు వినియోగదారులకు అండగా ఉండేలా ఏపీఈఆర్సీ పలు సంస్కరణలు తీసుకొచ్చింది. గతంలో కొత్త కనెక్షన్‌కు ఇంటి నుంచి స్తంభానికి కనీసం 30 మీటర్ల దూరంలో ఉంటే తక్కువ ఖర్చుతో మీటరు అమర్చేవారు. 30 మీటర్ల దూరం దాటితే కొత్త స్తంభంతోపాటు ఎంత దూరం ఉంటే అంత వరకు అల్యూమినియం తీగలతోపాటు ఇతరత్రా ఖర్చులతో ఎస్టిమేషన్ వేస్తారు. ఈ నిబంధనలు మారుస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొత్త కనెక్షన్‌కు సంబంధించి కేటగిరీ ఆధారంగా స్థిర ఛార్జీలను ప్రవేశపెట్టి అదనపు భారం తొలగించింది. గత నెల 29వ తేదీ నుంచి స్థిర ఛార్జీలు అమల్లోకి వచ్చాయి. కిలోమీటరు దూరం వరకు నూతన సంస్కరణలు వర్తిస్తాయి. వెంచర్లు, ఫామ్‌హౌస్‌లు, అండర్ గ్రౌండ్ కేబుల్ వేసుకున్నవారికి వర్తించవు.

ఎవరెవరు.. ఎంతెంతగృహ అవసరాలు (ఎల్‌టీ) : ఒక కిలోవాట్‌కు రూ.1500, 2-20 కిలోవాట్ల వరకు అదనంగా ప్రతి కిలోవాట్‌కు రూ.2 వేల చొప్పున చెల్లించాలి. 20 నుంచి 150 కిలోవాట్ల వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600 చెల్లించాల్సి ఉంటుంది.హెచ్‌టీ : 75 నుంచి 150 కిలోవాట్ల వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.4,400 చొప్పున చెల్లించాలి. నూతన నియంత్రికను వినియోగదారులే డబ్బులు చెల్లించి ఏర్పాటు చేసుకోవాలి.వాణిజ్య : ఒక కిలోవాట్‌కు రూ.1800, 2-20 కిలోవాట్ల వరకు ప్రతి కిలోవాట్‌కు అదనంగా రూ.2 వేల చొప్పున చెల్లించాల్సి ఉంది. 21-150 కిలోవాట్ల వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.12,600 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

# వసతి వణికిస్తోంది



మడకశిర : శీతాకాలం కావడంతో చలి వణికిస్తోంది. పెనుకొండ డివిజన్ పరిధిలో ఉదయం 8 గంటల వరకు మంచు కురుస్తోంది. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల పరిధిలోని పలు వసతి గృహాల్లో మౌలిక వసతులు సక్రమంగా లేక విద్యార్థులు చలికి వణుకుతున్నారు. కొన్నింటిలో కిటికీలు, తలుపులు పాడై ఉండటంతో చల్లని గాలి లోపలికి వస్తోంది. మరికొన్ని చోట్ల మంచాలు లేక నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి. బృందం వసతి గృహాలను పరిశీలించగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు ఇలా.. మడకశిర ఎంజేపీ బాలుర వసతి గృహంలో తరగతి గదుల్లోనే పడుకోవాల్సిన పరిస్థితి ఉంది. 248మంది విద్యార్థులు ఉన్నారు. గదుల కొరత వేధిస్తోంది. సాయిబాబా ఆలయానికి వెళ్లే రోడ్డు వైపునకు ఉన్న కిటికీ లేక ఇనుప కడ్డీలు విరిగిపోయాయి. మెస్ కూడా లేకపోవడంతో చలి తీవ్రంగా ఉంటోంది. చిలమత్తూరు బీసీ బాలుర వసతి గృహంలో కిటికీలకు మెస్ లేకపోవడంతో దోమలు లోపలికి వస్తున్నాయి. కిటికీలు ఒంపులు తిరగడంతో గాలికి లోనికి ప్రవేశిస్తోంది. దీంతో చలి ఎక్కువగా వేస్తోందని చలికి వణకాల్సిన పరిస్థితి ఉంది. హిందూపురం కళాశాల బాలుర వసతి గృహాల్లో ఉంటున్న వారికి దుప్పట్లు సరఫరా చేయక పోవడంతో చలికి ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి దుప్పట్లు తీసుకువచ్చి కప్పుకొంటున్నారు.

పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం 4 దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ 52 మంది విద్యార్థులు ఉంటున్నారు. వసతి గృహభవనం శిథిలావస్థకు చేరింది. గతేడాది డిసెంబరులో భవనం ఆధునికీకరణకు రూ.35లక్షల నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. మరుగుదొడ్లు, స్నానపు గదులున్నా పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు లోపలికివ వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రస్తుతం చలికే ఆరుబయట నీటిట్యాంకు వద్ద స్నానమాచరిస్తూ అవస్థలు పడుతున్నారు. బీసీ వసతి గృహాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయిబీసీ వసతి గృహాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.1.60కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే వసతి గృహాల్లో పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా మెస్‌ల ఏర్పాటు, మరుగుదొడ్లు, నీటి వసతి, కిటికీలు వంటివి మరమ్మతులు చేస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

గంగాధర్, ఏబీసీడబ్ల్యూవో, మడకశిర

# కనుమ దారులు.. రుధిర ధారలు



శ్రీకాళహస్తి : కనుమ రహదారుల్లో ఏ చిన్న ఏమరుపాటైనా ప్రాణాల మీదకు వస్తుంది. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఉమ్మడి జిల్లా వాసులు మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో కనుమ దారుల్లో ప్రయాణమంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రమాదాల నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. ప్రమాదాలు తగ్గుముఖం పట్టడం లేదు. ఈ రోడ్ల స్థితిగతుల్ని ఒకసారి పరికిస్తే..

**ప్రమాదాలకు కారణాలనేకం**

కనుమ రహదారుల్లో ప్రమాదాలకు కారణాలు అనేకమనే చెప్పాలి. సాధారణ రోడ్డుపై వాహనాలను నడపడం సులభమే. కనుమ దారుల్లో నడపాలంటే అనుభవానికితోడు నైపుణ్యం అవసరం.

నిద్రలేమి: కనుమ దారుల్లో సగం ప్రమాదాలకు కారణం నిద్రలేమి. వాహన చోదకులు రాత్రంతా నడపాలంటే పగటిపూట తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాలి. చాలా వరకు వాహన చోదకులు పగటి పూట సొంత పనుల్లో నిమగ్నమై రాత్రి వేళల్లో వాహనాలు నడుపుతున్నారు. అర్ధరాత్రి 1 నుంచి వేకువజామున 5 గంటల్లోపు కునుకుపాటే ప్రమాదాలకు కారణమవుతోంది.

భాకరాపేట పరిధిలో..

ఎక్కడ: తిరుపతి-మదనపల్లె ప్రధాన రహదారిలో

పొడవు: 15 కిలోమీటర్లు (రంగంపేట-భాకరాపేట) ఏడాదిలో జరిగిన

భారీ ప్రమాదాలు: 25పైనే

పెద్ద మలుపులు: దొనకోటగంగమ్మ మలుపు తర్వాత కల్యాణీడ్యాం, దెయ్యాల కోన, పుట్ట పాయింట్

**మొగిలి వద్ద..**

ఎక్కడ: చిత్తూరు-బెంగళూరు జాతీయ

రహదారిలో పొడవు: 4 కి.మీ.

ఏడాదిలో ప్రమాదాలు: 20కిపైనే

పెద్ద మలుపులు: దొరచెరువు వద్ద, మొగిలిఘాట్‌లో రెండు

**తిరుమల ఘాట్**

తిరుపతి నుంచి తిరుమలకు 19 కిలోమీటర్ల పొడవు

కొండమీదకు వెళ్లేందుకు రెండో ఘాట్ రోడ్డు, తిరుమల నుంచి తిరుపతికి వచ్చేందుకు ఒకటో ఘాట్ రోడ్డు గుండా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

ఏడాదిలో ప్రమాదాలు: 10కి పైనే

పెద్ద మలుపులు: 36

అవగాహన కొరవడి..

కనుమ రహదారులపై అవగాహన, మలుపుల వద్ద వేగనియంత్రణ, చాకచక్యంతో వాహనాలు నడిపే నైపుణ్యం అవసరం. ఈ అంశాల్లో అవగాహన లేమితో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. మొగిలిఘాట్‌లో వేగ నిరోధకాల వద్ద ఉన్న ఫళంగా వేగాన్ని తగ్గించడంతో వెనక వచ్చే వాహన చోదకులు ఢీ కొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

**వేగాన్ని నియంత్రించుకోలేక..**

అతివేగంతో వాహనాలు నడపడం, మలుపుల్లో 40 కిలోమీటర్ల కంటే తక్కువ వేగంతో వెళ్లాలన్న నిబంధనలను పాటించకపోవడంతో ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో లోయల్లో పడిపోవడం, మలుపుల వద్ద వేగనిరోధకాలను ఢీ కొట్టడంతో మృత్యుగండాలను తప్పించుకోలేకపోతున్నారు.

# మూగజీవాలు.. అడగలేవనా..

చిత్తూరు : చిత్తూరు జిల్లా పాడి పరిశ్రమకు ప్రసిద్ధి.. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ పరిశ్రమపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడం శోచనీయం. పశువైద్యశాలలు, గ్రామీణ పశువైద్యశాలలు, రైతుసేవా కేంద్రాల్లో(ఆర్ఎస్‌కే) కొన్నిచోట్ల మందులు అందుబాటులో లేక పశు పోషకులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సిన దుస్థితి.

**టీకాతో సరి..**

పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకా.. నిర్దేశిత సమయానికి వేస్తున్నారు. ముందస్తుగానే టీకా మందులు సరఫరా చేసి వేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఇకఅంతే. దాంతో సరిపెట్టేశారు.

**ఈ ఏడాది మందులెక్కడ..?**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదలై తొమ్మిది నెలలు కావస్తున్నప్పటికీ నేటికి పశువైద్యశాలలకు మందుల సరఫరా ఊసేలేదు. గత ఆర్థిక సంవత్సరం మందులనే ఈ ఏడాది మే నెలలో అందజేసి చేతులు దులుపుకొన్నారు. జిల్లాలో 284 రైతుసేవా కేంద్రాలు (నాటి ఆర్బీకేలు) ఉండగా.. 2023 నుంచి మందులు లేవు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లోనూ ఈ ఏడాది మే నెల నుంచి మందుల కొరత ఉంది.

**జిల్లాలో వివరాలు...**

బహువిధ పశువైద్యశాల: 1

ప్రాంతీయ పశువైద్యశాలలు: 14

గ్రామీణ పశువైద్యశాలలు: 77

పశువుల ఆసుపత్రులు: 68

రైతు సేవా కేంద్రాలు: 284

గోపాలమిత్ర కేంద్రాలు: 165



పశువులు, గేదెలు: 5.24 లక్షలు

గొర్రెలు, మేకలు: 8.30 లక్షలు

రైతుల జేబుకు చిల్లు..

పశువైద్యశాలలు, ఆర్ఎస్‌కేలకు పశువులను తీసుకెళ్తే మందులు కొనుగోలు చేసి తెచ్చుకోవాలని పశు వైద్యులు, సిబ్బంది పాడిరైతులకు సూచిస్తున్నారు. పొదుగు వాపు వ్యాధి మందులకు ఒక్కోరైతు రూ.750 నుంచి రూ.వెయ్యి వరకు బయట ఖర్చు చేయాల్సి వస్తోంది.

**మందులు -ఉమామహేశ్వరి, జేడీ, పశుసంవర్ధకశాఖ, చిత్తూరు**

రాగానే అందజేస్తాం.. రైతు సేవా కేంద్రాలకు మందుల సరఫరా నిలిచిపోయింది. పశువైద్యశాలలకు ప్రభుత్వం సరఫరా చేయగానే వాటిని అందజేస్తాం.

# కొండపై 'సిలికా'సులు

కోడుమూరు: కొండను పిండి చేసి విలువైన ఖనిజాన్ని సరిహద్దు దాటించి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. గత కొంతకాలంగా రాయల్టీ చెల్లించకుండానే తరలిస్తున్నట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. కోడుమూరు మండలం గోరంట్ల గ్రామపంచాయతీ పరిధిలోని రాతి కొండల్లో సిలికా శాండ్ ఖనిజం ఉంది. మూడెకరాల్లో విస్తరించి ఉన్న ఈ కొండలు, పక్కనే చిల్లబండ గ్రామంలో సర్వేనంబరు-226లో 70 సెంట్లను ఏళ్ల కిందట కొందరు లీజుకు తీసుకొన్నారు. గడువు ముగిసిందని అధికారులు చెబుతున్నారు.. కానీ యథేచ్ఛగా తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి.

**ఏటా అరకోటి గండి**

ఒక మెట్రిక్ టన్ను సిలికా శాండ్‌కు రూ.412 రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో వాహనంలో 35-40 మెట్రిక్ టన్నుల వరకు తరలిస్తున్నారు. దీని ప్రకారం రూ.14,420 రాయల్టీ చెల్లించాలి. వారానికి ఆరు వాహనాలకు పైగా వెళ్తున్నాయి. వారానికి రూ.86,520, నెలకు దాదాపుగా రూ.4 లక్షలు, ఏడాదికి రూ.50 లక్షలు ప్రభుత్వం ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. వాహనాలపై టార్పాలిన్ కప్పి గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. సాధారణంగా క్వారీల్లో తవ్వకాలు, రవాణాకు మైనింగ్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. రవాణా చేయడానికి ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. కానీ లారీలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.



**ఇలా వెలుగులోకి**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 516 మైనింగ్ క్వారీలు ఉన్నాయి. ఫెలస్పర్, లేటరైట్, సిలికా శాండ్, ఐరన్‌ఓర్ వంటి విలువైన ఖనిజాలు ఉన్నాయి. క్వారీల్లో ఖనిజం తవ్వి బయటకు రావాలంటే తప్పనిసరిగా సీనరేజీ(రాయల్టీ) చెల్లించాలి. గత ఐదేళ్ల వైకాపా సర్కారు హయాంలో అధికారులను భయపెట్టి అక్రమంగా తరలించేశారు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత సీనరేజీ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. తనిఖీలు చేయగా అక్రమ దందా వెలుగులోకి వచ్చింది.

**ముక్కలు చేసి.. పక్కకు తరలించి**

సిలికా శాండ్‌ను గ్లాస్(గాజు) తయారీకి వినియోగిస్తారు. ఈ ఖనిజానికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. రాతి కొండల్లో లభించిన పెద్ద పెద్ద రాళ్లను రాత్రి వేళ ప్రత్యేక వాహనాల్లో కోడుమూరు పట్టణానికి తరలిస్తున్నారు. అక్కడ క్రషింగ్ యంత్రాలతో చిన్న చిన్న ముక్కలుగా చేస్తున్నారు. మూడు రకాలుగా వేరు చేస్తున్నారు. వాటిని లారీల్లో ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్తున్నారు. ప్రధానంగా గోవాకు తరలిస్తున్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ఓ బడా వ్యాపారి కనుసన్నల్లో ఈ దందా కొనసాగుతోంది.మేలైన రకాన్ని గాజు పరిశ్రమకు, రెండు, మూడో రకాన్ని స్థానికంగా విక్రయిస్తున్నారు. మొదటి రకం రూ.లక్షల్లో విలువ చేయగా, రాళ్లు రూ.వేలల్లో ధర పలుకుతాయి. మిగతా దస్టును స్థానికంగా ట్రాక్టరు రూ.1200 చొప్పున ఇంటి అవసరాలకు, వెంచర్లలో రహదారులకు విక్రయిస్తున్నారు.


# పునాదిలో అక్రమాల 'ఎత్తు'గడ

కర్నూలు : వైద్య కళాశాలకు కేంద్రం వీఆర్‌డీఎల్(వైరల్ రీజినల్ డయాగ్నొస్టిక్ ల్యాబ్)ను మంజూరు చేసింది. రూ.74 లక్షలు వెచ్చించి దీన్ని నిర్మిస్తున్నారు. ఏ భవనమైనా భూ ఉపరితలానికి కనీసం మూడడుగుల ఎత్తులో ఉండేలా నిర్మిస్తారు. అలా చేస్తేనే భారీ వర్షాలు కురిసినా నీరు భవనంలోకి రాకుండా ఉంటుంది.

నగరంలోని సర్వజన వైద్యశాల, కర్నూలు వైద్య కళాశాల పరిధిలో చేపడుతున్న నిర్మాణాలు అక్రమాలకు వేదికగా మారాయి. ఏపీఎంఎస్ఐడీసీ పరిధిలో గుత్తేదారులు పనులు చేస్తున్నట్లు చూపించినా... వాస్తవానికి కొందరు గుత్తేదారులతో ఒప్పందాలు కుదుర్చుకుని ఆ సంస్థ పరిధిలోని అధికారులే చేయించి బిల్లులు చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. వాటిని ప్రశ్నించిన కిందిస్థాయి అధికారులపై బెదిరింపులకు దిగుతున్నారు. తట్టుకోలేక ఏపీఎంఎస్ఐడీసీకి చెందిన ఇద్దరు ఇంజినీర్లు ఉద్యోగాలు రాజీనామా చేయడం గమనార్హం. ఒప్పంద పద్ధతిలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సురేశ్‌ను ఆదోనికి బదిలీ చేశారు. మరో మహిళా ఇంజినీరును ఆదోనికి బదిలీ చేయడంతో రాజీనామా చేశారు.

**ఒకే అధికారికి కీలక బాధ్యతలు**

ఏపీఎంఎస్ఐడీసీ ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.చిరంజీవులు.. ఇన్‌ఛార్జి ఎస్ఈగానూ ఉన్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగ ఈఈ బాధ్యతలను సైతం ఆయనే పర్యవేక్షిస్తున్నారు. ఏపీఎంఎస్ఐడీసీలో మూడు కీలక పోస్టులను ఒకే వ్యక్తి నిర్వహిస్తున్నా పోస్టుల భర్తీ జరగడంలేదు. ఎలక్ట్రికల్ డీఈగా ఉన్న జయరామిరెడ్డి ఎస్ఈకి పీఏగానూ ఉన్నారు.



**అడుగు ఎత్తు కూడా లేదు..**

ఖరీదైన పరికరాలుండే వీఆర్‌డీఎల్ ల్యాబ్ భవన ఫ్లోరింగ్ భూమికి అడుగు ఎత్తులో కూడా లేదు. భవనం ఎత్తుగా నిర్మించాలంటే అందుకు తగ్గట్టు పిల్లర్లు వేయాలి. భారీగా మట్టి, కంకర వినియోగించాలి. ఫలితంగా వ్యయం రూ.లక్షల్లో ఉంటుంది. వాటి నిధులు మిగుల్చుకునేందుకు గుత్తేదారుడు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయానికి సమీపంలో రూ.2.78 కోట్ల వ్యయంతో నిర్మించిన ఔషధ నియంత్రణ, పరిపాలన భవనాన్ని కూడా భూ ఉపరితలానికి సమానంగా ఉండేలా నిర్మించారు. దీనిని 9వ తేదీన ప్రారంభించారు. భవనంలోకి వెళ్లేందుకు కనీసం ఒక మెట్టు కూడా లేదు. రెండంతస్తుల్లో నిర్మించిన ఆ భవనానికి రూ.2.78 కోట్లు ఖర్చుయ్యే అవకాశం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సర్వజన వైద్యశాలలో న్యూరోసర్జరీ, యూరాలజీ ఓటీల ఆధునికీకరణకు చర్యలు చేపట్టారు. రూ.55 లక్షలకు టెండర్లు వేశారు. గతేడాది పనులు ప్రారంభ మయ్యాయి. కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు పూర్తి చేశారు.

చురకలు



# కాంబోడియాలో శిక్షణ.. ఇక్కడ భక్షణ

తిరుపతి : సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పంథాలు ఎంచుకుంటూ అమాయకులను మోసం చేస్తూనే ఉన్నారు. రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. కాంబోడియాలో శిక్షణ తీసుకొని.. ఇక్కడ వల విసురుతున్నారు. మ్యూల్ ఖాతాలోకి దోచిన సొమ్ము మళ్లించి తప్పించుకుంటున్నారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

రిజిస్టర్ కాని సంస్థలో పెట్టుబడులు పెట్టకూడదు.

డిజిటల్ అరెస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవు

చరవాణులు, టెలిగ్రామ్‌లో వచ్చే లింకులు, ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయవద్దు.పొరపాటున మీ వ్యక్తిగత సమాచారంతో లింకును ఓపెన్ చేస్తే వెంటనే ఇంటర్నెట్ను ఆఫ్ చేయాలి.

లింకుల ద్వారా వస్తువులు కొనుగోలు చేయకూడదు.

**అలాంటి వారిపైనే దృష్టి**

విశ్రాంత ఉద్యోగులు, పిల్లలు విదేశాల్లో ఉన్న వారిపైనే సైబర్ నేరగాళు దృష్టి పెడుతున్నారు. కాంబోడియాలో శిక్షణ పొంది వచ్చిన వారు దేశంలోని వివిధ శాఖల నుంచి ఇలాంటి వారి వివరాలు, ఆర్థిక స్థితిని తెలుసుకొని వల విసురుతున్నారు. వారి ఖాతాల నుంచి మ్యూల్




ఖాతాలకు జమ చేసి.. అక్కడ నుంచి ఆన్‌లైన్ గేమింగ్ ఆటలో గెలిచిన వారికి ఈ డబ్బును జమ చేస్తున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ డిపాజిట్ సొమ్మును సైబర్ నేరగాళ్లు చైనా నుంచి దర్జాగా తీసుకుంటున్నారు.

**ఉద్యోగం పేరుతో వల**

కాల్ సెంటర్‌లో ఉద్యోగం, మంచి జీతం అని తెలుగు యువతకు ఎరవేసి కాంబోడియా దేశానికి రప్పిస్తున్నారు. వారితోనే తెలుగు ప్రజలను బుట్టలో వేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన కోటిబాబు ఇలాగే శిక్షణ తీసుకొని తిరిగొచ్చారు. గుర్తు తెలియని, చనిపోయిన వారి (మ్యూల్ ఖాతాలు) పేరిట కరెంటు ఖాతాలు తెరిచి.. ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా కాంబోడియాలో నేరగాళ్లకు కొట్టేసిన సొమ్మును పంపిస్తున్నారు. ప్రతీ లావాదేవీపై కమీషన్ తీసుకుంటున్నట్లు ఇటీవల తిరుపతి పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆరు నెలల కిందట విశాఖకు చెందిన ఓ వ్యక్తి కాంబోడియా నుంచి విజయవాడకు వచ్చి.. తమ్ముడు, వారి స్నేహితులతో కలసి తిరుపతికి చెందిన ఓ ఉపాధ్యాయుడిని డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి రూ.కోట్లు కాజేశారు. తరువాత కీలక నిందితుడు మినహా అతడి సోదరులు అరెస్టయ్యారు.

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు

సైబర్ టోల్ ఫ్రీ: 1930

అత్యవసర నంబరు: 112

వాట్సప్: 80999 99977

2025లో నమోదైన సైబర్ నేరాలు

కేసులు: 160

ఫ్రీజ్ చేసిన సొమ్ము: రూ.2.74 కోట్లు

అరెస్టైన వారు: 39 మంది

# 'గట్టు'న మేసిన 'భూ'తాలు..

నంద్యాల : చామ కాల్వకు వరద వచ్చిన సమయంలో నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. సమస్య పరిష్కారానికిగాను రక్షణ గోడ నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. కాలువ ఆనుకుని భూమి సేకరించి పరిహారం చెల్లించారు. ఇది సరిపోదంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయి ంచారు. దశాబ్దాలు గడిచినా పనులు జరగలేదు. ఈ నేపథ్యంలో విలువైన భూమిని ఆక్రమించుకునేందుకు అక్రమార్కులు అడుగులు వేస్తున్నారు.

**కంప చెట్లు తొలగించి..**

514 సర్వే నంబరులో 1.34 ఎకరాలకు సంబంధించి నలుగురు రైతుల నుంచి భూమి సేకరించారు. నగదు చెల్లించే క్రమంలో కొందరు కోర్టును ఆశ్రయించడంతో రూ.2,80,926ను అప్పట్లోనే కోర్టులో జమ చేశారు. కేసు ఏళ్లుగా నడుస్తూనే ఉంది. ఈ క్రమంలో భూమి తమదంటూ కొందరు వచ్చి కంపచెట్లు తొలగించి చదును చేశారు. దీని పక్కనున్న సర్వే నంబర్లలోనూ పనులు చేపట్టగా సంబంధిత భూ యజమానులు అడ్డు చెప్పడంతో వెనుదిరిగారు.

**గతంలో ప్లాట్లు వేశామంటూ..**

514, 519, 443-ఏ 512-1బీ తదితర సర్వే నంబర్లలో భూసేకరణకు ముందే తాము ప్లాట్లు వేశామని కొందరు తెరపైకి వస్తున్నారు. స్థలాలు అమ్మినా తమకు ప్లాట్లు చూపలేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయని.. యజమానులైన తాము విక్రయించిన స్థలాలు చూపుతున్నట్లు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు జలవనరులు, ఇటు రెవెన్యూ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొందరు రెవెన్యూ సిబ్బంది అండతోనే



ఈ వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలున్నాయి. రెవెన్యూ దస్త్రాలో భూసేకరణ భూమి అని స్పష్టంగా ఉన్నప్పటికీ పలువురు ఆక్రమణలకు తెగపడుతుండటం గమనార్హం.

ఇప్పటికే చామ కాల్వకు మరోవైపున ఉన్న భూమిని కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. సెంటు భూమి రూ.లక్షలు పలుకుతున్న నేపథ్యంలో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

**ఎకరా రూ.5 కోట్ల పైమాటే..**

నంద్యాల పట్టణ శివారులోని ప్రథమ నంది ఆలయం నుంచి కర్నూలు బైపాస్ రహదారి సమీపం వరకు చామ కాల్వకు ఇరువైపులా గతంలో రెవెన్యూ అధికారులు భూసేకరణ చేశారు.

సర్వే నంబరు 514లో 1.34 ఎకరాలు, 519లో 2.99 ఎకరాలు, 515-1లో 16 సెంట్లు, 449-1లో 3.32 ఎకరాలు, 447-1లో 0.15 సెంట్లు, 446-1ఏలో 0.42 సెంట్లు, 443-ఏలో 3.8 ఎకరాలు, 438ఎ-3లో 0.24 సెంట్లు, 436-2లో 0.17 సెంట్లు, 436-3లో 0.13 సెంట్లు, 453-2లో 0.12 సెంట్లు 457-2లో 0.21లో సెంట్లు, 512-1బీ 1.05 ఎకరాలు, 512-2బీలో 1.58 ఎకరాలు సేకరించారు. మొత్తం 12 ఎకరాలను దశాబ్దాల కిందట కాలువకు ఒకవైపు సేకరించారు. ఈ భూములు చాలా ఏళ్లుగా నిరుపయోగం ఉండటంతో అక్రమార్కులు దీనిపై కన్నేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎకరా భూమి రూ.5 కోట్లకుపైగా పలుకుతోంది.

# మేనకూరు పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రణాళికలేవీ



నాయుడుపేట : మేనకూరు పంచాయతీ పరిధిలోని సెజ్‌లో కంపెనీల నుంచి ఏడాదికి రూ.50 లక్షలు వరకు పన్ను రూపంలో రాబడి వస్తోంది. ఇందులో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, వాటర్ వర్క్స్, వాహనాల నిర్వహణ, ఇతర సిబ్బందికి నెలకు రూ.2 లక్షలకు పైనే చెల్లిస్తున్నారు. ఈ నగదును అవసరమైన పనులకు వినియోగించాల్సి ఉంది. ఏపీఐఐసీ అధికారులు వసూలు చేసే పన్నులో 8 శాతం లైబ్రరీ సెస్సుకు కేటాయించి, మిగిలిన 92 శాతంలో సగం పంచాయతీకి, మరో సగం ఏపీఐఐసీకి చెందుతోంది. పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్యం పడకేసింది.

**ప్రభుత్వ భవనాలకు స్థలాల కొరత**

ఇక్కడ నైపుణ్య కేంద్రాలు, ఆసుపత్రులు, పోలీసుస్టేషన్ వంటి వసతుల కల్పనకు ప్రభుత్వ భూముల కొరత ఏర్పడింది. మేనకూరు నుంచి వెంకటగిరి వెళ్లే ర.భ.రహదారి పక్కన సెజ్ ప్రహరీ ఆనుకొని ఉండే 12 ఎకరాల భూములను గుత్తేదారుల అవసరాలకు కేటాయించారు. మేనకూరు పరిసర గ్రామాల్లో శ్మశాన వాటికలకు భూమి కొరత ఉంది. కాలువల గట్లు ఇతర ఖాళీ స్థలాల్లో మృతదేహాలను పూడ్చుతున్నారు. శ్మశాన వాటికలు లేకుండా ఏపీఐఐసీ అధికారులు భూములను స్వాధీనం చేసుకున్నారు.

**ఆక్రమణల సంగతేంటి**

పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ పక్కన గిరిజనుల కోసం గతంలో కేటాయించిన నాలుగు ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలాలను వైకాపా హయాంలో ఆక్రమించి ఇళ్లు కట్టి అద్దెలకు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం దీనిపై చర్యలు చేపట్టలేదు. రూ.కోట్లు విలువజేసే ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను నేటికీ తొలగించలేదు. రెవెన్యూ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. ఇక్కడి కంపెనీల అభివృద్ధి పేరుతో సాగునీటి చెరువులను ధ్వంసం చేసి మట్టి, గ్రావెల్, ఇసుక తరలిస్తున్నారు. పక్కనే మామిడికాలువలో మట్టి తరలింపులు, ఆక్రమణలతో దాని స్వరూపమే మారిపోయింది. రహదారులు, నివాసాలు, ఖాళీ స్థలాల్లో చెత్త కుప్పలుగా పేరుకుంటోంది. పంచాయతీ అభివృద్ధిపై ఎంపీడీవో సురేష్‌బాబుతో మాట్లాడగా గ్రామంలోని చెత్తతో సంపద తయారీ చేస్తున్నామని, తాగునీటి, రహదారుల వసతి కల్పిస్తున్నామని చెప్పారు.

వివరాలిలా..

గ్రామ పంచాయతీ : మేనకూరు

జనాభా : 8 వేలు

ఇళ్లు : 2 వేలు

నజరా గ్రామాలు : వద్దిగుంట కండ్రిగ, కోనేటిరాజుపాళెం, ఎర్రపశెట్టికండ్రిగ, పాళెంపాడు, గిరిజన, ఎస్సీ, బీసీ కాలనీలు

రాబడి : రూ.50లక్షలు

కంపెనీలు : 50వరకూ సేకరించిన భూములు : 4200 ఎకరాలు

# పేద బిడ్డలకు.. శుద్ధ జలం



చిత్తూరు : సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. శుద్ధజల యంత్రాలను ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే సంక్షేమ వసతి గృహాల్లో రూ.8.63 కోట్లు, సీఎం ప్రత్యేక నిధి నుంచి రూ.3 కోట్లు మొత్తం రూ.11.63 కోట్లతో వసతులు కల్పించారు.

గత ఐదేళ్ల వైకాపా పాలనలో వసతిగృహాల్లో కనీసం చిన్నపాటి మరమ్మతులు చేయలేదు. నాడు-నేడు ద్వారా మరమ్మతులు చేస్తామని చెబుతూనే ఐదేళ్లు గడిపేశారు. నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టారు. చిత్తూరు జిల్లాలో 57 సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. విద్యార్థులకు శుద్ధజలం లేక.. క్యాన్ల ద్వారా తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గతంలో అప్పుడెప్పుడో ఎంపీ నిధులతో ఇచ్చిన ఫిల్టర్లు మూలనపడ్డాయి. కుప్పం, పలమనేరు, చిత్తూరులో కొన్నింటిలో దాతలు ఇచ్చిన ఆర్వో నీటిశుద్ధి యంత్రాలు పనిచేస్తున్నాయి. కొన్నిచోట్ల బోరు నీటినే తాగి పాఠశాల, కళాశాలకు వెళ్తున్నారు. వసతిగృహ వార్డెన్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి శుద్ధనీరు తాగే పరిస్థితి. జిల్లాలోని ఆరు వసతిగృహాల్లో మాత్రమే శుద్ధజల యంత్రాలు ఉండగా.. 51 వసతిగృహాల్లో విద్యార్థులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

**ఎంపికైనవి ఇవే..**

మొదటి విడతగా రాష్ట్రంలో 311 వసతి గృహాల్లో ఒక్కో యంత్రాన్ని రూ.2 లక్షలతో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో జిల్లాలో ఏడు వసతిగృహాలు ఎంపిక కాగా, వాటిలో చిత్తూరు బాలికల వసతిగృహాలు 1, 2, కొనమాసనపల్లి బాలుర వసతిగృహం, వీకోట బాలుర, చిత్తూరు బాలుర, బాలికల కళాశాల వసతిగృహాలు, పుంగనూరు బాలికల వసతిగృహాలు ఉన్నాయి.

జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలు: 57

ప్రీమెట్రిక్: 41

పోస్టు మెట్రిక్: 16

విద్యార్థులు: 3,500 మంది

# శ్రమజీవుల కుటుంబాల్లో వెలుగులు



పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల చిరుద్యోగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చాలీచాలని వేతనాలతో కార్మికులు చాలా ఇబ్బందులు పడ్డారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని పలుమార్లు రోడ్డెక్కారు.. అయినా ప్రయోజనం లేకపోయింది.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వీరి సేవలు గుర్తించి వేతనాల పెంపుతో పాటు ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా చర్యలు చేపట్టడం గమనార్హం.

**వినతులు బుట్టదాఖలు..**

2019లో అప్పటి వైకాపా ప్రభుత్వం కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి చేర్చింది. వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరం చేసింది. పలు నిబంధనల కారణంగా ప్రభుత్వాలు అందించే ఆర్థిక ప్రయోజనాలు వీరి దూరమయ్యాయి.

ఒక్కో ఉద్యోగికి గతంలో రూ.15 వేలు జీతం ఇచ్చేవారు. ఇందులో మినహాయింపులు పోను రూ.13,074 మాత్రమే వచ్చేది. కొవిడ్ సమయంలో ప్రజారోగ్య కార్మికులకు అదనంగా రూ.6వేలు పెంచి ఇచ్చారు. తమకు వేతనాలు పెంచాలని సాంకేతిక, సాంకేతికేతర ఉద్యోగులు కోరినా నాటి ప్రభుత్వం వారి వినతులు బుట్టదాఖలు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సాంకేతిక ఉద్యోగులకు ఈ ఏడాది ఆగస్టు నుంచి రూ.3 వేలు, సాంకేతికేతర ఉద్యోగులకు రూ.3500 వేతనం పెంచింది. యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకుని శూన్య ఖాతాలు ప్రారంభించింది. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకుంది. ఫలితంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,500 మందికి ప్రయోజనం చేకూరనుంది.

**ఇవీ ప్రయోజనాలు..**

కార్మికులు, చిరుద్యోగులు దురదృష్టవశాత్తూ చనిపోతే రూ.2 లక్షల సాయం అందుతుంది. వారి పిల్లలు చదువుకునేందుకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఇద్దరికి రూ.8 లక్షలు ఇవ్వనుంది.

ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.20 లక్షల పరిహారం ఇస్తుంది.

రూ.4లక్షల వరకు రుణ సాయం అందేలా చర్యలు తీసుకుంటారు.

# గుంతల దారి.. గ్రానైట్ జారి..

చీమకుర్తి: చీమకుర్తి మండలం రామతీర్థం రాజుపాలెం రహదారి మరమ్మతులకు నోచుకోక తరచూ గ్రానైట్ బండలు జారి పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రాణ నష్టం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇవిగో ఉదాహరణలు రాజుపాలెం నుంచి రామతీర్థం వైపు గ్రానైట్ రాయి లోడ్‌తో వెళ్తున్న లారీ క్యాబిన్ నుంచి ట్రాలీ వేరుపడి రాయి పక్కకు పడిపోయింది. ఈ ఘటనలో రహదారిపై ఎవరూ లేక పోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కొద్ది రోజుల కిందట ఇదే రహదారిలో ఓ లారీ నుంచి పెద్ద గ్రానైట్ బండ జారిపడింది. ఆ సమయంలోనూ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.రూ.కోట్ల నిధులు మూలుగుతున్నా..రామతీర్థం నుంచి రాజుపాలెం వరకు రహదారి అంతా గోతుల మయంగా మారడంతో గ్రానైట్ బండలు తరచూ పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్.ఎల్.పురం పంచాయతీ పరిధిలో రూ.కోట్లనిధులు మూలుగుతున్నా కనీసం మరమ్మతులు చేపట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. కనీస మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని పాలక వర్గం వారు చెబుతుండటం విమర్శలకు దారితీస్తోంది.

# ఆచూకీ లేకున్నా.. ఉపాధి..!

భీమవరం : ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకుంటున్న అక్రమాలను సరిచేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూనే ఉన్నాయి. పనిచేసే ప్రతి శ్రామికుడికి ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో జిల్లాలోని అసలు చిట్టా బయటపడుతోంది. మృతులు, ఇతరత్రా 64 వేల మంది ఆచూకీ లేకపోవడంతో వారి కార్డులను రద్దు చేశారు. మరో 48 వేల మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది.

భీమవరం గ్రామీణ ప్రాంతంలో మొత్తం రూ.10లక్షల విలువ చేసే పనులు జరగ్గా రూ.8లక్షలకు సరైన వివరాలు లేకపోవడంతో రికవరీ చేశారు. పోడూరు మండలంలో అక్రమాలు వెలుగు చూసినా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యులు గగ్గోలు పెట్టగా సుమారు రూ.4 లక్షలు రికవరీ చేశారు.

**వైకాపా సానుభూతిపరులకు..**

నిరుపేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులు పనులు చూపించడం ద్వారా ఆయా కుటుంబాలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. దీనిలో కూడా కొందరు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పార్టీ సానుభూతిపరులకు ఉపాధి హామీ కూలి చెల్లించారనే వాదనలు ఉన్నాయి. సామాజిక తనిఖీల్లోనూ అవి బయట పడకుండా కొంత మంది సిబ్బంది జాగ్రత్త పడ్డారు. ఇటీవల మెంటేపూడిలో చనిపోయిన వ్యక్తులు పనిచేసినట్లు హాజరు వేసి రూ.12వేలు చెల్లించినట్లు గుర్తించారు.

కొంతమంది క్షేత్ర సహాయకులు శ్రామికులు హాజరు కాకపోయినా



వచ్చినట్లు, పని జరగకపోయినా జరిగినట్లు రాసేసుకుని ప్రభుత్వ సొమ్ము జేబుల్లో నింపుకొంటున్నారు. ఆచంట, పెంటపాడు, పాలకోడేరు, గణపవరం తదితర మండలాల్లో సామాజిక తనిఖీల్లో రూ.78లక్షల వరకు పక్కదారి పట్టినట్లు గుర్తించి, రికవరీ చేస్తున్నారు. 20 మండలాల్లోనూ మూడేళ్లలో 110 మంది క్షేత్ర సహాయకులు సస్పెండ్ అయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాం. వంద శాతం ఈకేవైసీ అయ్యేలా చూస్తాం. చేయించుకోని వారి జాబ్ కార్డులు తొలగిస్తామని డ్వామా పీడీ అప్పారావు తెలిపారు.

మొత్తం జాబ్‌కార్డులు - 1,59,256

శ్రామికులు - 2,54,005

ఆధార్ సీడింగ్ - 2,51,838

ఈకేవైసీ చేసింది - 2,03,098

తొలగించింది - 64,159

# అడిగితే..ఆరోగ్యం

భీమవరం : వ్యవస్థీకృత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా కల్పిస్తున్నా కొన్ని సంస్థలు కార్మిక రాజ్య బీమాకు దూరంగా ఉండటం, నమోదు చేసుకోకపోవడంతో పూర్తి ఫలాలు అందడం లేదు. జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి లేక కొందరు... నమోదు కాక మరికొందరు ఏదైనా ప్రమాదం జరిగినా, అనారోగ్యం తలెత్తినా ఆర్థికంగా కుదేలవుతున్నారు.

**ఇది పరిస్థితి:** జిల్లాలో చిన్నవి, పెద్దవి కలిపి 39వేల యూనిట్ల వరకు ఉన్నాయి. వాటిలో 1.79లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నా ఆ స్థాయిలో ఈఎస్ఐలో నమోదు లేదు. నిబంధనల ప్రకారం జిల్లాలో 50వేల మంది కార్మికులు నమోదై ఉంటే ఆసుపత్రి నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొస్తాయి. గత అయిదేళ్లూ కార్మికుల నమోదు మాట దేవుడెరుగు ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఉన్న పరిశ్రమలు సైతం మూతపడ్డాయి.

**చెల్లించేందుకు విముఖత**

ఏదైనా సంస్థ, పరిశ్రమలో కనీసం పది మంది కార్మికులుండి, వారిలో నెలకు రూ.21వేల జీతం కంటే తక్కువ ఉన్న వారంతా ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. వారి పేరున ఆయా సంస్థలు ఇచ్చే వేతనంపై యజమాని వాటా 3.25శాతం, కార్మికుడి వాటా 0.75శాతం జమ చేయాలి. కానీ చాలా సంస్థలు ముందుకు రాకపోవడంతో కార్మికులు ఆర్థికంగా, వైద్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ప్రథమ చికిత్సతో సరి**

వేండ్ర, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకుల్లో ఈఎస్ఐ డిస్పెన్సరీలు




న్నాయి. ఏళ్ల తరబడి ఆ స్థాయిలోనే ఉండిపోవడంతో ప్రాథమిక చికిత్స మినహా అత్యవసర, గుండె, ఆర్థోపెడిక్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు.

**ఏంటి ఉపయోగం**

ఈఎస్ఐలో నమోదైన కార్మికులు అస్వస్థతకు గురైనప్పుడు, కార్మికురాలు ప్రసవించినప్పుడు, ఉద్యోగ సంబంధమైన ప్రమాదాలకు గురైనా, మరణించినా, ఇతర కారణాలతో పనికి వెళ్లలేని క్రమంలో ఆర్థిక సహాయంతోపాటు ఆయా కుటుంబాలకు వైద్య సౌకర్యం కల్పిస్తోంది.

**ఏళ్లు గడుస్తున్నా అంతే..నమోదుకు చర్యలు**

కూటమి చొరవ: కార్మికుల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం అయిదు నెలలుగా ఈఎస్ఐ ద్వారా స్కీం ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్, ఎంప్లాయిస్ (ఈఎస్పీఆర్ఈఈ) ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. రంగాల వారీగా ఆయా యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తూ ఈ ఏడాది డిసెంబరు 31లోగా నిబంధనల ప్రకారం కార్మికులను నమోదు చేయాలని సూచిస్తుంది.

# మట్టి.. కొల్లగొట్టి..

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని కొండ ప్రాంతం, నెలగొండరాయుడి మాన్యంలో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. భారీ యంత్రాల సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టి.. టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఇదంతా అధికార పార్టీకి చెందిన కొందరు చేస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ పథకాల పేరుతో దోపిడీ**

ప్రభుత్వ పథకాలు, ఇతర పనులకు అత్యవసరమైతే తప్పా ఎక్కడ ఎలాంటి తవ్వకాలు.. మట్టి, ఇసుక తరలింపు చేయకూడదని ఆదేశాలున్నా పట్టించుకోవడం లేదు. ధనార్జనే ధ్యేయంగా రెండు చోట్ల జేసీబీలను ఏర్పాటు చేసుకొని అనుమతుల పేరుతో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామంలో శివాలయం, కన్యాకపరమేశ్వరి



ఆలయాలను నూతనంగా నిర్మిస్తుండగా ఆయా పనుల కోసమని చెబుతూ ఎర్రమట్టిని పక్కదారి పట్టిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఎర్రమట్టి దోపిడీ కొనసాగుతున్నా దేవాదాయ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. విలువైన మట్టిని వెంచర్లు, ఇతరత్రా ప్రైవేట్ పనులకు తరలించగా కొండరూపు మారిపోయింది.

గ్రామ సమీపంలో నెలగొండరాయుడికి సంబంధించిన ఆలయ భూమి 21 ఎకరాలు ఉంది. అందులో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అక్రమార్కులు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీంతో మాన్యం భూమిలో మట్టిపోయి గుంతలుపడ్డాయి. ఇది వరకు సదరు భూమిని కొందరు రైతులు కౌలుకు తీసుకుని పంటలు పండించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, నిబంధనలు అతిక్రమించి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఉషారాణి, ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు.

# పైనుంచి చూస్తున్నారు!

అనకాపల్లి : కేసులను ఛేదించడానికి, ట్రాఫిక్ సమస్య తీర్చడానికి అనకాపల్లిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతోంది. అనకాపల్లిలో నెహ్రూచౌక్, పెరుగు బజార్, జాతీయ రహదారి నూకాంబిక ఆర్చి వద్ద సీసీ కెమెరాల, స్పీకర్లతో స్మార్ట్ ట్రాఫిక్ కంట్రోల్ ఏర్పాటు చేశారు. జిల్లాలో తొలిసారిగా పెట్టిన ఈ విధానం అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతోంది. ఇంతవరకు భోజన విరామం, ఇతర ప్రాంతాల్లో బందోబస్తుకు సిబ్బంది వెళ్లినప్పుడు ట్రాఫిక్ పర్యవేక్షణ ఇబ్బందిగా ఉండేది. ఇలాంటి సమయంలో పోలీసులు స్టేషన్ నుంచే పర్యవేక్షిస్తుండటంతోపాటు వాహనదారులకు స్పీకర్లో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నిబంధనలు పాటించని వాహనాల నంబర్లను మైక్లో చెబుతూ వారిని అప్రమత్తం చేస్తున్నారు. అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తే ముందుగా హెచ్చరించి.. ఖాతరు చేయకుంటే కేసులు నమోదు చేస్తున్నారు.

అనకాపల్లిలోని కొత్తూరు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఢీకొట్టిన వ్యాను అక్కడి నుంచి ఆపకుండా పరారైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు చీకట్లో ఈ ప్రమాదం జరిగినా ఇందుకు కారణమైన వ్యానును పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి రెండు గంటల్లోనే పట్టుకున్నారు.

అనకాపల్లి మీదుగా క్వారీ లారీలు వెళ్తుంటాయి. రాత్రివేళల్లో పోలీసులు ఎవరూ పహారా లేరని గుర్తించి కొందరు డ్రైవర్లు వాహనాలు మితిమీరిన లోడుతో.. అధికవేగంతో నడుపుతున్నారు. సిబ్బంది లేకపోయినా ఈ విషయం సీసీ కెమెరాలో గుర్తించి అలాంటి లారీలకు భారీ జరిమానా విధిస్తున్నారు.

కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు చేసిన వాహనదారులు నిలపకుండా అక్కడి నుంచి పోనిస్తున్నారు. రాత్రి సమయంలో ఢీకొట్టిన వారు తమను ఎవరూ చూడలేదనుకుని భావించి సంఘటనా స్థలం నుంచి పరారవుతున్నారు. కానీ ఈ తరహా వాహనదారులను ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలోనే పట్టుకుంటున్నారు. ఇందుకు కారణం చీకటిలోనూ స్పష్టంగా కనిపించేలా సరికొత్త సీసీ కెమెరాలను అనకాపల్లిలో ఏర్పాటు చేయడమే. దీంతోపాటు వాహనాల నంబరు ప్లేట్లను సులువుగా గుర్తించగలిగేలా ఏఎన్పీఎం కెమెరాలను జాతీయ రహదారితోపాటు పలు కూడళ్లలో ఏర్పాటు చేశారు.

అనకాపల్లిలో జనవరి నుంచి ఇప్పటివరకు 16 గుర్తుతెలియని వాహనాలు ఢీకొట్టి పరారయ్యాయి. మొత్తం అన్ని వాహనాలను గుర్తించి నిందితులపై కేసు నమోదు చేశారు.

# అడిగినా ఇవ్వరు.. చెప్పినా వినరు

అనకాపల్లి :కొమ్మాదికి చెందిన మహిళ ఏయూ దూర విద్యా కేంద్రంలో ఎంఏ ఆంగ్లం కోర్సు పూర్తి చేశారు. మార్కులజాబితా, ఒరిజినల్ ధ్రువపత్రం కోసం రెండు వారాలుగా ఆ కేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. సిబ్బంది రేపుమాపు అంటూ తిప్పి పంపేస్తున్నారు. కొన్ని కీలక నోటిఫికేషన్లు రావడంతో దరఖాస్తు చేసుకోవడానికి గడువు అయిపోతున్న నేపథ్యంలో ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

గాజువాకకు చెందిన రమేష్ బీకాం కోర్సుకు దరఖాస్తు చేశారు. ఐడీ కార్డు, మెటీరియల్ కోసం దూర విద్యా కేంద్రానికి పలుమార్లు తిరిగారు. ఐడీ కార్డు వివరాలు మెయిల్కు వస్తాయన్న కనీస వివరాలపై ఎవరూ సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

ఏయూ దూర విద్యా కేంద్రంలో పరిస్థితి ఇష్టారాజ్యంగా ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు అందులోని విభాగాల చుట్టూ తిరగడమే సరిపోతోంది. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదంటున్నారు. మార్కు జాబితాలు, ఓడీల కోసం కార్యాలయంలో అడిగితే ఇంటి చిరునామాకు పంపిచేశామని చెబుతున్నారు. ఒక వేళ వెనక్కి వచ్చినవి చేతికివ్వాల్సి ఉన్నా జాప్యం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు రెండు, మూడు వారాలుగా ప్రదక్షిణ చేస్తున్నారు. సరైన సమాచారం ఇవ్వడంలేదనే విమర్శలొస్తున్నాయి. చోడవరానికి చెందిన యువకుడు జర్నలిజం కోర్సులో ఈ ఏడాది చేరాడు. మెటీరియల్ సంబంధిత సమాచారం లేదు. అతని మెయిల్కు సగం సబ్జెక్టుల పీడీఎఫ్లే వచ్చాయి.

**సమాచారం ఏదీ**

యూజీ, పీజీ కోర్సుల్లో చేరిన వారికి మెటీరియల్ పంపిణీకి సంబంధించి సరైన సమాచారం ఇవ్వడం లేదు. పుస్తకాల పంపిణీ కూడా సరిగా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. 'ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గతంలో కంటే ఇప్పుడు సకాలంలో అందిస్తున్నాం. ఎవరికైనా జాప్యమైతే నా దృష్టికి తీసుకురావొచ్చు. వెంనే వారికి అందేలా చర్యలు తీసుకుంటా' అని ఏయూ దూర విద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు పేర్కొన్నారు.

# దాచాలంటే కష్టం.. అమ్మాలంటే నష్టం



గోరంట్ల : శ్రీసత్యసాయి జిల్లాలో మొక్కజొన్న సాగుచేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇతర పంటలతో పోలిస్తే తక్కువ పెట్టుబడితో గిట్టుబాటు అవుతుందన్న అభిప్రాయంతో ఖరీఫ్లో రైతులు జిల్లావ్యాప్తంగా విస్తారంగా సాగు చేశారు. పంటకు అనుకూలంగా వర్షాలు కురవడంతో చాలాప్రాంతాల్లో మంచి దిగుబడులు వచ్చాయి. పంట రైతుల చేతికొచ్చి విక్రయించాల్సిన సమయంలో ధర పతనమైంది. దీంతో జిల్లాలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు విక్రయించలేక నిల్వ ఉంచుకోలేక సతమతమవుతున్నారు. నెలక్రితం అత్యధికంగా క్వింటా రూ.2,500 వరకు ఉండగా నేడు రూ.1,700 లకు పడిపోయింది. క్వింటాల్కు రూ.800లు నష్టపోవాల్సి వస్తోందని రైతులు విలపిస్తున్నారు. వాస్తవంగా లక్ష ఎకరాలకు పైగాసాగైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులంటున్నారు.

**మేఘం కనిపిస్తే భయం**

ఇళ్లలో దాచుకోవడానికి స్థలం లేని చాలామంది రైతులు కల్లాల్లో, రోడ్లపైన ఆరబోసుకున్నారు. మేఘం కనిపిస్తే ఎక్కడ ధాన్యం తడిసిపోతుందోనని భయపడుతున్నారు. ఇంకొందరు ఇళ్ల నుంచి వాటిని బండలపైకి తీసుకెళ్లి ఆరబెట్టాలంటే అదనంగా అత్యంత ఖర్చుపెట్టుకోవాల్సి వస్తోందని కన్నీరు పెడుతున్నారు.

జిల్లా: శ్రీసత్యసాయి
మొక్కజొన్న సాగు: 76,782 ఎకరాలు
దిగుబడి: 2,14,991 మెట్రిక్ టన్నులు
విక్రయాలకు సిద్ధంగా ఉన్నది: 1,28,995 మెట్రిక్ టన్నులు
ప్రస్తుత మార్కెట్ ధర: రూ.1700 నుంచి రూ.1800
ప్రభుత్వ మద్దతు ధర: క్వింటా రూ.2400
క్వింటాల్పై నష్టం: రూ.800

**రూ.50వేలు నష్టపోతున్నా..**

ఫక్రుద్దీన్, మల్లాపల్లి, గోరంట్ల మండలం

రెండెకరాల్లో సాగుచేశాను. సుమారు 60 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. విక్రయించడానికి సిద్ధం చేసే సమయానికి ధర క్వింటాల్పై రూ.800 వరకు తగ్గింది. దీంతో రూ.50 వేల దాకా నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మద్దతు ధరకు తీసుకుంటే గిట్టుబాటు అవుతుంది.

# భూంఫట్!



తనకల్లు : గత ప్రభుత్వంలో కొందరు వైకాపా నాయకులు గుట్టుచప్పుడు కాకుండా భూములను కాజేశారు. వాటిని ఆన్లైన్లో ఎక్కించుకున్నారు. పాసుపుస్తకాలు సృష్టించి దర్జాగా రుణాలు పొందారు. వందల ఎకరాలు అక్రమంగా దోచేశారు. వీరికి అప్పట్లో కొంతమంది రెవెన్యూ అధికారులు సహకారం అందించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ భూములు తమవని, న్యాయం చేయాలని అసలైన లబ్ధిదారులు కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు. తనకల్లు మండలంలోని ఈతోడు, బిసనవారిపల్లిలో ఈ అక్రమాలు వెలుగుచూశాయి.

**ఈతోడులో 80 ఎకరాలకుపైగా..**

ఈతోడులో వైకాపాకు చెందిన 12 మంది నాయకులు దాదాపు 80 ఎకరాలకుపైగా భూములకు అక్రమంగా పాసుపుస్తకాలు పొందారు. వాటితో రుణాలు తీసుకున్నారు. దీనిపై గత ప్రభుత్వంలోనే బాధితులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. విచారణ మొదలవగా అధికారం అండతో అక్రమార్కులు బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ అక్రమాలపై నిర్వహించిన గ్రామసభలో బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో కొందరు అక్రమార్కులు వారంతట వారే పాసుపుస్తకాల్లో నుంచి భూములను తొలగించినట్లు తెలిసింది. పది నెలలు గడుస్తున్నా మిగిలిన అక్రమాలపై ఎటువంటి విచారణ లేదు.

**బిసనవారిపల్లిలో 42 ఎకరాలు..**

టిసదుం పంచాయతీలోని బిసనవారిపల్లికి ఓ కుటుంబం కొన్నేళ్ల కిందట వలస వచ్చి 50 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. తరువాత అందులో నుంచి 20 ఎకరాలు విక్రయించారు. 30 ఎకరాలకు వారికి హక్కు ఉంది. అయితే ఆ కుటుంబంలోని 12 మంది పేరిట 15 సర్వేనంబర్లలో దాదాపు 42 ఎకరాలకు అక్రమంగా పాసుపుస్తకాలు సృష్టించారు. ఆ భూమి తమకు పిత్రార్జితంగా వచ్చిందని, ఆన్లైన్లో ఎక్కించాలని గత కొన్నేళ్లుగా గ్రామంలోని 60 కుటుంబాలకు చెందిన రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత నెల కదిరిలో జరిగిన పీజీఆర్ఎస్లోనూ బాధితులు కలెక్టరుకు విన్నవించారు.

**మాన్యం భూమిని వదల్లేదు**

ఈతోడు పంచాయతీలోని రాకుంటపల్లి వద్ద దొక్కలకొండ లక్ష్మీనరసింహస్వామికి మాన్యం కింద సర్వేనంబరు 221లో 12.20 ఎకరాలు ఉంది. ఆ భూమిని సైతం కొందరు ఆన్లైన్లో ఎక్కించుకున్నారన్న విమర్శలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. కొన్నేళ్ల కిందట ఈ తంతు జరిగినా మాన్యం భూమిని రక్షించడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తాయి.

**విచారణ చేస్తున్నాం**

షాబుద్దీన్, తహసీల్దారు, తనకల్లు

ఈతోడు గ్రామంలో అక్రమ పాసుపుస్తకాలపై నోటీసులు ఇచ్చాం. నివేదికను ఆర్డీఓకు పంపాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం బిసనవారిపల్లిలో అక్రమాలపై విచారణ జరుగుతోంది. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

# పారిశుద్ధ్యం.. నిర్వహణ అస్తవ్యస్తం!



గుత్తి: పురపాలికల్లో పారిశుద్ధ్య కార్మికులు చెత్తసేకరణకు పడరాని పాట్లు పడుతున్నారు. వీధుల్లోకి వెళ్లడానికి చెత్త తరలింపు వాహనాల కొరత తీవ్రంగా ఉంది. కార్మికుల సంఖ్య కూడా తక్కువగా ఉండటం గమనార్హం. ఫలితంగా పారిశుద్ధ్య నిర్వహణ అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్న విమర్శలున్నాయి. గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పట్టణాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. స్వచ్ఛంధ్ర, స్వచ్ఛభారత్, మన పరిశుభ్రత-మన ఆరోగ్యం కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది. క్షేత్రస్థాయిలో వీటి అమలు పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రధానంగా గుత్తి పురపాలికలోని చెట్నేపల్లి, గుత్తిఆర్.ఎస్, సూరశింగనపల్లి, గుత్తిలో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా తయారైంది. చెత్తసేకరణకు మూడు ఆటోలు, నాలుగు ట్రాక్టర్లు, మరో రెండు భారీ వాహనాలు ఉన్నాయి. దీనికి తోడు తగినంత మంది కార్మికులు లేరు. కోట, బండగేరి, చెర్లోపల్లికాలనీ, గాంధీనగర్, చెట్నేపల్లి, సూరశింగనపల్లి, గుత్తిలోని బీసీకాలనీ, దాసరిగేరిలలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. పుష్కార్టులు, వీల్బార్లు 35 చొప్పున ఉన్నాయి. చెత్తకుండీలు 50 ఉన్నాయి. వీల్బార్లు, పుష్కార్టులు చాలా వరకు తుప్పుపట్టిపోయాయి. సగానికి సగం పనిచేయడం లేదు.

గుంతకల్లు పురపాలికలోనూ ఇదే పరిస్థితి. కార్మికులకు సరిపడ పరికరాలు లేక ఇబ్బంది పడుతున్నారు. తాడిపత్రిలో చెత్త కుండీలు లేవు. కుండీలులేని పట్టణంగా మార్చారు. ఇక్కడ ప్లాస్టిక్ బుట్టలు ఇచ్చారు. వీటిల్లో చెత్త వేసి వీధుల్లో వాహనాల్లో వేయాల్సి ఉంటుంది. ఈప్రక్రియ సక్రమంగా సాగడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**త్వరలో సామగ్రి తెప్పిస్తాం..**

**జబ్బార్మియా, కమిషనర్, గుత్తి**

పాతబడి మూలకు చేరిన పుష్కార్టులు, వీల్బార్ల స్థానంలో కొత్తవి తెప్పిస్తాం. ఇందుకు రూ.2 లక్షలు వెచ్చించాలని నిర్ణయించాం. ఇప్పటికే టెండర్లు పూర్తి చేశాం. గుంటూరుకు చెందిన గుత్తేదారులకు సామగ్రి కోసం ఆదేశాలిచ్చాం. పారిశుద్ధ్యం పనుల విషయంలో లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

# కోట్ల మనసులు దోచిన పరోపకార మంత్రం

పుట్టపర్తి : సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం సత్యసాయి చూపిన పరోపకార మంత్రానికి భక్తులు ముగ్ధులయ్యారు. అందుకే ఆయన శతజయంత్యుత్సవాల్లో తామూ భాగస్వాములు కావాలని పుట్టపర్తికి తరలివస్తున్నారు. భక్తులకు జిల్లా అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు సహకరిస్తే అందరికీ సులువుగా సాయి దర్శనం అవుతుందని చెబుతున్నారు.

**వైద్య శిబిరాలు**

పుట్టపర్తిలో మొత్తంగా 25 చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిత్రావతి వంతెన, ఆర్టీసీ బస్టాండ్, గోకులం కలెక్టరేట్, విమానాశ్రయం వద్ద, పంచాయతీ కార్యాలయం, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలున్నాయి. వీటితో పాటు 108 వాహనాలు 25 సిద్ధంగా ఉంచారు.

**వసతి ఎక్కడంటే..**

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు విద్యుత్తు సబ్స్టేషన్, ఆర్టీసీ బస్ డిపో, ప్రశాంతి నిలయం సాయి హీరాహాల్, చైతన్యజ్యోతి మ్యూజియం, ప్రశాంతి నిలయం వెస్ట్నార్త్ పక్కన సుందరం ఎన్క్లేవ్, వెస్ట్ సౌత్ పక్కన శివం ఎన్క్లేవ్ ప్రాంతాల్లో తాత్కాలిక గుడారాలు, షెడ్లు నిర్మించారు.




**18 చోట్ల అగ్నిమాపక దళం**

పట్టణంలో 18 చోట్ల అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేశారు. చిత్రావతి నదిలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఒక స్పీడీ బోట్, ఆరుగురు గజఈత గాళ్లను నియమించారు.

**భోజన సౌకర్యం**

ఉత్సవాల ముగింపు వరకూ 6 చోట్ల ఉచిత భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాప్రసాద క్షేత్రం, వెస్ట్ గేట్, చైతన్యజ్యోతి మ్యూజియం, గ్రామ సేవ, చిత్రావతి రోడ్డు, బృందావన్ ఎన్క్లేవ్, విద్యుత్తు సబ్స్టేషన్, ఆర్టీసీ డిపో వెనుక ఉచిత భోజన వసతి కల్పించారు.

**సమాచారానికి 'సాయి 100' యాప్**

తొమ్మిది ప్రాంతాల్లో సమాచార సేవా కేంద్రాలను అందుబాటులో ఉంచారు. కర్ణాటకనాగేపల్లి, చిత్రావతి బ్రిడ్జి, చిత్రావతి హారతి ఘాట్, సత్యసాయి పార్క్, గణేష్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, రమేశ్ విల్లాస్, పెద్ద కమ్మవారిపల్లి కూడలి, రైల్వేస్టేషన్ వద్ద సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. యాత్రికులు అవసరమైతే 'సాయి100' యాప్ను డౌన్లోడ్ చేసుకుంటే పూర్తి వివరాలు తెలుస్తాయి.

**యాత్రికులకు ఉచిత రవాణా**

రైల్వేస్టేషన్ నుంచి గణేశ్ సర్కిల్ మీదుగా కర్ణాటకనాగేపల్లి వరకు, అక్కడి నుంచి మళ్లీ రైల్వేస్టేషన్ దాకా యాత్రికులు ఉచితంగా ప్రయాణించేందుకు 25 బస్సులు ఏర్పాటు చేశారు.

**12 పార్కింగ్ ప్రదేశాలు..**

కదిరి, పులివెందుల, చెన్నై నుంచి వచ్చే భక్తులకు కర్ణాటకనాగేపల్లి కింగ్స్ చర్చి, టీకూడలి, సాయినగర్ క్రికెట్ గ్రౌండ్ వద్ద..

కర్ణాటక, అనంతపురం నుంచి వచ్చే భక్తులకు బ్రాహ్మణపల్లి శిల్పారామం, కమ్మవారిపల్లి రోడ్డులోని ఎస్ఎస్ఎస్ పాఠశాల, కమ్మవారిపల్లి పోతులయ్యస్వామి గుడి, సత్యసాయి సర్కిల్లో బాలవికాస్ పాఠశాల, పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆనంద విల్లాస్, విమానాశ్రయం రోడ్లో సందీప్ బెల్లీవ్యూ, వైకూడలిలో అమూల్య లేఅవుట్, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద వాహనాల పార్కింగ్కు ఏర్పాటు చేశారు. వీటిపక్కనే తాత్కాలిక మరుగుదొడ్లను అందుబాటులో ఉంచారు.

# వరి రైతుల గుండె కోత

ఆళ్లగడ్డ : 'వరి'రైతులకు కంటిమీద కునుకు కరవైంది..గ్రామ స్థాయిలో ఏజెంట్లంతా ఒక్కటై రైతుల గుండెకోసేంత పని చేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని రీతిలో వరి కోతల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అధిక వర్షాలు, పంట కాల్వల్లో నీటి పరవళ్ల కారణంగా వరి కోత కోసం చైన్ మిషనే వాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గంటకు (చైన్ మిషన్) రూ.3,200 నుంచి రూ.3,500 వరకు కోత యంత్రాల యజమానులు తీసుకుంటున్నారు. స్థానికంగా కొందరు నెల్లూరు, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి వందల యంత్రాలను తీసుకొస్తున్నారు. వీరంతా సిండికేట్గా మారి వారు చెప్పిందే ధరగా మార్చారు. ఏజెంట్ల సిండికేట్ కారణంగా రైతు ఎకరాకు సగటున రూ.2 వేల వరకు నష్టపోతున్నారు.

**గ్రామస్థాయి నేతల పెత్తనం**

వరి కోత యంత్రాలను స్థానిక ఏజెంట్లు ఇతర ప్రాంతాల్లో ఉన్న వాటి యజమానులతో ఒప్పందం కుదుర్చుకుంటారు. గంటకు రూ.200 కమీషన్ వచ్చేలా మాట్లాడుకుని ఎన్ని గంటల కోతలు జరిగితే అన్ని రూ.200 చొప్పున ఏజెంట్లు తీసుకుంటారు. కొన్ని గ్రామాల్లో ఈ ఏజెంట్లు రాజకీయ నాయకులై ఉంటారు.

**నెమ్మదిగా నడిపేలా చేస్తూ..**

గతంలో ఒక ఎకరా వరి పొలాన్ని గంట లేదా 1.25 నిమిషాల్లోనే కోసేసేవారు. ప్రస్తుతం సాంకేతికత పెరిగి, అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అయినా కోత సమయం తగ్గకపోగా మరో 30, 45 నిమిషాలు పెరగడం గమనార్హం. ఏజెంట్లు తమకు కమిషన్ అధికంగా పెంచుకునేందుకు యంత్రాలను ఉద్దేశపూర్వకంగానే నిదానంగా నడిపేలా చేసి రైతులను దోచుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ప్రస్తుతం సగటున ఒక గంట 45 నిమిషాల నుంచి 2 గంటల్లో ఎకరా పొలాన్ని కోస్తున్నారు. వరి కోతకే కనీసం ఎకరాకు రూ.7 వేల ఖర్చు వస్తోంది. తుపాను దెబ్బకు నేలకొరిగిన పొలాలకైతే ఎకరాలకు కనీసం మూడు గంటల సమయం పడుతోంది.

మండలానికి వందకు పైగా..

ప్రస్తుతం జిల్లాలో వెలుగోడు మొదలుకుని చాగలమర్రి వరకు ప్రతి మండలానికి తక్కువలో తక్కువగా 100 నుంచి 120 వరి కోత యంత్రాలు ఉంటాయి.

రుద్రవరం మండలంలో 60 మంది ఏజెంట్ల వద్ద 110 నుంచి 120 వరకు వరికోత యంత్రాలు ఉన్నాయి. వీరంతా ఒకే రేటు పెట్టి సిండికేట్గా మారినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

శిరివెళ్లలో 30 మంది ఏజెంట్లు వందకుపైగా యంత్రాలను కలిగి ఉన్నారు. వీరు తెలుగు గంగ కింద కోతకు వచ్చిన పంటను కోస్తున్నారు. ప్రస్తుతం రూ.3200 వరకు వసూలు చేస్తున్నారు.

## 'స్వయంభు' వచ్చే వరకూ నభా కవితలేనా?

సాయంత్రం వెలుగులో నన్ను వెతుక్కుందాం.. నా ముఖంలో చిరునవ్వుతో, నా హృదయంలో వెచ్చదనంతో.. కూర్చుని ఆకాశ సౌందర్యం గురించి మాట్లాడుకుందాం.. గాలితో ఊపిరి పీల్చుకుందాం.., మేఘాల నీడలో విశ్రాంతి తీసుకుందాం.. సూర్యాస్తమయంలో మారుతున్న రంగుల్లో నవ్వుకుందాం.. ఎప్పటికీ నన్ను వెతుక్కుందాం.. ఎవరిలో ఇంత సొగసైన కవిత్వం పొంగి పొర్లుతోంది? ఏమో! అది నభా నటేష్ కావొచ్చు. ఈ కన్నడ బ్యూటీ టాలీవుడ్ లో అడుగుపెట్టినప్పటి నుంచి కెరీర్ పరంగా వరుసగా అవకాశాలు అందుకుంటూనే ఉంది. కానీ ఊహించని విధంగా కెరీర్ దూసుకెళుతున్న సమయంలోనే ఒకే ఒక్క యాక్సిడెంట్ తన కలల్ని కల్లలు చేసేస్తుందని భయపడినట్టు చెప్పుకొచ్చింది నభా. అప్పట్లో తన కెరీర్ గురించి చాలా ఆందోళన చెందింది. అయితే చూస్తుండగానే అంతా మారిపోయింది. తాను అనుకున్న విధంగా కంబ్యాక్ అయింది. ఇప్పుడు దర్శకనిర్మాతలను ఆకర్షించడంలో రేసులో ముందుంది. ఈరోజు ఉన్నది రేపు ఉండదు.. రేపు ఉన్నది ఆ తర్వాత ఉండదు.. ప్రతి రోజూ మారిపోతూనే ఉంటుంది. లైఫ్ అంటే ఇదే కదా.. అయితే కొంచెం ఓపిక సహనం అవసరం. కాలంతో పాటే మార్పు ఉంటుందని



గ్రహించి సహనంతో ఎదురు చూడాలి. ఇప్పుడు తాను వేచి చూసిన సమయం రానే వచ్చింది. తిరిగి ఎప్పటిలానే నభా నటేష్ తన సొగసైన రూపాన్ని తిరిగి పొందింది. బోయ్స్ ని కవ్వించే అందం చందం తనలో మెండుగా ఉన్నాయని చెప్పకనే చెబుతోంది నభా ఇన్ స్టాలోని ప్రతి పోస్ట్. ఎంతో అందంగా డిజైనర్ లుక్కుల్లోకి ఒదిగిపోయి ఫోటోషూట్లలో మిలమిల మెరిసిపోతోంది నభ. తాజాగా నభా నటేష్ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. చాలా సింపుల్ గా.. చాలా నేచురల్ గా సహజసిద్ధంగా ప్రకృతి అందాల నడుమ ఒదిగిపోయి కనిపించింది నభా. వైట్ ఫ్రాక్ లో గుబులు రేపేంత అందంగా కనిపిస్తోంది. మునుపటితో పోలిస్తే జిమ్ లో బాగా శ్రమిస్తోంది. దీని ఫలితం నభా ఎంతో స్లిమ్ గా టీనేజర్ ని తలపిస్తోంది. ఈ మేకోవర్ నిజంగా స్టన్నింగ్. హూ ఆర్ యు క్వీన్ నభా.. ఐ మిస్ యు! అంటూ ఒక అభిమాని లవ్ ఈమోజీలను షేర్ చేసాడు. చాలా మంది అభిమానులు నభా నటేష్ అందచందాలకు మైమరిచి పోతున్నామని చెబుతున్నారు. లవ్ కిస్ ఫైర్ ఈమోజీలతో ఫ్యాన్స్ విరుచుకుపడుతున్నారు. తాజా ఫోటోషూట్ వెబ్‌లో మోంతా తుఫాన్ లా దూసుకెళుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నిఖిల్ సరసన స్వయంభు అనే హిస్టారికల్ వారియర్ డ్రామా చిత్రంలో నటిస్తోంది. భరత్ కృష్ణమాచారి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాపై నభా చాలా హోప్స్ పెట్టుకుంది. కొంత గ్యాప్ తర్వాత తనకు బిగ్ బ్రేక్ ఇస్తుందని నభా ఆశిస్తోంది. నభాతో పాటు, సంయుక్త మీనన్ మరో కథానాయికగా నటిస్తోంది.

## ది గర్ల్‌ఫ్రెండ్లో ఆ రోల్ అంత స్పెషలా? ఆ ఇద్దరునో చెప్పారట!

రష్మిక మందన్న నటిస్తున్న 'ది గర్ల్‌ఫ్రెండ్' ట్రైలర్ రీసెంట్‌గా రిలీజై మంచి బజ్ క్రియేట్ చేసింది. రాహుల్ రవీంద్రన్ డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమా, ఒక ఇంటెన్స్, రియలిస్టిక్ లవ్ స్టోరీలా కనిపిస్తోంది. ట్రైలర్ కట్, ఎమోషన్స్ అన్నీ ఆడియెన్స్‌ను అట్రాక్ట్ చేశాయి. అయితే, ఈ సినిమాకు సంబంధించి ఇప్పుడు ఇండస్ట్రీలో ఒక ఇంట్రెస్టింగ్ గాసిప్ చక్కర్లు కొడుతోంది. ఇది సినిమాలోని ఒక కీలక పాత్ర గురించి. ఈ సినిమాలో రష్మిక, హీరో దీక్షిత్ శెట్టితో పాటు అను ఇమ్మాన్యుయేల్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించబోతోంది. అయితే, కథలో వీళ్లతో పాటు మరో కీలకమైన పాత్ర ఉందట. ఆ పాత్ర నిడివి తక్కువే అయినా, ఇంపాక్ట్ మాత్రం చాలా ఎక్కువగా ఉంటుందని సమాచారం. డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్



మొదట ఈ రోల్ కోసం చాలా పెద్ద పేర్లనే ట్రై చేశాడని టాక్. రాహుల్ రవీంద్రన్ ఫస్ట్ ఛాయిస్ ఎవరో కాదు.. 'యానిమల్', 'అర్జున్ రెడ్డి' లాంటి బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా అని తెలుస్తోంది. ఒక డైరెక్టర్‌ను యాక్టింగ్ కోసం అప్రోచ్ అవ్వడం అనేది చాలా పెద్ద విషయమే. అయితే, సందీప్ రెడ్డి వంగా ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. కారణం ఏంటంటే, ఆ రోల్ కేవలం 'కామియో' (గెస్ట్ రోల్) కాదని, అంతకు మించి ఉందని, అందుకే తనకు సెట్ అవ్వదని సందీప్ ఫీల్ అయ్యాడట. గతంలో సందీప్ మహానటిలో నటించిన విషయం తెలిసిందే. సందీప్ వంగా 'నో' చెప్పడంతో, రాహుల్ రవీంద్రన్ మరో యాక్టర్‌ను ట్రై చేశాడని అంటున్నారు. ఈసారి ఆయన టాలీవుడ్ టాప్ కమెడియన్ వెన్నెల కిషోర్‌ను అప్రోచ్ అయ్యాడట. కానీ, వెన్నెల కిషోర్ కూడా ఈ రోల్ చేయడానికి ఇంట్రెస్ట్ చూపించలేదని సమాచారం. ఒక స్టార్ డైరెక్టర్, ఒక టాప్ కమెడియన్ ఇద్దరూ వద్దనుకున్న ఆ పాత్రలో అంత స్పెషాలిటీ ఏముంది? అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో క్యూరియాసిటీని పెంచుతోంది. ఫైనల్‌గా, ఆ రోల్ చేసేందుకు మరెవరూ దొరక్కపోవడంతో.. డైరెక్టర్ రాహుల్ రవీంద్రనే స్వయంగా ఆ పాత్రను చేశాడని అంటున్నారు.

రీసెంట్‌గా రిలీజైన ట్రైలర్‌లో రాహుల్ రవీంద్రన్ కనిపించడంతో నిజమే అయ్యిండొచ్చనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. మరి, అంతమంది రిజెక్ట్ చేసిన ఆ పాత్ర గుట్టు ఏంటో తెలియాలంటే నవంబర్ 7 వరకు ఆగాల్సిందే. గీతా ఆర్ట్స్ సమర్పణలో వస్తున్న ఈ సినిమాను విద్యా కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మించారు.




## 'పతంగ్' ట్రైలర్.. యూత్ కు ఎక్కేటట్లు ఉందే!




ఇన్ స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ లీడ్ రోల్స్ లో పతంగ్ మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. పెర్ఫెక్ట్ యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా పతంగ్ ను ప్రణీత్ ప్రత్తిపాటి తెరకెక్కిస్తుండగా.. సినిమాలో ప్రముఖ గాయకుడు ఎస్ .పి.చరణ్ కీలక పాత్రలో కనిపించనుండడం విశేషం. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ బ్యానర్ పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తుండగా.. ప్రముఖ నిర్మాత డి. సురేష్ బాబు సమర్పిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25వ తేదీన సినిమాను గ్రాండ్ గా విడుదల చేయనున్నారు. అయితే ఇప్పటికే షూటింగ్ పూర్తవ్వగా.. ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుతున్నారు. అదే సమయంలో ప్రమోషన్స్ ను కూడా నిర్వహిస్తున్నారు. రీసెంట్ గా ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రైలర్ వైరల్ గా మారగా.. పతంగుల పోటీ నేపథ్యంతో కామెడీ స్పోర్ట్స్ డ్రామాగా మూవీ ఉండనున్నట్లు తెలుస్తోంది. పురాణాల్లో చూసుకుంటే సీత కోసం చాలా మంది పార్టిసిపేట్ చేశారు కదా.. అంటూ హీరోయిన్ చెబుతున్న డైలాగ్ తో ట్రైలర్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత ప్రీతి పగడాల, వంశీ పూజిత్ లవ్ ట్రాక్ ను చూపించారు. అప్పుడే ప్రణవ్ ఎంట్రీ ఇస్తారు. అక్కడి నుంచి ట్రైలర్ ఇంట్రెస్టింగ్ గా మారింది. ఇద్దరూ హీరోయిన్ నే లవ్ చేస్తారు. చివరి ఏమైందనేది మూవీగా తెలుస్తోంది. అయితే ట్రైలర్ ఇప్పుడు ఆడియన్స్ లో మూవీపై ఆసక్తి క్రియేట్ చేస్తుందని చెప్పాలి.

వినూత్నమైన కథాంశంతో సినిమా రూపొందుతున్నట్లు చెప్పకనే చెబుతోంది. థియేటర్లలో యూత్ ఫెస్టివల్ లా సినిమా ఉంటుందని అర్థమవుతుంది. యువతకు బాగా కనెక్ట్ అయ్యేలా స్టోరీతో మూవీ తీస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా నటీనటులు కొత్త వాళ్లే అయినా సెటిల్డ్ గా నటించినట్లు కనిపిస్తున్నారు. మేకర్స్ క్వాలిటీ విషయంలో అస్సలు రాజీ పడినట్లు లేదు. కలర్ ఫుల్ విజువల్స్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచేలా ఉన్నాయి. సంగీత దర్శకుడు జోస్ జిమ్మి అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పెర్ఫెక్ట్ గా సెట్ అయింది. ఓవరాల్ గా ట్రైలర్ మాత్రం.. ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. మరి పతంగ్ మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## జిమ్ లో తెగ కష్టపడిపోతున్న నభా నటేష్.. స్పెషల్ ఏంటంటే?





సాధారణంగా పురుషులతో పోల్చుకుంటే మహిళలు త్వరగా ఏజ్ ఉన్నవారిగా కనిపిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా వివాహం తర్వాత గర్భం.. ఆ తర్వాత శరీరంలో వచ్చే మార్పులు.. పనిలో ఒత్తిడి ఇలా పలు కారణాల వల్ల అమ్మాయిల శరీరంలో మార్పులు వస్తూ ఉంటాయి. కానీ హీరోయిన్స్ ని చూస్తే మాత్రం 50 ఏళ్లు కాదు కదా 70 ఏళ్లు వచ్చినా సరే ఇంకా యంగ్ గా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. అసలు వీరి ఫిట్నెస్ వెనుక రహస్యం ఏంటి అని అమ్మాయిలు వెతకడం ఆరంభిస్తారు అనడంలో సందేహం లేదు. అయితే హీరోయిన్స్ లేటు వయసులో కూడా అంత అందంగా కనిపించడానికి కారణం వారు తీసుకునే డైట్ మాత్రమే కాదు జిమ్ సెంటర్లలో వారు కష్టపడే తీరు కూడా వారిని బొమ్మలా మారుస్తున్నాయి అనడంలో సందేహం లేదు. అందుకే నిత్యం జిమ్ సెంటర్లలో కనిపిస్తూ శరీరాన్ని ఫిట్ గా ఉంచుకుంటున్నారు. అంతేకాదు మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి తగిన యోగా శిక్షణలు కూడా తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇటు మానసికంగా అటు శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే మన శరీరం ఫిట్ గా ఉంటుందని.. వయసు మీద పడినా.. అసలు తెలియదు అంటూ కామెంట్ లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అలా నిత్యం తన శరీరాన్ని ఫిట్గా ఉంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్స్ లో నభా నటేష్ కూడా ఒకరు ఈమె ఎక్కువగా సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈసారి తాజాగా తన వారం మొత్తానికి సంబంధించిన జిమ్ వీడియోని అభిమానులతో షేర్ చేసుకుంది. అయితే ఈ జిమ్ వీడియోలో స్పెషల్ ఏంటో కూడా క్యాప్షన్ లో జోడించింది ఈ ముద్దుగుమ్మ. అసలు విషయంలోకి వెళ్తే.. సోమవారం నుంచి ఆదివారం వరకు జిమ్లో గడిపిన రోజుకు ఒక ఫోటో తీసుకుంది. వాటన్నింటినీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే ఆ ఒక్కొక్క ఫోటోలో సెల్ఫీ ఫోటో తోపాటు రంగురంగుల జిమ్ దుస్తులు ధరించి తన వస్త్రాలతో కూడా అందరినీ ఆకట్టుకుంది. మొత్తానికి అయితే జియోలో కష్టపడుతూనే అటు రోజుకొక ఫోటో షేర్ చేస్తూ రోజుకు ఒక రంగు డ్రెస్ ధరించినట్లు చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. నభా నటేష్ కెరియర్ విషయానికి వస్తే.. గత రెండు మూడు సంవత్సరాల క్రితం యాక్సిడెంట్ బారిన పడిన ఈమె ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అందులో భాగంగానే తాజా నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభూ సినిమాలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ సినిమాలో సంయుక్త మీనన్ కూడా మరో హీరోయిన్గా నటిస్తోంది . భరత్ కృష్ణమాచార్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నిఖిల్ కెరీర్ లోనే భారీ బడ్జెట్ మూవీ అని చెప్పవచ్చు. ఈ సినిమాతో నభా నటేష్ సక్సెస్ అందుకోవాలని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

## ఏళ్ల తరబడి గుర్తుంచుకునే కథ... ఆమె వ్యాఖ్యలు వైరల్

బాలీవుడ్‌లో సక్సెస్ రేటు నానాటికి తగ్గుతున్నా వచ్చే సినిమాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. పెద్ద హీరోల సినిమాలు, క్రేజ్ ఉన్న దర్శకుల సినిమాలు, పెద్ద బ్యానర్‌లో రూపొందిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద కంటిన్యూగా సందడి చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌మెంట్ సినిమాలకు హిందీ ప్రేక్షకులు అలవాటు పడ్డ నేపథ్యంలో చాలా మంది యంగ్ హీరోలు అలాంటి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాంటి కాన్సెప్ట్, జోనర్‌లో రూపొందిన సినిమా ధురంధర్. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన ధురంధర్ సినిమా డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. రణ్‌వీర్ సింగ్ గత చిత్రాల ఫలితాలతో సంబంధం లేకుండా ఈ సినిమాపై ప్రేక్షకులు, ఆయన అభిమానులు, ఇండస్ట్రీ వర్గాల వారు నమ్మకం పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.

**ధురందర్ సినిమా విడుదల తేదీ...** రణ్‌వీర్ సింగ్ ధురంధర్ సినిమాకు ఆదిత్య ధార్ దర్శకత్వం వహించాడు. రచయితగా, నిర్మాతగా పలు హిట్ సినిమాలను అందించిన ఆదిత్య ధార్ కి దర్శకుడిగా ఇది రెండో సినిమా. మొదటి సినిమా ఉరి : ది సర్జికల్ స్ట్రైక్ కమర్షియల్‌గా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, విమర్శకుల



ప్రశంసలు దక్కించుకుంది. ఆ సనిమా వచ్చి ఆరు ఏళ్లు దాటిన తర్వాత ఎట్టకేలకు ఆదిత్య ధార్ నుంచి కొత్త సినిమా రాబోతుంది. ఈ సినిమా ప్రారంభించినప్పటి నుంచి అంచనాలు భారీగా పెరుగుతూ వచ్చాయి. అందుకు తగ్గట్టుగా సినిమాను భారీగా ఖర్చు చేసి రూపొందించినట్లు సమాచారం అందుతోంది. తాజాగా ధురంధర్ సినిమా గురించి ప్రముఖ హీరోయిన్ యామి గౌతమ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఈ సినిమా దర్శకుడు ఆదిత్య ధార్ భార్య అయిన యామి గౌతమ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**హీరోయిన్ యామి గౌతమ్ మాట్లాడుతూ...** మరో నెల రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ధురంధర్ సినిమా గురించి యామి గౌతమ్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... తాను ఆర్టికల్ 370 సినిమా చేస్తున్న సమయంలో ధురంధర్ కథ విన్నాను. ఆర్టికల్ 370 సినిమాకు రచయితగా చేసిన ఆదిత్య ధార్ ఆ సమయంలోనే నాకు ధురంధర్ కథను చెప్పారు. నా భర్త ఆదిత్య ధర్ ఆ కథ చెప్పినప్పుడు ఏమోషనల్ అయ్యాను. దా స్క్రిప్ట్ చదివిన సమయంలో భావోద్వేగానికి గురి అయ్యాను. నేను ఇప్పటి వరకు చదివిన కథల్లో అత్యంత పవర్ ఫుల్ కథ ధురంధర్ అనిపించింది. ఒక అద్భుతమైన మల్టీస్టారర్ సినిమాను ప్రేక్షకులు ఎక్స్‌పీరియన్స్ చేయబోతున్నారు అంటూ ధురంధర్ గురించి యామి గౌతమ్ చెప్పుకొచ్చింది. ఆదిత్య ధార్ సినిమా ప్రారంభించినప్పటి నుంచి కూడా నేను ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్నాను అని యామి గౌతమ్ చెప్పుకొచ్చింది.

## కొత్త ఏడాది సీతమ్మ కొత్త కబురా?

ఒకేసారి రెండు పడవల ప్రయాణం అంత సులభం కాదు. అందులోనూ నటీమణులకు అసలే సాధ్యం కాదు. ఎంతో ఫ్యాషన్ ఉంటే తప్ప సాధ్యం కాదు. బాలీవుడ్ లో ఇలా రెండు పడవల ప్రయాణాన్ని మొదలు పెట్టింది కృతి సనన్. అమ్మడు బాలీవుడ్ లో ఎంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. వరుస ప్రాజెక్ట్ లతో క్షణం తీరిక లేకుండా గడుపు తోంది. ఓ పక్క హీరోయిన్ గా నటిస్తూ మరో వైపు కమర్శియల్ యాడ్స్ తోనూ బిజీగా ఉంది. గత ఏడాది నిర్మాణ రంగంలోకి కూడా అడుగు పెట్టింది. బటర్ ఫ్లై ఫిల్మ్స్ బ్యానర్ స్థాపించి తొలి చిత్రంగా దో పత్తీ నిర్మించింది. ఈ సినిమాకు డివైడ్ టాక్ వచ్చింది.

**దర్శక, నిర్మాతలతో చర్చలు:** ఈ సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. అయితే ఆ తర్వాత మళ్లీ మరో కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించలేదు. నటిగా బిజీగా ఉంది గానీ నిర్మాతగా మాత్రం బిజీ కాలేదు. ఈ నేపథ్యంలో తొలి సినిమాతోనే నిర్మాణం ఆపేసిందా? అన్న సందేహాలు బాలీవుడ్ లో వ్యకమవుతున్నాయి. నటిగా బిజీగా ఉండటంతో బ్యానర్ ని



పట్టించుకోలేని స్థితిలో ఉందా? అన్న సందేహాల నేపథ్యంలో అందుకు ఛాన్సే లేదంటూ ముందుకొచ్చింది. రెండవ సినిమాగా ఎలాంటి చిత్రం నిర్మించాలి ? అన్న దానిపై సీరియస్ గా దర్శక, రచయితలతో చర్చలు జరుపుతున్నట్లు వెలుగులోకి వచ్చింది.

**లాంగ్ గ్యాప్ ఎందుకంటే?...** ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఆ ప్రాజెక్ట్ కు సంబంధించి అప్ డేట్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్త ప్రాజెక్ట్ తో పాటు మరిన్ని కథలు విని లైన్ లో పెడుతున్నట్లు వినిపిస్తోంది. ఏ సినిమా నిర్మాణమైనా వెంట వెంటనే సాధ్యమ య్యేది కాదు. సినిమాపై కోట్ల రూపాయల పెట్టుబడి అంటే ఎన్నో విషయాలు ఆలోచించాల్సి ఉంటుంది. తొలి సినిమా డివైడ్ టాక్ వచ్చిన నేపథ్యంలో కృతిసనన్ మళ్లీ అలాంటి తప్పిదాలు దొర్లకుండా జాగ్రత్త పడుతుంది. ఈ క్రమంలోనే దో పత్తి తర్వాత కొత్త సినిమాకు లాంగ్ గ్యాప్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**వెకేషన్ ఆస్వాదనలో సీతమ్మ:** తాజా అప్ డేట్ నేపథ్యంలో కొత్త ప్రాజెక్ట్ కు సమయం ఆసన్నమైనట్లే. ఇక నటిగా కృతి సనన్ ఫుల్ బిజీగా ఉంది. ధనుష్ హీరోగా ఆనంద్ ఎల్. రాయ్ తెరకెక్కిస్తోన్న తేరే ఇష్క్ మేలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. హిందీ , తమిళ్ లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగు తున్నాయి. అలాగే కాక్ టెయిల్ 2లోనూ నటిస్తోంది. ప్రస్తుతం కృతిసనన్ విదేశీ వెకేషన్స్ లో ఉంది. అబుదాబీ అందాల్ని ఆస్వాదిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536